అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 10-5-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టు

- కోర్టు వెలుపల అదుపులోకి తీసుకున్న రేంజర్లు

వివరాలు 5లో..



సంపుటి : 9 | సంచిక : 129 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50



ఐక్యంగా పోరాడితే అన్నీ విజయాలే

ఎర్రజెండా నీడన పేదల గుడిసెలు

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కాలనీలకు నామకరణోత్సవం
- జక్కలొద్దికి ప్రగతినగర్,, బెస్తం చెరువు కాలనీకి లక్ష్మీపురం పేరు
- పేదలు తమ శక్తిని తెలుసుకోవాలి : తమ్మినేని వీరభద్రం
- నూతన గృహాలకు ప్రారంభోత్సవం



నవతెలంగాణ-మట్టెవాడ

పేదలు కలిసికట్టుగా పోరాడితే వారికి కావలసినవి ఖచ్చితంగా సాధించుకోవచ్చని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. వరంగల్ జిల్లా రంగసాయిపేటలో జక్కలొద్ది, బెస్తం చెరువు గుడిసె సెంటర్ల కాలనీ నామకరణ మహోత్సవ సభకు ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్యతో కలిసి తమ్మినేని హాజరయ్యారు. వీరికి గుడిసెవాసులు.. పూలు జల్లుతూ బతుకమ్మలు, బోనాలతో ...5లో

జనం సొమ్ముతో మోడీ ప్రచారం..

పర్యటనల పేరుతో బీజేపీకి పరోక్ష లబ్ది

అధికారిక కార్యక్రమాల్లో ప్రధాని తీరు

కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న అధికారిక యంత్రాంగాలు

- ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలే టార్గెట్
- పీఎం వ్యవహారశైలిపై ప్రతిపక్షాల ఆగ్రహం
- తప్పుబడుతున్న రాజకీయ విశ్లేషకులు



ఇపుడు కర్నాటకలో మోడీ అధికారిక పర్యటనల సమయం, ఆయన చేసిన ప్రారంభోత్సవాలు, వాటికయ్యే ప్రభుత్వ ఖర్చు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మోడీ పర్యటనలకు అయిన ఖర్చు (పలు వార్త పత్రికల కథనాల ఆధారంగా)

- మోడీ నగర పర్యటనకు సంబంధించి బెంగళూరు పౌర సంఘం రూ.24 కోట్లు ఖర్చు చేసింది.
- మోడీ యోగా దినోత్సవ సందర్శనకు కర్నాటక పుర, నగరపాలక సంస్థలు రూ.56 కోట్లు వెచ్చించాయి.
- కర్నాటకలోని కాల్బుర్గిలో కొన్ని గంటల పర్యటనకు రూ. 11.18 కోట్లు ఖర్చు చేశారు.కర్నాటకలోని కాల్బుర్గిలో కొన్ని గంటల పర్యటనకు రూ. 11.18 కోట్లు ఖర్చు చేశారు.
- ఐఐటీ-ధార్వాడ్ ప్రారంభోత్సవం కోసం రూ. 9.5 కోట్లు వెచ్చించారు.



- ఫిబ్రవరి 27న ప్రధాని పర్యటన సందర్భంగా కర్నాటక ప్రభుత్వం రూ. 36.43 కోట్లు ఖర్చు చేసింది.

బెలగావిలో ప్రధాని మోడీ ఈవెంట్ కోసం దాదాపు రూ. 14 కోట్లు ఖర్చు అయింది.

జనం సొమ్ముతో సోకులు పడటం ప్రధాని నరేంద్రమోడీకే చెల్లింది. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా అధికార పర్యటనల పేరుతో ఆ రాష్ట్రాల్లో పనిగట్టుకొని పర్యటిస్తూ కాషాయపార్టీకి 'దుర్మార్గ' ప్రచారాన్ని చేకూర్చే దుర్నీతికి పాల్పడుతున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఉన్న లక్ష్మణరేఖను చెరిపేస్తున్నారు. చివరకు ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే చోట్లకు కూడా 'అధికార' పర్యటనల పేరుతో ప్రత్యేక విమానాల్లో తిరిగొచ్చి ఓటర్లను ప్రభావితం చేసే చిల్లర ప్రచార చేష్టలకు పాల్పడుతున్నారు. ఆ మధ్య గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) స్థానిక సంస్థల ఎన్నికలైనా, ఇప్పుడు కర్నాటక అసెంబ్లీ ఎన్నికలైనా... ఆయన అధికార దుర్వినియోగ పర్యటనల పరమార్థం ఒక్కటే! ఇప్పటికే ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే ఆ రాష్ట్రంలోని ప్రముఖుల 'అవతారాలు' ఎత్తుతూ ఓటర్లను పట్టుకొనే ప్రయత్నం చేశారు. తమిళనాడులో లుంగీ కట్టుకుని ప్రచారానికి వెళ్తే, అక్కడి ఓటర్లు దాన్ని లాగిపారేశారు. పశ్చిమబెంగాల్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ అవతారం ఎత్తి వెళ్తే, అక్కడా కాళ్లు పట్టుకొని లాగేశారు. ఈ పగటి వేషాలతో పనికాదనుకున్నారో ఏమో... ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో అధికార పర్యటనల పేరుతో ప్రజాధనాన్ని కుమ్మరించి, ఓట్లు రాబట్టుకోవాలని తాపత్రయపడుతున్నారు. కానీ కన్నడ ఓటరు దెబ్బకి ఈసారికి కన్ను లొట్టపోతే...ఇంకేం వేషాలేస్తారో వేచిచూడాలి!!

న్యూఢిల్లీ : భారత్ బయోటెక్‌లో కొనసాగుతున్న కోవిడ్-19 వ్యాక్సిన్ ట్రయల్స్‌ను సమీక్షించేందుకు ప్రధాని మోడీ నవంబర్ 29, 2020న కేవలం ఒక గంట పర్యటన కోసం హైదరాబాద్‌కు వచ్చారు. 2020 నవంబర్ 26న ప్రధాని పర్యటన, షెడ్యూల్‌ను హైదరాబాద్ పోలీసులు మీడియాకు మూడు రోజుల ముందు మాత్రమే ధృవీకరించారు. అయితే, మోడీ పర్యటించిన సమయం మాత్రం తీవ్ర చర్చకు దారి తీసింది. ఆ సమయంలో హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల కోసం అధికార భారత రాష్ట్ర సమితి (అప్పట్లో తెలంగాణ రాష్ట్ర సమితి), ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు దూకుడుగా తలపడుతున్నాయి. అలాంటి సమయంలో మోడీ ఎలాంటి ప్రసంగాలు చేయనప్పటికీ, తెలంగాణ లోని టీవీ ఛానెల్‌లు, సోషల్ మీడియా మోడీ పర్యటనపై ...2లో



సీఎం ప్రధాన సలహాదారుడిగా సోమేశ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ సోమేశ్ కుమార్... సీఎం కేసీఆర్ ప్రధాన సలహాదారుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఆ పదవిలో మూడేండ్లపాటు కొనసాగనున్నారు. సోమేశ్ కుమార్ గతంలో తెలంగాణ సీఎస్‌గా పని చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆయన్ను ఏపీకి ...5లో

మధ్య ప్రదేశ్‌లో ఘోరం

- బస్సు నదిలో పడి 22 మంది మృతి



రాయ్‌పూర్ : మధ్యప్రదేశ్‌లో మంగళవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. రాష్ట్రంలోని ఖర్గోన్ జిల్లాలో ఒక వంతెనపై నుంచి నీళ్ల లేని నదిలో ఒక బస్సు పడిపోవడంతో 22 మంది మరణించారు. మరో 31 మంది తీవ్రంగా గాయపడ్డారు. బస్సు ...5లో

రక్తపాతాలు, కుట్రలను పురిగొల్పేది పెత్తందారీ శక్తులే !

- రెడ్ స్క్వేర్‌లో విక్టరీ డే పరేడ్‌లో పుతిన్



మాస్కో : నాజీల "పిచ్చి ఆశయాల" తాలూకు పర్యవసానాలను పశ్చిమ దేశాలు మర్చిపోయాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యాఖ్యానించారు. మాస్కోలో రెడ్ స్క్వేర్‌లో విక్టరీ డే పరేడ్ సందర్భంగా పుతిన్ ప్రసంగించారు. "ఆధిపత్యానికి సంబంధించిన ...5లో

మరో నలుగురు అరెస్ట్

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటి వరకు 27 మంది అరెస్ట్

- నలుగురు నిందితులను కస్టడీకి తీసుకోనున్న సిట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనలో మంగళవారం సిట్ మరో నలుగురిని అరెస్టు చేసింది. ప్రధాన నిందితుడైన ప్రవీణ్ నుంచి ఏఈ, ఏఈఈ పరీక్ష పత్రాలను ఖరీదు చేసిన ఇద్దరు దళారుల ద్వారా ఈ నలుగురు ప్రశ్నాపత్రాన్ని కొన్నారు. దళారులుగా వ్యవహరించిన వరంగల్‌కు చెందిన మనోజ్‌కుమార్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన మురళీధర్‌రెడ్డిని సోమవారం సిట్ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరు ప్రశ్నాపత్రాలను ఏడుగురికి అమ్మినట్టు వెల్లడించారు. ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షలకు ఒప్పందం చేసుకొని, అడ్వాన్స్‌గా లక్ష నుంచి రూ. 1.5 లక్షల వరకు తీసుకున్నట్టు విచారణలో తెలిపారు. దీంతో వారి నుంచి ప్రశ్నాపత్రాలు కొనుగోలు చేసిన వారి సమాచారాన్ని సిట్ సేకరించింది. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్‌కు చెందిన ఆది సాయిబాబు, ముడావత్ శివకుమార్, ...5లో

విచారణలో ఉన్న అంశంపై రాజకీయమా..?

కర్నాటకలో ముస్లిం రిజర్వేషన్ల గురించి

అమిత్ షా వ్యాఖ్యలపై సుప్రీం సీరియస్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కర్నాటకలో ముస్లిం రిజర్వేషన్లపై వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై సుప్రీంకోర్టు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై విచారణ జరుగుతున్న సమయంలో దీన్ని రాజకీయం చేయడం తగదని హితవు పలికింది. గౌరవ, మర్యాదలను పాటించాలని స్పష్టం చేసింది. ముస్లింలకు కల్పిస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేసి, లింగాయత్, వొక్కళిగ సామాజిక వర్గాలకు చెరొక రెండు శాతం చొప్పున కేటాయిస్తూ కర్నాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. తదుపరి విచారణ జులై 25న జరగనున్నది. ప్రభుత్వ



ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం ముస్లింలకు కల్పిస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తూ, లింగాయత్, వొక్కళిగ సామాజిక వర్గాలకు చెరొక రెండు శాతం చొప్పున కేటాయిస్తూ కర్నాటక ప్రభుత్వం ...5లో


నేడే కర్నాటకలో పోలింగ్

వివరాలు 5లో..

అమ్మాయిలదే హవా

ఇంటర్ ఫలితాల్లో వారిదే పైచేయి

- ఫస్టియర్‌లో 61.68 శాతం, సెకండియర్‌లో 63.49 శాతం ఉత్తీర్ణత
- ప్రథమ సంవత్సరంలో మేడ్చల్, ద్వితీయ సంవత్సరంలో ములుగు అగ్రస్థానం
- జూన్ 4 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ
- 16 వరకు ఫీజు చెల్లింపు గడువు
- నేటినుంచి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తులు
- ఫెయిలైన విద్యార్థులు ఆందోళన చెందొద్దు : విద్యా మంత్రి సబిత ఇంద్రారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక ఫలితాలను మంగళవారం హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డులో విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. ఈ ఫలితాల్లో అమ్మాయిలే హవా కొనసాగించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోనూ వారే పైచేయి సాధించడం గమనార్హం. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 4,82,675 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 2,97,741 (61.68 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 2,41,673 మంది అమ్మాయిలు పరీక్షలకు హాజరుకాగా, 1,65,994 (68.68 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 2,41,002 మంది అబ్బాయిలు పరీక్షలు రాస్తే, 1,31,747 (54.66 శాతం) మంది పాసయ్యారు. అంటే అబ్బాయిల కంటే అమ్మాయిలు 14.02 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 4,33,082 మంది పరీక్షలు రాస్తే, 2,72,208 (62.85 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 2,17,454 మంది అమ్మాయిలు పరీక్షలకు హాజరుకాగా, 1,49,723 (68.85 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 2,15,628 మంది అబ్బాయిలు పరీక్షలు రాయగా, 1,22,485 (56.80 శాతం) మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో 49,593 మంది పరీక్ష రాస్తే, 25,533 (51.48 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 4,65,478 మంది పరీక్షలకు హాజరుకాగా, 2,95,550 (63.49 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 2,29,958 మంది అమ్మాయిలు పరీక్షలు రాస్తే, 1,64,598 (71.57 శాతం) మంది ఉతీర్ణత పొందారు. 2,35,520 మంది అబ్బాయిలు పరీక్షలు రాయగా, 1,30,952 (55.60 శాతం) మంది పాసయ్యారు. అంటే ద్వితీయ సంవత్సరంలోనూ అబ్బాయిల కంటే అమ్మాయిలు 15.97 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత ...2లో

నేడు టెన్త్ ఫలితాలు

- మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్న మంత్రి సబిత

6లో..

వెనక్కి తగ్గం...

జీపీ కార్యదర్శుల మానవహారం

- కొనసాగుతున్న సమ్మె
- ఉద్యోగాలు తీసేస్తామంటూ నోటీసులివ్వడంపై ఆగ్రహం



నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమ్మె నిర్వీర్యానికి ప్రభుత్వం నోటీసుల పేరుతో బెదిరింపులకు దిగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మానవహారం, ప్రదర్శన రూపంలో నిరసన తెలిపారు.

ఖమ్మం జిల్లా వైరాలో వైరా, కొణిజర్ల, సింగరేణి, ఏన్కూర్, తల్లాడ మండలాల కార్యదర్శులు ఎంపీడీఓ కార్యాలయం నుంచి మధిర రోడ్డులోని గురుకుల పాఠశాల వరకు ప్రదర్శన నిర్వహించారు. మధ్యలో క్రాస్ రోడ్డులో మానవహారం నిర్వహించారు. సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించి ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పారుపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, చప్పిడి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కార్యదర్శుల ఉద్యోగం ఊస్టింగ్ అంటూ బెదిరింపులకు దిగటం, నోటీసులు ఇంటి తలుపులకు అంతించటం వంటి నిరంకుశ చర్యలను ఖండించారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి నాయుడుపేట వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. మధిరలో జెడ్పీ చైర్మెన్ లింగాల కమల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి ...5లో

నవతెలంగాణ

పదోన్నతుల చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి

- మంత్రి సబితకు పీఆర్టీయూ తెలంగాణ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టడానికి చర్యలు వెంటనే తీసుకోవాలని పీఆర్టీయూ తెలంగాణ కోరింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ బిక్షంగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. జీవో నెంబర్ ఐదు ప్రకారం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలు పెట్టిన తర్వాత కొందరు ఉపాధ్యాయులు ఆ మార్గదర్శకాలపై కోర్టుకు వెళ్లారని తెలిపారు. స్పౌజ్ పాయింట్లపైన, కొన్ని సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ప్రత్యేక పాయింట్లపైన న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. అంతే తప్ప పదోన్నతుల విషయం పైన ఎలాంటి అభ్యంతరం తెలుపలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విద్యా శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం ఒక్క పదోన్నతి కూడా ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 22 ఏండ్లుగా ఒకే క్యాడర్‌లో పనిచెయ్యడం విద్యా రంగ చరిత్రలో లేదని పేర్కొన్నారు. గతంలో ఇంతకన్నా జఠిలమైన సమస్యలున్నప్పుడు కూడా పదోన్నతులు కల్పించారని గుర్తు చేశారు. ప్రతినెలా పదోన్నతులు కూడా కల్పించారని తెలిపారు. వాస్తవానికి బదిలీలకు, పదోన్నతులకు ఎలాంటి సంబంధం లేదనే విషయాన్ని విద్యాశాఖాధికారులు ఎందుకు గ్రహించడం లేదో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆలోచించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. ఇప్పుడు చేపట్టకుంటే త్వరలో సాధారణ ఎన్నికలు వస్తాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్ రెండుసార్లు అధికారంలోకి వచ్చినా పదోన్నతులు కల్పించలేదన్న చరిత్ర మంచిది కాదని తెలిపారు.

బిజినెస్


రిలయన్స్‌కు అనుకూలంగా తీర్పు

- ఢిల్లీ హైకోర్టు వెల్లడి



న్యూఢిల్లీ : దాదాపు పదేళ్ళ క్రితం నాటి కేసులో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అనుకూలంగా మంగళవారం ఢిల్లీ హైకోర్టు తీర్పును ఇచ్చింది. 2014లో ప్రభుత్వ రంగ సంస్థ ఒఎన్‌జిసికి చెందిన ప్రాంతంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అక్రమంగా గ్యాస్ తోడేసుకుందన్న ప్రధాన ఆరోపణలను కోర్టు తోసిపుచ్చింది. గోదావరిలోని కెజి బేసిన్‌లోని కెజి-డిడబ్ల్యుఎన్-98/3 క్షేత్రం నుంచి రిలయన్స్ దాదాపు రూ.12వేల కోట్ల విలువ చేసే గ్యాస్‌ను అక్రమంగా తోడేసుకుందని ఒఎన్‌జిసి ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై ఆ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఇరు సంస్థలు కలిసి అమెరికా కేంద్రంగా పని చేస్తున్న కన్సల్టింగ్ ఏజెన్సీ డిగోల్యర్ అండ్ మాక్‌నాగ్టొన్ (డిఅండ్‌ఎం)ను నియమించుకోవడం ద్వారా నిజనిర్ధారణ చేయాలని కోరాయి. కాగా.. డిఅండ్‌ఎం కూడా రిలయన్స్‌కు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తునే.. ఆ మధ్యవర్తిత్వ అవార్డును పక్కన పెట్టాలని ఒఎన్‌జిసి, ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించాయి. కాగా.. 2018 జూలై 24 నాటి అంతర్జాతీయ మధ్యవర్తిత్వ అవార్డును ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి అనుప్ జైరామ్ భంభానీ సమర్థించారు. రిలయన్స్ ప్రధాన వాటాదారుగా ఉన్న ఈ కన్సోరియంలో బ్రిటన్ కేంద్రంగా పని చేస్తున్న బ్రిటిష్ పెట్రోలియం (బిపి), కెనడాకు చెందిన నికో రిసోర్సెస్ ఆఫ్ కన్సోరియం సంస్థలున్నాయి. ప్రస్తుత విలువ ప్రకారం ఆ సంస్థలు అన్యాయంగా 1.7 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.14 వేల కోట్లు) గ్యాస్‌ను తోడేసుకున్నాయన్న అప్పీల్‌ను తాజాగా ఢిల్లీ హైకోర్టు కొట్టివేసినట్లయ్యింది.

లింక్డిన్‌లో 716 మందిపై వేటు



న్యూఢిల్లీ: ఆర్థిక మాంద్యం భయాలు ప్రధానంగా ఐటి రంగంలోని ఉద్యోగుల ఉపాధిని తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. తాజాగా మైక్రోసాఫ్ట్‌కు చెందిన ఎంప్లాయిమెంట్ సోషల్ నెట్‌వర్క్ లింక్డిన్ 716 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. ఇది మొత్తం ఉద్యోగుల్లో 3.5 శాతానికి సమానం. లింక్డిన్‌లో దాదాపు దాదాపు 20వేల మంది పని చేస్తున్నారు. ఈ కంపెనీ ఆదాయాలు పెరుగుతున్నప్పటికీ ఉద్యోగులను ఇంటికి పంపించడం గమనార్హం. అలాగే చైనాలో ప్రత్యేకంగా సేవలు అందిస్తున్న జాబ్ అప్లికేషన్‌ను మూసివేస్తున్నట్లు తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితే దీనికి కారణమని లింక్డిన్ సిఇఒ ర్యాన్ రోస్లాన్స్కి వెల్లడించారు.

రూపాయి పతనం



న్యూఢిల్లీ : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ ఒత్తిడిని ఎదుర్కొంటుంది. మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 27 పైసలు కోల్పోయి 82.05కు పడిపోయింది. దేశీయ స్టాక్ మార్కెట్‌లు బలహీనంగా ట్రేడింగ్ కావడమే ఇం దుకు ప్రధాన కారణమని నిపుణులు భావిస్తున్నారు. అమెరికా డాలర్‌తో పోల్చితే రెండున్నర వారాల కనిష్టానికి పడిపోయింది. ఇంట్రాడేలో 81.83 -82.15 మధ్య కదలాడింది. సోమవారం సెషన్‌లో 81.78 వద్ద ముగిసింది.

భారీ హైడ్రాలిక్ ఎక్సకవేటర్లను ప్రదర్శించిన క్యాటర్‌పిల్లర్



హైదరాబాద్: నిర్మాణ, మైనింగ్ యంత్ర పరికరాల సంస్థ క్యాటర్ పిల్లర్ హైదరాబాద్‌లో తన భారీ హైడ్రాలిక్ ఎక్సకవేటర్లను ప్రదర్శించినట్లు తెలిపింది. జిఎంఆర్ ప్రాంగణములో జరిగిన వర్క్‌షాప్‌లో ఈ అత్యాధునిక సాంకేతికతా, వినూత్నత కలిగిన యంత్రాల్లో సరియైన పరికరాన్ని ఎంచుకోవడానికి వినియోగదారులకు అవకాశం దక్కిందని తెలిపింది. 374, 395 ఎక్సవేటర్లతో పాటుగా ఇటీవల ఆవిష్కరించిన క్యాట్ 350 ఎక్సకవేటర్‌లను ప్రదర్శించినట్లు పేర్కొంది.

అమ్మాయిలదే హవా

(మొదటిపేజీ తరువాయి)

పొందడం గమనార్హం. జనరల్ విభాగంలో 3,80,920 మంది పరీక్షలకు హాజరుకాగా, 2,56,241 (67.26 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 1,96,528 మంది అమ్మాయిలు పరీక్షలు రాయగా, 1,44,385 (73.46 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఒకేషనల్ విభాగంలో 43,015 మంది పరీక్షలు రాస్తే, 28,738 (66.80 శాతం) మంది విద్యార్థులు పాసయ్యారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్, సీవోఈ జయప్రదబాయి, జేడీలు వై శ్రీనివాస్, భీంసింగ్, సీజీజీ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు ప్రారంభం

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ నాలుగు నుంచి నుంచి ప్రారంభం కానున్నాయి. రోజుకు రెండు విడతల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. బుధవారం నుంచి ఫీజు చెల్లింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఫీజు చెల్లింపునకు తుది గడువు ఈనెల 16వ తేదీ వరకు ఉన్నది. బుధవారం నుంచి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. దరఖాస్తు చేసేందుకు తుది గడువు ఈనెల 16వ తేదీ వరకు ఉన్నది. రీకౌంటింగ్ కోసం ప్రతి పేపర్‌కూ రూ.100, రీవెరిఫికేషన్ కోసం ప్రతి పేపర్‌కూ రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని అధికారులు సూచించారు. విద్యార్థులు http://tsbie.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. మార్కుల మెమోలను మంగళవారం సాయంత్రం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. షార్ట్ మెమోలను కాలేజీ లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ వెబ్‌సైట్ నుంచి కలర్ ప్రింటౌట్ తీసుకోవాలని అధికారులు సూచించారు.

ఫస్టియర్‌లో మేడ్చల్, సెకండియర్‌లో ములుగు అగ్రస్థానం

ఇంటర్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ సంవత్సరంలో ములుగు జిల్లాలు అగ్రస్థానంలో నిలిచాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో మేడ్చల్ మల్కాజిగిరి నుంచి 62,553 మంది పరీక్షలు రాయగా, 47,474 (75 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 34,609 మంది అబ్బాయిలు పరీక్షలు రాస్తే, 25,150 (72 శాతం) మంది పాసయ్యారు. 27,944 మంది అమ్మాయిలు పరీక్షలకు హాజరుకాగా, 22,324 (79 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 73 శాతం ఉత్తీర్ణత సాధించి రంగారెడ్డి జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 68,289 మంది పరీక్షలు రాయగా, 50,433 (73 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 73 శాతంతో కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా మూడో స్థానంలో ఉన్నది.

ఈ జిల్లా నుంచి 4,371 మంది పరీక్షలు రాస్తే, 3,227 (73 శాతం) మంది పాసయ్యారు. 38 శాతం ఉత్తీర్ణతతో మెదక్ జిల్లా అట్టడుగున నిలిచింది. ఈ జిల్లా నుంచి 6,364 మంది పరీక్షలకు హాజరుకాగా, 2,462 (38 శాతం) ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో 73 శాతం ఉత్తీర్ణతతో నారాయణపేట జిల్లా అగ్రస్థానంలో, 40 శాతం ఉత్తీర్ణత సాధించి జగిత్యాల జిల్లా చివరిస్థానంలో నిలిచాయి. ఇంటర్ ద్వితీయ సంవ త్సరం జనరల్ విభాగం ఫలితాల్లో 85 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 1,632 మంది పరీక్షలు రాస్తే, 1,397 (85 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 844 మంది అబ్బాయిలు పరీక్షలు రాస్తే, 692 (81 శాతం) ఉత్తీర్ణత పొందారు. 788 మంది అమ్మాయిలు పరీక్షలకు హాజరుకాగా, 705 (89 శాతం) మంది పాసయ్యారు. 81 శాతం ఉత్తీర్ణతతో కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెండో స్థానంలో ఉన్నది. ఈ జిల్లా నుంచి 4 వేల మంది పరీక్షలకు హాజరైతే, 3,249 (81 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 75 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం ఫలితాల్లో 52 శాతం ఉత్తీర్ణత సాధించి మెదక్ జిల్లా అట్టడుగున నిలిచింది. ఈ జిల్లా నుంచి 5,320 మంది పరీక్షలు రాస్తే, 2,785 (52 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో 85 శాతం ఉత్తీర్ణతతో నారాయణపేట జిల్లా ప్రథమ స్థానం లో ఉన్నది. 52 శాతం ఉత్తీర్ణతతో జగిత్యాల జిల్లా అట్టడుగున నిలిచింది.

ఇంటర్ ఫలితాల వివరాలు

	హాజరు	ఉత్తీర్ణత	శాతం	ఫెయిల్
ప్రథమ	4,82,675	2,97,741	61.68	1,84,934
ద్వితీయ	4,65,478	2,95,550	63.49	1,69,928
మొత్తం	9,48,153	5,93,291	62.57	3,54,862

గ్రేడ్ల వారీగా వివరాలు

గ్రేడ్	ఫస్టియర్	సెకండియర్
ఏ	1,60,009	1,73,061
బీ	66,335	54,776
సీ	31,139	20,662
డీ	14,725	7,742

జెండర్ వారీగా ఇంటర్ ఫలితాలు

ఫస్టియర్	హాజరు	ఉత్తీర్ణత	శాతం
అమ్మాయిలు	2,17,454	1,49,723	68.85
అబ్బాయిలు	2,15,628	1,22,485	56.80
మొత్తం	4,33,082	2,72,208	62.85
సెకండియర్			
అమ్మాయిలు	1,96,528	1,44,385	73.46
అబ్బాయిలు	1,84,392	1,11,856	60.66
మొత్తం	3,80,920	2,56,241	67.26

ప్రభుత్వ కాలేజీల్లో టాపర్ల వివరాలు

కోర్సు	విద్యార్థిపేరు	జిల్లా	మార్కులు
ప్రథమ సంవత్సరం			
ఎంపీసీ	ఊట్ల సాయి అమూల్య	పెద్దపల్లి	465
"	సైమా జమ	హైదరాబాద్	465
బైపీసీ	ఆర్ శ్రీనిధి	పెద్దపల్లి	434
సీఈసీ	సానియా	హైదరాబాద్	481
హెచ్ఈసీ	కాళ్ల సందేశ్	హన్మకొండ	487
ద్వితీయ సంవత్సరం			
ఎంపీసీ	వైష్ణవి దేవి	సూర్యాపేట	991
బైపీసీ	తప్పెట రోషిణి	ఖమ్మం	990
సీఈసీ	మంజుల మంగ్య చవాన్	రంగారెడ్డి	973
హెచ్ఈసీ	దాసరి సిరి	ఖమ్మం	972

ఫెయిలైన విద్యార్థులు ఆందోళన చెందొద్దు : సబిత

ఇంటర్ ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులు, మార్కులు తక్కువగా వచ్చిన వారు ఆందోళన చెందొద్దని విద్యాశాఖ పి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు వెయిటేజీని తొలగించామని అన్నారు. విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించామన్నారు. ఫెయిలయ్యారని, మార్కులు తక్కువగా వచ్చాయంటూ విద్యార్థులపై తల్లిదండ్రులు కొప్పడొద్దని కోరారు. వచ్చేనెల నాలుగో తేదీ నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలున్నందున బాగా చదివి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఇతర మిత్రులతో కలిసి ఉన్నత చదువులకు వెళ్లొచ్చని మంత్రి సూచించారు.

ఇంటర్ జనరల్ విభాగం ఫలితాలు (శాతంలో...)

సంవత్సరం	ఫస్టియర్ హాజరు	ఉత్తీర్ణత	శాతం	సెకండియర్ హాజరు	ఉత్తీర్ణత	శాతం
2023	4,33,082	2,72,208	62.85	3,80,920	2,56,241	67.27
2022	4,14,380	2,68,763	64.85	3,92,258	2,69,431	68.68
2021	2,09,911	4,09,911	100	4,07,684	4,07,684	100
2020	4,31,358	2,63,463	61.07	3,74,492	2,60,703	69.61
2019	4,09,141	2,47,973	60.60	3,82,529	2,48,412	64.94

కోర్సుల వారీగా ఇంటర్ ఫలితాలు

కోర్సు	ఫస్టియర్ హాజరు	ఉత్తీర్ణత	శాతం	సెకండియర్ హాజరు	ఉత్తీర్ణత	శాతం
ఎంపీసీ	2,07,752	1,57,773	75.94	1,65,708	1,20,515	72.73
బైపీసీ	1,00,336	64,358	64.14	1,11,275	75,040	67.44
సీఈసీ	98,600	37,449	37.98	1,11,765	52,807	47.25
హెచ్ఈసీ	11,294	3,408	30.18	10,263	4,792	46.69
ఎంఈసీ	14,674	8,927	60.84	19,557	11,729	59.97

జనం సొమ్ముతో మోడీ ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

ఫోకస్ చేశాయి. దీంతో మోడీ 'అధికారిక' పర్యటన బీజేపీకి ఉద్దేశించిన అనధికారిక ప్రయోజనం చేకూర్చినట్టు బీఆర్ఎస్ నాయకులతో పాటు రాజకీయ విశ్లేషకులు అన్నారు. మోడీ నిత్యం ఎన్నికల యావలోనే ఉంటారనేది రహస్యమేమీ కాదని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి పార్లమెంటు ఎన్నికల వరకు.. ప్రతి ఎన్నికలలో కుదిరితే ప్రత్యక్షంగా, కుదరకపోతేపైన పేర్కొన్నట్టు అధికారిక కార్యక్రమాలు ప్రచార వేదికగా మలచుకుంటారని అంటారు.

ప్రారంభోత్సవాల 'ప్రచారం'

మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గత తొమ్మిదేండ్లలో ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాలలో బీజేపీ ఎన్నికల ప్రచారాల విషయంలో ఆయన అత్యుత్సాహాన్ని ప్రదర్శించారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకించి ఎన్నికలకు ముందు నెలల్లోనే అతను అధికారి ప్రారంభోత్సవాల పేరిట పర్యటించి, రాజకీయంగా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి ప్రసంగించటం పరిపాటిగా మారింది..

అసెంబ్లీ ఎన్నికలు జరిగే కర్నాటకలో ప్రధాని చేసిన ఈ ప్రారంభోత్సవాలు.. బీజేపీ ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు అదనం కావట విశేషం. రాష్ట్రమేదైనా ఎన్నికలకు నెలరోజుల ముందు ప్రధాని కచ్చితంగా ప్రారంభోత్సవాలు వంటివి చేస్తుంటారు. బెంగుళూరులోని బయ్యప్పనహళ్లిలో సర్ ఎం. విశ్వేశ్వరయ్య టెర్మినల్ ప్రారంభోత్సవం దీనికి ఒక ఉదాహరణ. ఇది మార్చి 2021లో సిద్ధంగా ఉన్నదని అధికారులు పేర్కొన్నప్పటికీ, జూన్ 2022లో ఒక ప్రచార కార్యక్రమంలో మోడీ దీనిని ప్రారంభించటం గమనార్హం.

- ఈ ఏడాది మార్చి చివరి వారంలో, బెంగళూరు మెట్రో యొక్క పర్పుల్ లైన్ ప్రారంభోత్సవం పనులు ఇంకా పూర్తి కానప్పటికీ దానిని అధికారిక కార్యక్రమంగా మోడీ మార్చుకున్నారు. బీజేపీ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయడంతో మోడీ అసాధారణ ఆర్భాటాలతో మెట్రో రైడ్‌ను చేపట్టారు. అయితే, పనులు సరిగ్గా జరగకపోవడంతో అందులో చాలా సమస్యలు ఏర్పడ్డాయి.
- బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్‌వేను మోడీ ప్రారంభించడం కూడా ఇలాంటి విమర్శలకే దారితీసింది. ప్రచారం జరిగిన మూడు రోజుల తర్వాత, వర్షాల కారణంగా దెబ్బతిన్న ఎక్స్‌ప్రెస్‌వేలోని రోడ్ల ఫోటోలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి.
- దేశ ప్రధాని హోదాలో అర్హత లేని ప్రాజెక్టులను మోడీ ప్రారంభించడం అనేక సందర్భాల్లో కనిపిస్తోంది. ప్రభుత్వం, పార్టీ సరిహద్దులను చెరిపివేస్తూ అధికారిక, పార్టీ కార్యక్రమాలను ఆయన కలిపి నిర్వహించిన సందర్భాలు అనేకం ఉన్నాయని విశ్లేషకులు తెలియజేస్తున్నారు.
- బీజేపీ ప్రచారకర్తగా మాండ్యాలో నిర్వహించిన భారీ రోడ్‌షో కోసం అయిన మొత్తం ఎవరు చెల్లించారని కర్నాటకలో ప్రజలు చర్చించుకోవటం చర్చనీయాంశంగా మారింది. అదే రోజు, మోడీ అధికారిక కార్యక్రమం అయిన ధార్వాడ్‌లో ఐఐటీ క్యాంపస్‌ను కూడా ప్రారంభించారు. అయితే బస్వరాజ్ బొమ్మై ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలను ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రజలను తీసుకువెళ్లడం చర్చకు దారి తీసింది.

కర్నాటకలో ప్రచారం కోసం అధిక సమయం

ఈ సంవత్సరం జనవరి 12 నుంచి ప్రారంభించి, మోడీ ఇప్పటివరకు ఎనిమిది సార్లు కర్నాటకను సందర్శించారు. మార్చి 29న కర్నాటక ఎన్నికల తేదీలను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రకటించకముందే ఆ నెలలో మోడీ రెండుసార్లు రాష్ట్రాన్ని సందర్శించారు. మార్చి 29న ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన తర్వాత కూడా మోడీ కర్నాటకకు తరచుగా పర్యటనలు కొనసాగించారు. టైగర్ ప్రాజెక్ట్‌కు 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా బందీపూర్ టైగర్ రిజర్వ్‌లో వివిధ కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఏప్రిల్ 9న ఆయన రాష్ట్రాన్ని సందర్శించారు. ప్రధాని పర్యటన ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమేనని ప్రతిపక్ష కాంగ్రెస్ విమర్శించింది. గతంలో వరదలు ముంచెత్తినా రాష్ట్రానికి సాయం చేయని మోడీ.. ఇపుడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే కర్నాటకలో పర్యటిస్తు న్నారని ఆరోపించింది.

బొమ్మై నేతత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఐఐటీ-ధార్వాడ్ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవం కోసం ప్రజలను రవాణా చేయడం, భోజనాలు, స్టేజ్ సెటప్‌లు, బ్రాండింగ్, ప్రమోషన్లు, ఇతర లాజిస్టిక్‌ల కోసం రూ.9.49 కోట్లు ఖర్చు చేసిందని ఆర్‌టిఐ సమాధానాలు వెల్లడించాయి. దీనిపై రాష్ట్రంలోని ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. ప్రజల సొమ్మును అధికారిక కార్యక్రమాల పేరిట సొంత ప్రచారానికి వాడుకోవడమేంటని ప్రశ్నించాయి.

ఆ ఐదు రాష్ట్రాల్లోనూ ఇదే వ్యూహం

త్రిపురలో ఈ ఏడాది ఫిబ్రవరి 16న ఎన్నికలు జరిగాయి. ఎన్నికలకు కొన్ని నెలల ముందు రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలు కాషాయ పార్టీని ఆందోళనకు గురి చేశాయి. ఎంసీసీ అమల్లోకి రావడానికి దాదాపు నెల రోజుల ముందు డిసెంబర్ 18న మోడీ త్రిపురలో రూ.4,350 కోట్ల విలువైన అభివద్ధి కార్యక్రమాలను ప్రకటించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద రూ. 3,400 కోట్లతో కొత్తగా నిర్మించిన గృహాలను లబ్ధిదారులకు అందించిన 'గృహ ప్రవేశ్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అగర్తలా నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి అగర్తలా బైపాస్ (ఖేర్‌పూర్-అమ్తాలి) విస్తరణ ప్రాజెక్ట్‌ను మోడీ ప్రారంభిం చారు. ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన కింద జాతీయ రహదారి 8ని విస్తరించడం, 232 కి.మీ పొడవుతో 32 రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడం వంటి ప్రాజెక్టును కూడా ప్రధానమంత్రి ప్రారంభిం చారు. 542 కిలోమీటర్ల మేర 112 రాష్ట్ర, జిల్లా రహదారుల ప్రాజెక్టులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు.అలాగే, ఇదే ఏడాది ముగిసిన గుజరాత్, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలకు ముందే మోడీ పలు ప్రారంభోత్సవ ప్రచార కార్యక్రమాలు చేశారని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేశారు. జనం సొమ్ముతో మోడీ సర్కారు అధికారిక కార్యక్రమాలను పార్టీ ప్రచార కార్యక్రమాలుగా మార్చుకోవడం ప్రజాస్వామ్యంలో ఏ మాత్రమూ మంచిది కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలి

- సమ్మెను విరమింపజేయాలి

సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 2019 ఏప్రిల్ నుంచి పనిచేస్తున్నారు. నోటిఫికేషన్ ప్రకారం ప్రొబేషన్ కాలం ఏప్రిల్ 2022కే పూర్తయ్యింది. అయినా మరొక్క సంవత్సరం పెంచుతూ ప్రభుత్వం జీవో తీసుకొచ్చింది. ఈ గడువు కూడా 11ఏప్రిల్ 2023తో ముగిసింది. తెలంగాణలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థ ఉండకూడదన్న మీరు, నాలు గేండ్ల ప్రొబేషన్ గడువు పూర్తయినప్పటికీ రెగ్యులరైజ్ చేయకపోవడం బాధాకరం.వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. వాళ్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలి' అని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. లేఖలో పేర్కొన్న అంశాలు ఇలా ఉన్నాయి.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రతి అభివద్ధి కార్యక్రమాన్ని అమలు చేస్తూ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో వివిధ గ్రామాలకు అనేక అవార్డులు కూడా తీసుకొచ్చారు. స్థానిక సంస్థల్లో వాళ్ల పాత్ర చాలా కీలకమైనది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన వాళ్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 11 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే, వారిని చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాల్సింది పోయి, కార్మికులనే విధుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం బెదిరించడం అప్రజాస్వామికం.



- జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవోను విడుదల చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. నాలుగేండ్ల ప్రొబేషన్ కాలన్ని సర్వీసు కాలంగా గుర్తించాలి.
- ప్రస్తుతం పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులనందరినీ జేపీఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ పని చేసిన కాలాన్ని ప్రొబేషన్ పీరియడ్‌లో భాగంగా పరిగణించాలి. రెగ్యులరైజ్ చేయాలి.
- రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ సంఖ్యను నిర్ధారించి ప్రకటించాలి.
- మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాల నుంచి కారుణ్య నియమకాలు చేపట్టాలి.
- అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించాలి.
- జీవో నంబర్ 317 వల్ల నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలి. పరస్పర బదిలీలు, స్పౌస్ బదిలీలకు అవకాశం కలిపించాలి.

మహిళా మల్లయోధుల పట్ల నియంతృత్వమా?

- మోడీ ప్రభుత్వం మొండి వైఖరిని వీడాలి :మల్లు లక్ష్మి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెజ్లర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం నియంతృత్వం తగదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి హితవు పలికారు. కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా, మహిళా రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి మద్దతుగా, ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌ను అరెస్టు చేయా లని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణను నిర్వహించారు. ఐద్వా అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన కార్యక్రమంలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ కుస్తీ పోటీల్లో బంగారు పథకాలు సాధించి, దేశానికి పేరు ప్రతిష్టలు తెచ్చిన రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన డబ్ల్యూఎఫ్ఎస్ఐ అధ్యక్షులు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రెండు వారాలుగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు ఆందోళన చేస్తుంటే కేంద్రానికి పట్టదా? అని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమాంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. జ్యోతి, బత్తుల హైమావతి, కె.ఎన్ ఆశలత, రాష్ట్ర సహాయకార్యదర్శులు, బుగ్గవీటి సరళ, ఎమ్ భారతి, రత్నమాల, అహల్య బి. అనురాధ, శారద, నర్మద, రమణ, అనురాధ, శశికళ, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ ప్రమాణం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎంఐఎం నేత మీర్జా రహ్మత్ బేగ్ మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. మంగళవారం ఈమేరకు శాసనమండలి చైర్మెన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి బేగ్ చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసనసభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడి, మండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, జాఫర్ హుస్సేన్ మెరాజ్, సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, బీఆర్ఎస్ఎల్‌పీ కార్యదర్శి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఉప్పల శ్రీనివాస గుప్త



నవతెలంగాణ- నాగోల్

పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును మంగళవారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్, ఉప్పల్ ఫౌండేషన్ చైర్మెన్, ఐవీఎఫ్ జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త కలిశారు. నూతన సచివాల యంలో మంత్రిని కలిసి పూల బొకే అందించారు.



ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య


నెల క్రితం ఆత్మహత్య చేసుకున్న మరో విద్యార్థి ఏ గ్రేడ్‌లో పాస్..

నవతెలంగాణ-ఆర్మూర్ / మెడిపల్లి /కేసముద్రం రూరల్

ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యామన్న మనస్తాపంతో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో మంగళవారం జరిగాయి. మరో ఘటనలో.. పరీక్షలు బాగా రాయలేదన్న కారణంతో గత నెల 10వ తేదీన మహబూబాబాద్‌కు చెందిన విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా, ఆ విద్యార్థి ఏ గ్రేడ్‌లో పాస్ అవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన ప్రజ్వల్ (17) హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కాగా మంగళవారం వెలువడిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ప్రజ్వల్ ఫెయిలయ్యాడు. దాంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి తండ్రి ఆర్ఎంపీ వైద్యుడు. ఎదిగిన కొడుకు ఆత్మహత్యకు పాల్పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన బొడ్డుపెల్లి అభిషేక్ (17) జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్టేషన్ హౌసింగ్ అధికారి సుధీర్ రావు తెలిపారు.



జగిత్యాల విద్యార్థి



నిజామాబాద్ విద్యార్థి



వరంగల్ విద్యార్థి

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పిక్లా తండా, బోడగుట్ట గ్రామ పంచాయతీకి చెందిన రైతు దంపతులు గుగులోతు లచ్చు, జ్యోతిక కుమారుడు గుగులోతు కృష్ణ(19) వరంగల్‌లోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ చదివాడు. పరీక్షలు బాగా రాయలేదని, ఫెయిల్ అవుతానేమోననే భయంతో రిజల్ట్ రాకముందే గత నెల 10న సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో కృష్ణ 1000 మార్కులకు గాను 892మార్కులు సాధించి ఏగ్రేడ్‌లో పాసయ్యాడు. దాంతో తల్లిదండ్రులు, అతని సోదరి.. 'అయ్యో బిడ్డా.. అనుమానంతో తనువు చాలిస్తివి... పరీక్షల్లో మంచి మార్కులు సాధించి.. జీవితంలో ఫెయిల్ అయితివి' అంటూ కన్నీరుమున్నీరయ్యారు. కాగా, కృష్ణ ఎంబీబీఎస్ చదవాలనుకున్న తాను.. ఆ స్థాయిలో తాను రాణించ లేకపోతున్నానని, ఫెయిల్ అవుతానేమోనన్న భయంతో చనిపోతున్నానని, అమ్మనాన్నలు క్షమించడంటూ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

ఆ వ్యాఖ్యలు

దురహంకారానికి నిదర్శనం

తలసానిపై మల్లు రవి ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గాంధీ కుటుంబంపై రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి ఖండించారు. సకల సంపదలను, జీవితాన్ని త్యాగం చేసి చివరకు దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం నుంచి వచ్చిన ప్రియాంక గాంధీపై తలసాని అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన దురహంకారనికి నిదర్శనమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తలసాని తలబిరుసు తనానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

జూనియర్ పంచాయతీ సెక్రటరీలను

క్రమబద్ధీకరించాలి

సీఎం కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ పంచాయితీ కార్యదర్శుల పరిస్థితి బానిసల కంటే హీనంగా తయారైందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వారి హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వారి సమస్యలను పరిష్కారించాలంటూ మంగళవారం సీఎం కేసీఆర్‌కు రేవంత్ బహిరంగ లేఖ రాశారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలంటూ జీపీఎస్‌లు గత 12 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. ఎంత సేపు రాజకీయాలే తప్ప జూనియర్ పంచాయితీ కార్యదర్శుల గోసను పట్టించుకునే సోయి లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోనే మన పంచాయితీలు ఆదర్శమనీ, అందుకే కేంద్రం అవార్డులు ఇస్తుందంటూ రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నదని ఎద్దేవా చేశారు. పగలనకా, రాత్రనకా కుటుంబాలను సైతం పట్టించుకోకుండా పంచాయతీ కార్యదర్శులు పడిన శ్రమతోనే అవార్డులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇంత చేసి అవార్డులు తెస్తే వారి సర్వీసులను రెగ్యులర్ చేయకుండా వేధించడం ఎంత వరకు సహేతుకమని ప్రశ్నించారు. వారి కష్టానికి ప్రభుత్వం ఇచ్చే రివార్డు ఇదేనా? అని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ మూడేండ్ల సమయం 2022, ఏప్రిల్ 11న పూర్తయిందని తెలిపారు. ప్రొబేషన్ పీరియడ్ తర్వాత జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తానమంటూ సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వారి సమస్యలను సావధానంగా విని పరిష్కరించాల్సిన ప్రభుత్వం... సమ్మె విరమించి, విధుల్లో చేరకపోతే ఉద్యోగాలు తొలగిస్తామంటూ హెచ్చరించమేంటని ప్రశ్నిం చారు. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి ఉన్నత స్థానంలో నిలవాలనే ఆశ ఉన్నప్పటికీ తక్కువ జీతమే అయినా ప్రభుత్వ ఉద్యోగావకాశాన్ని వదలుకోకూడదనే లక్ష్యంతోనే అనేక మంది జీపీఎస్‌లు ఉద్యోగాల్లో చేరారని గుర్తు చేశారు. ఎంతో పనిభారం పెరిగినా, భరిస్తూ రెగ్యులర్ చేస్తారనే ఆశతో ఎదురు చూశారని తెలిపారు. మూడేండ్ల ప్రొబేషన్ ముగిసినా... మరో ఏడాది పొడిగించిన అలస్యంగానైనా న్యాయం జరుగుతుందనే సదుద్దేశంతో దానికి కూడా అంగీకరించి తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించారని తెలిపారు. ఇప్పుడు నాలుగేండ్ల ప్రొబేషన్ పీరియడ్ ముగిసినా ఉద్యోగాలను రెగ్యులర్ చేయకపోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పంచాయితీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాల్సిన బాధ్యత సీఎంపై ఉందని పేర్కొన్నారు. లేదంటే వారి పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలవడమే కాక...ప్రత్యక్ష కార్యచరణకు సైతం సిద్ధమవుతామని రేవంత్ హెచ్చరించారు.

బీసీ గురుకుల విద్యార్థుల ర్యాంకుల పంట

అభినందించిన మంత్రి గంగుల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇంటర్ ఫలితాల్లో మహాత్మా జ్యోతిభా పూలే బీసీ గురుకుల విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించి తమ సత్తాను చాటారని మంత్రి గంగుల కమలాకర్, ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, కార్యదర్శి మల్లయ్య బట్టు తెలిపారు. వందల సంఖ్యలో విద్యార్థులు పదిలోపు ర్యాంకులు సాధించి ఫలితాల్లో ప్రభంజనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. వారిని అభినందిస్తున్నట్టు తెలిపారు. సకల సౌకర్యాలతో ఉన్నత స్థాయి నాణ్యతా ప్రమాణాలతో బీసీ బిడ్డలకు అందించిన విద్య వల్లనే ఈ ఫలితాలొచ్చాయని తెలిపారు.

క్రమబద్ధీకరణ ఉత్తర్వులపై టీయుఎంహెచ్ఇయూ హర్షం

- ఉన్నతాధికారులకు ధన్యవాదాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయా విభాగాల్లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ఉత్తర్వులను విభాగాల అధిపతులు జిల్లా అధికారులకు జారీ చేశారు. ఇటీవల వైద్యారోగ్యశాఖలో 1,331 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేతా మహంతి, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావులకు తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిాస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇ యూ) గౌరవాధ్యక్షులు భూపాల్, కాంట్రాక్ట్ ఉద్యోగుల నాయకులు మోహన్ రెడ్డి, అరుణ, సత్య ఏఎన్ఎంల నాయకురాలు రాజేశ్వరి, నిర్మలతో ఉద్యోగులు, సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. తదితరులు అధికారులను కలిసి ధన్యవాదాలు తెలిపారు. శ్వేతా మహంతి, డాక్టర్ శ్రీనివాసరావుతో పాటు అడిషనల్ డైరెక్టర్ విజయను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సంపాదకీయం

మణిపూర్... మరో రోమ్

"కండ్లముందే ఊళ్లు కాలిపోయాయి. క్యాంపస్‌లో ఉండబట్టే బతికి బయటపడ్డాం. బాంబుల మోతలు, తుపాకీ తూటాల చప్పుళ్లు... ఇప్పటికీ వణుకుపుట్టిస్తున్నాయి." ఇది మణిపూర్ నుంచి హైదరాబాద్ చేరుకున్న విద్యార్థుల ఆవేదన. ఈ వ్యాఖ్యలు కల్లోలిత మణిపూర్ తాజా పరిస్థితికి నిదర్శనం. మణిపూర్ ఒక్కసారిగా జాతి వైషమ్యాలతో

రాష్ట్ర జనాభాలో 53శాతంగా మెయితీ తెగ షెడ్యూలు కులాల జాబితాలో చేర్చాలని చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. అది వీలవుతుందో కాదో చట్టబద్ధమో కాదో స్పష్టంగా చెప్పాల్సిన న్యాయస్థానమే... వారి కోర్కెను పరిశీలించాలని గత నెల 20న రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చినట్టు వార్తలొచ్చాయి. దాన్ని గనుక అమలు జరిపితే గిరిజనులైన కుకీలు, నాగాలు భూములు కోల్పోతామని భయపడ్డారు. అక్కడి బీజేపీ ప్రభుత్వం వారి అనుమానాలను తీర్చే ప్రయత్నం చేయకపోవడంతో... సిఎం బిరేన్ సింగ్ చురుచందపూర్ అనే చోట ఒక జిమ్‌ను ప్రారంభించేందుకు రానుండగా, ముందు రోజు నిరసనకారులు దాన్ని తగులబెట్టారు.

ఎగసిపడుతోంది. 60శాతంపైగా ఉన్న మెయితీలకూ, 40శాతం ఉన్న కుకీలు, నాగా గిరిజన జాతులకూ మధ్య రగిలిన చిచ్చు నేడు మణిపూర్ అస్తిత్వాన్నే ప్రశ్నిస్తుంది. అది చినికి చినికి గాలివానగా మారి అరవై ప్రాణాలను పొట్టన పెట్టుకున్నది. మతం రంగునూ పులుముకొన్న ఈ ఘర్షణలకు వందలాది మంది క్షతగాత్రులయితే... వేలాది మంది సాధారణ ప్రజలు నిరాశ్రయులై సైనిక కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఇదే ఘోరకలి మరో విపక్షపాలిత రాష్ట్రంలో జరిగివుంటే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందా? రాష్ట్రపతి పాలన విధించి తక్షణమే తన అధీనంలోకి తెచ్చుకునేది! అక్కడ చేతకాని ప్రభుత్వం ఉండటం వలనే ఇలాంటి ఘోరం జరిగిందని ఎదురుదాడి చేసేది. అందివచ్చిన ఏ చిన్న అవకాశాన్ని జారవిడుచుకునేది కాదు! కానీ, ఇప్పుడు తమ పాలనలోనే మణిపూర్ మండుతుంటే ఈ డబుల్ ఇంజన్ సర్కార్ ఏం చేస్తోంది?! ఇదంతా ఏలినవారి ఎజెండాలో భాగమే అన్నది బహిరంగ రహస్యమే. అందుకే ప్రధానమంత్రిగారు ఇంత వరకు మాటవరుసకైనా స్పందించలేదు.



మెయితీ తెగను ఎస్టీల్లో చేర్చేందుకు వీలుగా కేంద్రానికి సిఫార్సు చేయాలని మణిపూర్ హైకోర్టు గత నెలలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దానిపై కుకీ, నాగా గిరిజనుల అభ్యంతరాలే నేటి ఘర్షణలకు ప్రధాన కారణాలైనప్పటికీ, పరిష్కారంలో అధికార పక్షం నిర్లక్ష్యానికి అర్థమేమిటీ? విధ్వంసాలతో తెగల మధ్య వైరం నివురుగప్పిన నిప్పులా ఎండ్ల తరబడి రగులుతోంది. సామాజికంగా, రాజకీయంగా శక్తిసంపన్నులైన మెయితీలను ఎస్టీ జాబితాలో చేరిస్తే తమ అస్తిత్వానికి ముప్పు వాటిల్లుతుందని గిరిజనుల కలవరం. కొండ ప్రాంతాల్లోని రక్షిత అటవీ స్థలాల్లో నివసిస్తున్న వారిని బయటికి తరలించేందుకు బీజేపీ సర్కారు ఇటీవల చేపట్టిన 'గిరిజనం' కార్యక్రమం ఆ భయాన్ని మరింత పెంచింది. రెండు వర్గాల మధ్య ఐక్యతను ప్రోదిచేయడంలో, ఆదిలోనే ఘర్షణలకు అడ్డుకట్ట వేయడంలో 'డబల్ ఇంజన్' సర్కార్ ఘోరంగా విఫలమైంది. అందుకే పరిస్థితి పూర్తిగా కట్టుతప్పింది. కానీ, మెజారిటీలైన మెయితీలను ఓటు బ్యాంకుగా మార్చుకోవాలన్నదే పాలక పార్టీ ఆలోచనైతే మాత్రం ఇంతటి ప్రమాదాన్నీ లక్ష్యపెట్టరా?! భౌగోళికంగా సున్నితమైన ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి శూన్యమైతే అది దేశ భద్రతకే పెనుప్రమాదం.

రాష్ట్ర జనాభాలో 53శాతంగా మెయితీ తెగ షెడ్యూలు కులాల జాబితాలో చేర్చాలని చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. అది వీలవుతుందో కాదో చట్టబద్ధమో కాదో స్పష్టంగా చెప్పాల్సిన న్యాయస్థానమే... వారి కోర్కెను పరిశీలించాలని గత నెల 20న రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చినట్టు వార్తలొచ్చాయి. దాన్ని గనుక అమలు జరిపితే గిరిజనులైన కుకీలు, నాగాలు భూములు కోల్పోతామని భయపడ్డారు. అక్కడి బీజేపీ ప్రభుత్వం వారి అనుమానాలను తీర్చే ప్రయత్నం చేయకపోవడంతో... సిఎం బిరేన్ సింగ్ చురుచందపూర్ అనే చోట ఒక జిమ్‌ను ప్రారంభించేందుకు రానుండగా, ముందు రోజు నిరసనకారులు దాన్ని తగులబెట్టారు. దాన్ని ఆదిలోనే అంతం చేయాల్సిన ప్రభుత్వం... కనిపిస్తే కాల్చివేత ప్రకటించి నిరసనకారులను మరింత రెచ్చగొట్టింది. గిరిజన విద్యార్థి సంఘం మే మూడో తేదీన చురుచందపూర్‌లో గిరిజన సంఘీభావ ప్రదర్శనకు పిలుపునిచ్చింది. ఆ సందర్భంగా హింసాకాండ చెలరేగింది. గిరిజనేతర ప్రాంతాల్లోని గిరిజనుల మీద, చర్చిల మీద దాడులు జరిగి రాష్ట్రం అగ్నిగుండమైంది.

చిత్రం ఏమిటంటే మరో రోమ్ నగరంగా మణిపూర్ తగలపడుతుంటే... మోడీ మాత్రం మరో నీరో చక్రవర్తిలా ఎన్నికల ఫిడేల్ వాయించుకుంటున్నారే కానీ, ఇంత జరుగుతున్నా ఒక్క మాట మాట్లాడిన పాపాన పోలేదు. కల్పిత కట్టుకథలతో కేరళ సమాజాన్ని అవమానపరిచేందుకు తీసిన 'కేరళ స్టోరీ' గురించి మాట్లాడతారు. 'జై భజరంగ భళీ'... అంటూ మతం పేరుతో కన్నడనాట రాజకీయం చేసేందుకు, ట్వీట్లతో ఎదురుదాడికి దిగేందుకు మాత్రం తీరిక దొరుకుతుంది. కానీ, రెజ్లర్ల మీద పోలీసు జులుం గురించో, కాశ్మీర్, మణిపూర్ గురించో పట్టించుకోవడం అటుంచి, కనీసం ప్రస్తావించడానికి కూడా వారికి తీరిక దొరకదు! ఈశాన్య రాష్ట్రంలో తెగల నడుమ రాజుకున్న విద్వేషాగ్నుల్ని చల్లార్చేందుకు కేంద్రమే చొరవ తీసుకోవాలి. సామాజిక అశాంతిని రూపుమాపి శాంతి భద్రతలు నెలకొల్పి ప్రజల ప్రాణాలకు భరోసా ఇవ్వాలి.



చూస్తూ... చూస్తుండగనే సుబ్బారావు కాస్తా ఆంజనేయుడిగా మారిపోయాడు. ఆంజనేయుడు అంటే ఆంజనేయస్వామి కాదు. వేషధారిగా...

సుబ్బారావు నగర కార్పొరేషన్ కార్యాలయంలో చిరుద్యోగి. పౌరాణిక నాటకాలంటే పిచ్చి. షణ్ముఖి - లక్ష్మణరావుల 'రామాంజనేయుద్ధం పద్య నాటకాన్ని లెక్కలేనన్ని సార్లు చూశాడు. అర్ధరాత్రి అపరాత్రి అని లేకుండా 5-10మైళ్ళు నడిచి లేదా సైకిల్‌తొక్కి, చమట్లు కక్కుతూ ఆ నాటకాలను చూసి ఇంటికి వచ్చేవాడు. ఏమాట కామాటే చెప్పుకోవాలి. రాముని పాత్రకంటే ఆంజనేయ పాత్ర అంటేనే సుబ్బారావుకు అభిమానం. ఆంజనేయ పాత్రలో అచ్చం లక్ష్మణరావు పాడినట్టు శ్రీ... రాఘురామ్ అంటూ దీర్ఘశృతిలో రాగాలు తీసేవాడు. సిగ్గు ఎక్కువ కాబట్టి ఒంటరిగా ఉన్నప్పుడు బాత్రూమ్‌లోనో లేదా రాత్రుళ్ళు భయం వేసినప్పుడు

'జై భజరంగభలి'

రహదారుల వెంట బిగ్గరగా పాడుకునేవాడు. కలవరించేవాడు. రాం.. రాం.. రాం.. అంటూ భజన చేసేవాడు. కుప్పిగంతు లేసేవాడు. నిద్రలోనే... కొత్తలో భార్యా బిడ్డలు జడుసుకునేవారు. తన్నొక్కడినే వదలిపెట్టి వేరేగదిలో పడుకునేవారు. అలా వారి మధ్య దూరం పెరిగింది. ఇవన్నీ సుబ్బారావుకు గుర్తుంది.


కె. శాంతారావు
9959745723

మళ్ళీ ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోడీ 'జై భజరంగభళీ' అంటూ ఓటేయండి అని పిలుపు ఇవ్వగానే మరల పాత జబ్బు తిరిగ బడిందేమోనని భయం వేస్తున్నది.

తనని తాను అద్దంలో చూసుకోకపోయినా శరీరం అంతా పచ్చరంగు అయిపోయినట్టు ఎర్ర లాగు తొడుక్కున్నట్టు. మూతికి ఎర్ర స్పాంజి అతికించినట్టు, లాగులోనుండి ఎస్ ఆకారంలో వంకర తిరిగిన తోక ఉన్నట్టు అన్నీ స్పష్టంగా కనిపి స్తున్నాయి. వీకో వజ్రదంతి టూత్‌పేస్ట్ యాడ్‌లాగా ప్రధానమంత్రి మాటలు తన మీద అంత 'ప్రభావంతమైనవి'గా పనిచేస్తున్నదా... ఒకటే అనుమానం...

అదిగో... జై భజరంగభలి అంటూ ఆంజనేయుడి వేషంలో పరిగెడుతున్నాను. గాలిలో తేలిగ్గా ఎగురుతున్నాను. ట్రాఫిక్ జామ్ ఉన్నా సూపర్ మాన్‌లా గెంతేస్తున్నాను. కార్లు, బస్‌లు దూకేస్తున్నాను. ఫ్లైఓవర్‌లు ఏంకర్మ - మెట్రోపైకి కూడా ఎక్కేస్తున్నాను. అరె అందరూ నన్ను కింద నుండి చూస్తూ చప్పట్లు కొడుతున్నారే... భలే... భలే...

ఆ... గుర్తొచ్చింది. ఇంటర్ చదివే రోజుల్లో ఒకతను కోతివేషం వేసి అచ్చం కోతిలాగానే గబగబా చెట్లు ఎక్కేవాడు. కరెంటు పోల్స్ పైకి చకచకా పాకేవాడు. పిట్టగోడ లెక్కేవాడు. అరటిపళ్ళకొట్లో దూరి తినేవాడు. ఎవ్వరూ ఏమనేవారు కారు. ఆ తర్వాత బాబూ ధర్మం చేయండి అని అడుక్కునేవాడు. అందరూ డబ్బులిచ్చేవారు పాపం. నేను కూడా సినిమా చూద్దామని తెచ్చుకున్న రెండ్రూపాయిలు వేరే ఆలోచనలేకుండా ఇచ్చేసా... అప్పుడు.

ఇదేంటి ఇప్పుడు నేనూ అలా మారిపోయినా అందుకేగా జనాలు చూసి నవ్వుతున్నారు. చప్పట్లు కొడుతున్నారు.

దీన్నేమంటారు అసలు? కవులు రచయితలైతే చైతన్య స్రవంతి అని అంటారేమో..! మానసిక వైద్యులైతే ఇల్యూజన్ డిజ్‌ఆర్డర్ అనవచ్చేమో... ఆఁ... ఎవరేమనుకుంటే నాకేంటి? నాదారి నాదే...

హమ్మయ్య... పోలింగ్ బూత్ వచ్చింది. జై భజరంగభలి అని మీట నొక్కబోయాడు. గుర్తులు చూశాడు. ఏవేవో గుర్తులున్నాయి. అంతా మోసం. దగా... అంటూ గుండెలు బాదుకున్నాడు. వెర్రి కేకలు వేస్తున్నాడు. ప్రిసైడింగ్ ఆఫీసర్ గల్లా పట్టుకుని అరుస్తున్నాడు. రామబాణం గుర్తు ఏది? నేను ధరించే గధ ఏది? మీ ఇష్టం వచ్చినట్టు గుర్తులు మార్చేస్తారా..? ఇది ప్రజాస్వామ్యం అనుకున్నారా..? పిచ్చి చేష్టలు అనుకున్నారా..? ప్రధానమంత్రి మాట అంటే మీకు లెక్కేలేదా? జై భజరంగభలి అనగానే కొబ్బరి కాయ కొట్టాలి కదా? కొబ్బరికాయలేదు. అరిటిపళ్ళు, హారతి పళ్ళెం లేదు, అగరొత్తులూ లేవు. ఉండండి మీ పనిచెప్తాను. ఇప్పుడే పిఎంకు, ఎన్నికల కమిషన్‌కు కంప్లైంట్ చేస్తా... నిజంగానే కంప్లైంట్ చేస్తా'... అరుస్తున్నాడు.

తప్పున నీళ్ళ ముద్దై కళ్ళు తెరిచాడు. ఖాళీబక్కెట్‌తో ఉగ్రకాళిలా ఎదురుగా భార్యామణి.

'మీకు పిచ్చి బాగా తలకెక్కింది..?

'అవునే ఏం చేయను... ఎంత వద్దన్నా అవే కలలు వస్తున్నాయి. ఓ పనిజేయి. రోకలి బండ తెచ్చి తలకు చుట్టు...' అన్నాడు అదోలా నవ్వుతూ..!

'జోకా... నాకు మాత్రం నవ్వు రాదు. కాంట్రాక్టు పనుల్లో మీ ప్రభుత్వం తీసుకునే నలభైశాతం కమిషన్‌ల గురించి ఇవ్వాళ కాకపోయినా రేపైనా బయటకు రాకమానదు, మీటూ ఉద్యమంలా. ఎప్పటికైనా వెంటాడుతూనే ఉంటుంది. అప్పుడు నిజంగానే ముత్యాలముగ్గు సినిమాలో అల్లురామలింగయ్యలా పిచ్చికోతైపోతారు. తెలుసా...' అన్నది భార్యామణి.

ఏంటి ఆంజనేయ స్వామిగా కాదా... పిచ్చి కోతినైపోతానా..? బట్టలు చించుకుంటానా..? జుట్టుపీక్కుంటానా...? •

పెరుగుతున్న చైనా పలుకుబడి తగ్గుతున్న అమెరికా పెత్తనం!

ఆఫ్రికాలోని కీలక దేశమైన సూడాన్‌లో పారా మిలిటరీ-మిలిటరీ మధ్య కొనసాగుతున్న అంతర్యుద్ధంలో ఇప్పటి వరకు ఆరువందల మందికి పైగా మరణించగా ఐదువేల మంది గాయపడినట్లు వార్తలు. అమెరికా మార్గదర్శకత్వంలో సూడాన్ మిలిటరీ-పారామిలిటరీ మధ్య రంజాన్ మాసంలో కుదిరిన ఒప్పందాలు విఫలమయ్యాయి. దీంతో అక్కడ శాంతి, భద్రతలు భగ్నం కావటానికి కారకులైన వ్యక్తుల మీద ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ప్రకటించాడు. తరువాత వైరి పక్షాల మధ్య రాజీకుదిర్చేందుకు చైనా రంగంలోకి దిగుతుందా అన్న చర్చ మొదలైంది. మిలిటరీకి అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మద్దతు ఉండగా పారామిలిటరీకి పశ్చిమాసియా, మధ్యప్రాచ్యం లోని కొన్ని దేశాల మద్దతు ఉంది. సంక్లిష్టమైన ఈ వివాదంలో చైనా ఏ పక్షమూ వహించటం లేదన్న ఒక్క సానుకూల అంశం తప్ప సయోధ్య కుదుర్చటం, కుదరటం అన్నది అంత తేలిక కాదు. ఆఫ్రికా సమస్యలను ఆఫ్రికాయే పరిష్కరించు కోవాలి అన్న ఆఫ్రికా యూనియన్ వైఖరిని గౌరవిస్తున్న చైనా ఏ దేశ వివాదంలోనూ ఒక పక్షం వైపు మొగ్గలేదు.


ఎం. కోటేశ్వరరావు

ఆఫ్రికాలో పశ్చిమ దేశాల భూ సంబంధ రాజకీయాలకు బలైన దేశాల్లో సూడాన్ ఒకటి. బ్రిటిష్ వలస పాలన నుంచి 1956లో విముక్తి పొందిన తరువాత అక్కడ శాంతి లేదు. అంతకు ముందు ఈజిప్టు ఆక్రమణలో తరువాత బ్రిటిష్ ఏలుబడిలో ఉన్నప్పుడు దక్షిణ, ఉత్తర సూడాన్ ప్రాంతాలుగా ఉంది. బ్రిటిష్ వారు వైదొలుగుతూ ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేకుండా రెండు ప్రాంతాలను ఒకే దేశంగా చేశారు. అప్పటి నుంచి దక్షిణ సూడాన్ పౌరులు ప్రభుత్వంలో తమ ప్రాతినిధ్యం పెరగాలని, తమ ప్రాంతానికి స్వయం ప్రతిపత్తి ఇవ్వాలన్న డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. నిరాకరించటంతో అంతర్యుద్ధం ప్రారంభమైంది. మధ్యలో పది సంవత్సరాలు తప్ప 1956 నుంచి 2005వరకు అది కొనసాగి ఐదు నుంచి పదిలక్షల మంది ప్రాణాలు తీసుకుంది. 2011లో దక్షిణ సూడాన్ స్వతంత్ర దేశంగా అవతరించింది. అవిభక్త సూడాన్‌లో, తరువాత పదకొండు మిలిటరీ కుట్రలు, తిరుగుబాట్లు జరిగాయి. అంతర్యుద్ధంలో పాలకులు కిరాయి మూకలను సమీకరించి డార్ఫర్, ఇతర ప్రాంతాల్లో ప్రజా ఉద్యమాన్ని అణచివేశారు. తరువాత వాటిని 2013లో పారామిలిటరీగా మార్చారు. ఇటీవలి అధికార పంపిణీలో మిలిటరీ నేత, పారామిలిటరీ నేతలు ఇద్దరూ ఒకరి తరువాత ఒకరు అధికార వ్యవస్థను ఆక్రమించారు. పారామిలిటరీని మిలిటరీలో ఎప్పుడు విలీనం కావించాలన్న అంశంపై ఒప్పందానికి భిన్న భాష్యాలు చెప్పి అధికారం కోసం జరిగిన కుమ్ములాటల కారణంగా రెండింటి మధ్య అంతర్యుద్ధం మొదలైంది. జనం నలిగిపోతున్నారు. అణచివేతలో ఇద్దరూ ఇద్దరే.

సూడాన్‌లో వర్తమాన పరిణామాలను చూస్తే ఏడు లక్షల మంది పౌరులు నిర్వాసితులైనట్లు ఐరాస సంస్థ వెల్లడించింది. రాజధాని ఖార్టూమ్ పరిసర ప్రాంతాల మీద విమానదాడులు కొనసాగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతాలన్నీ ఖాళీగా ఉన్నాయి. మరోవైపు అమెరికా-సౌదీ ప్రతిపాదన మేరకు సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో మిలిటరీ-పారా మిలిటరీ ప్రతినిధుల మధ్య తొలిసారిగా ముఖాముఖీ కాల్పుల విరమణ చర్చలు జరుగుతూనే ఉన్నాయి. బాంకులు, ఏటిఎంలు పని చేయటం లేదు. చమురు కొరత, ధరల పెరుగుదలతో జనం సతమతమవుతున్నారు. రాజధానిలో ఎక్కువ ప్రాంతాలు పారా మిలిటరీ ఆధీనంలో ఉన్నాయి. వారిని దెబ్బతీసేందుకు మిలిటరీ వైమానిక దాడులు జరుపుతున్నది. రాజధానిలో కాల్పుల విరమణకు పారామిలిటరీ (ఆర్ఎస్ఎఫ్) అంగీకరించకుండా ఒప్పందం కుదిరే అవకాశం లేదని మిలిటరీ అధికారి అల్ బుర్హాన్ చెప్పాడు. ఆర్ఎస్ఎఫ్ పౌరులను రక్షణగా చేసుకుందని, సేవా కేంద్రాలను ఆక్రమించిందని ఆరోపించారు. విమానాలను కూల్చివేసేం దుకు పారా మిలిటరీ క్షిపణులను సంధిస్తున్నట్లు వార్తలు.

చైనా నిజంగా సూడాన్‌లో రాజీ కుదుర్చుతుందా లేదా అన్నది అనేక అంశాల మీద ఆధారపడి ఉంది. సంక్లిష్టత రీత్యా అంత తేలికగాకపోవచ్చు. సూడాన్ పరిణామాలను గమనించినప్పుడు అక్కడ భద్రతా దళాల మధ్య హింసాకాండ ప్రబలటమే అమెరికా పెత్తనం దిగజారుడుకు ఒక నిదర్శనం అని, అది ఇటీవల జరుగుతున్న పరిణామాల్లో భాగమే అని కొందరు చెబుతున్నారు. అమెరికా, దాని అనుచరులుగా ఉన్న ఇతర పశ్చిమ దేశాల ప్రమేయం లేకుండా ప్రపంచంలో ఏదీ జరగదని బలంగా ఉన్న నమ్మకం సడలుతున్నది. ఈ దేశాల నేతలు ఊహించని పరిణామాలు చోటు చేసుకోవటం, అవి పెద్దన్న అమెరికా ప్రమేయం లేకుండా జరగటం పెద్ద చర్చగా మారింది. ఇరాక్ మీద దాడి చేసి అమెరికా చేతులు కాల్చుకుంది. ఇప్పుడు అక్కడ అమెరికా పలుకుబడి ఎంత అన్నది ప్రశ్నార్థకం. తరువాత ఆఫ్ఘనిస్తాన్ నుంచి అవమానకరంగా తాలిబాన్లకు సలాం కొట్టి బతుకుజీవుడా అంటూ ఎక్కడి ఆయుధాలను అక్కడే వదలి కట్టుబట్టలతో అమెరికా మిలిటరీ పారిపోవటం తెలిసిందే. అది శిక్షణ ఇచ్చిన మిలిటరీ కూడా అమెరికాను ఆదుకోలేకపోయింది. దీని అర్థం అమెరికా కథ ముగిసినట్లు కాదు.

రెండు ప్రపంచ యుద్ధాల్లో మిగతా దేశాలతో పోల్చితే అమెరికా లాభపడింది తప్ప నష్టపోయింది లేదు. తిరుగులేని మిలిటరీ, ఆర్థిక శక్తిగా ఎదిగింది. ఐరోపా పునరుద్ధరణ పేరుతో 13 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టి నాటో మిలిటరీ కూటమి పేరుతో ఐరోపాను తన చక్రబంధంలో బిగించుకుంది. ఇతర ఖండాలను కూడా తన కౌగిలిలోకి తెచ్చుకొనేందుకుగాను 80దేశాలలో 800మిలిటరీ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంది. అట్లాంటిక్ సముద్రంలో ఆరవ నౌకాదళాన్ని, పసిఫిక్ - హిందూ మహా సముద్రంలో సప్తమ నౌకాదళం, పర్షియన్ గల్ఫ్‌లో పంచమ నౌకదళాన్ని మోహరించింది. అంటే అన్ని ఖండాల చుట్టూ త్రివిధ దళాలను మోహరించింది. దానికి గాను రకరకాల సాకులు చెబుతున్నది. ఇదంతా ఒక్క ముక్కలో చెప్పాలంటే కమ్యూనిజం, దానికి ఆలవాలంగా ఉన్న పూర్వపు సోవియట్, వర్తమాన సోషలిస్టు చైనా, ఇతర సోషలిస్టు దేశాల పలుకుబడిని నిరోధించేందుకు అని ప్రపంచాన్ని నమ్మించింది. ఇంతటి శక్తి కలిగి ఉండి కూడా 1960, 70 దశకాల్లో వియత్నాం కమ్యూనిస్టు మిలిటరీ, గెరిల్లాల చేతుల్లో చావుదెబ్బతిన్నది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాను పెంచి పోషించిన తాలిబాన్ల చేతుల్లో అవమానాలపాలైంది. ఇప్పుడు ఉక్రెయిన్‌లో అక్కడి మిలిటరీ, కిరాయి మూకలకు ఆయుధాలు అందిస్తూ పరోక్షంగా పోరు సాగిస్తున్నది. అదే చైనాను చూస్తే ఆఫ్రికాలోని జిబౌటీలో అనేక దేశాలతో పాటు

"సాయుధ వివాదాన్ని మరింతగా కొనసాగించటంలో రెండు శక్తులకు పరస్పర ప్రయోజనం ఉంది, దీన్ని సాకుగా చూపి పౌరశక్తులకు అధికారాన్ని బదలాయించకుండా చూస్తున్నాయని" సూడాన్ కమ్యూనిస్టు పార్టీ విదేశాంగ వ్యవహారాల కార్యదర్శి సాలె మహమ్మద్ సూడాన్ పరిణామాలపై చెప్పారు. ఈ వివాదంలో ఆర్ఎస్ఎఫ్‌కు మద్దతు ఇవ్వటం ద్వారా ఎఫ్ఎఫ్‌సి కూటమి తన విశ్వసనీయతను కోల్పోయిందని గతంలో ఆ సంస్థలో ఒక ప్రధాన భాగస్వామిగా ఉండి తరువాత వెలుపలికి వచ్చిన కమ్యూనిస్టు పార్టీ స్పష్టం చేసింది. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే విప్లవ కార్యాచరణకు తిరిగి ఉపక్రమించటం, ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పరచటం తప్ప మరొక మార్గం లేదని కూడా పేర్కొన్నది.



తాను కూడా ఒక సైనిక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇదిగాక మయన్మార్ బంగాళాఖాతంలోని కోకో దీవుల్లో, సంకేతాలను పసిగట్టే ఒక కేంద్రాన్ని, తూర్పు తజికిస్థాన్, లావోస్, దక్షిణ చైనా సముద్రంలో ఒక ఆరు చిన్న మిలిటరీ పోస్టులను ఏర్పాటు చేసింది. అమెరికా తన మిలిటరీని చూపి ప్రపంచాన్ని భయపెడుతుంటే చైనా తన దగ్గర ఉన్న మిగులు డాలర్లను ప్రపంచంలో వివిధ దేశాల్లో మౌలిక సదుపాయాలు, ఇతర పథకాల మీద ఖర్చు పెడుతున్నది, రుణాలు ఇస్తున్నది.

ఆర్థిక, మిలిటరీ, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో ఎంతో ముందున్న తమ దేశం క్రమంగా తన పలుకుబడిని ఎందుకు కోల్పోతున్నదనే చర్చ అటు అమెరికాలోనూ ఇటు ప్రపంచంలోనూ రోజు రోజుకూ బలపడుతున్నది. సోవియట్ కూలిపోయి, కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గగానే చరిత్ర ముగిసింది, పెట్టుబడిదారీ విధాన ప్రవాహానికి ఎదురు లేదు. ప్రచ్ఛన్న యుద్ధంలో తమదే గెలుపు అని అమెరికా ప్రకటించుకున్న తరువాత గడచిన మూడు దశాబ్దాల్లో చరిత్ర వేరే విధంగా నమోదవుతున్నది. అమెరికా విధాన నిర్ణేతలు, వ్యూహకర్తలు కలలో కూడా ఊహించని పరిణామాలు జరుగుతున్నాయి. అమెరికా ఆటకు అనుగుణంగా చైనా నడుచుకుంటుందని భావించి 1970దశకంలో దాన్ని అసలైన చైనాగా గుర్తించారు. తరువాత 2001లో ప్రపంచ వాణిజ్య సంస్థలోకి అనుమతించారు. అప్పుడు చైనా విదేశీమారకద్రవ్య నిల్వలు కేవలం 200 బి.డాలర్లు మాత్రమే, అవి 2023 జనవరి నాటికి 3,379 బి.డాలర్లకు చేరాయి. ఇంత భారీ మొత్తం ఉంది కనుకనే అనేక దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకు చైనాకు అవకాశం వచ్చింది. వాటి కోసం మొహం వాచి ఉన్న దేశాలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయి. వందల కోట్ల డాలర్లను పెట్టుబడులు, అప్పుగా తీసుకుంటున్నాయి. ఎక్కడా మిలిటరీ కేంద్రాలను పెట్టటం లేదు గనుక దాని మీద అనుమానాలు కూడా లేవు. ఇస్లామిక్ దేశాల మధ్య షియా-సున్నీ విభేదాలను అన్ని దేశాలను తన అదుపులో ఉంచుకోవాలని చూసింది. చివరికి దానికి కూడా తెరపడింది. షియా ఇరాన్-సున్నీ సౌదీ అరేబియాలను చైనా దగ్గరకు చేర్చింది. ఆ ప్రాంతంలో కొనసాగుతున్న ఘర్షణలకు తెరపడేందుకు ఆ ఒప్పందం దోహదం చేస్తుందని భావిస్తున్నారు. ప్రాంతీయ, దేశాల అంతర్గత వివాదాలకు దూరంగా ఉండటమే చైనా పలుకుబడిని పెంచుతున్నవాటిలో ఒకటి.


నాటోలో భాగంగా అమెరికాతో స్నేహం చేస్తూనే ఫ్రాన్స్ అధ్యక్షుడు మక్రాన్ ఇటీవలి బీజింగ్ పర్యటనలో మాట్లాడిన తీరు అమెరికాను బిత్తరపోయేట్లు చేసింది. తన వెనుక ఉన్న వారు ఎప్పుడేం చేస్తారో అన్న అనుమానాలను పెంచింది. తైవాన్ అంశంపై అమెరికా బాటలో నడిచేది లేదని, చైనాతో వ్యూహాత్మక భాగస్వామ్య కలిగి ఉంటామని మక్రాన్ చెప్పాడు. వందల కోట్ల లాభదాయక ఒప్పందాలను ఫ్రెంచి కంపెనీలకు సాధించటంలో మక్రాన్ చొరవ చూపాడు. ఒక్క ఫ్రాన్సే కాదు జర్మనీ వైఖరి కూడా అలానే ఉంది. డాలరు పెత్తనానికి తెరదించాలన్న అభిప్రాయం రోజు రోజుకూ బలపడుతున్నది. నిజానికి అనేక దేశాల మీద ఆంక్షలు విధిస్తూ అమెరికా దాన్ని ముమ్మరం చేస్తున్నది. మొత్తం మీద చూసినప్పుడు నూతన ప్రపంచ వ్యవస్థ రూపుదిద్దు కుంటున్నది. అది అమెరికా-పశ్చిమ దేశాల కేంద్రంగా జరగటం లేదు. ఏక ధృవ కేంద్రానికి బదులు రెండు లేదా అంతకు మించి ఎక్కువ అధికార కేంద్రాలున్నప్పుడు దేశాలకు ఎంచుకొనే అవకాశాలు పెరుగుతాయి.

"సాయుధ వివాదాన్ని మరింతగా కొనసాగించటంలో రెండు శక్తులకు పరస్పర ప్రయోజనం ఉంది, దీన్ని సాకుగా చూపి పౌరశక్తులకు అధికారాన్ని బదలాయించకుండా చూస్తున్నాయని" సూడాన్ కమ్యూనిస్టు పార్టీ విదేశాంగ వ్యవహారాల కార్యదర్శి సాలె మహమ్మద్ సూడాన్ పరిణామాలపై చెప్పారు. ఈ వివాదంలో ఆర్ఎస్ఎఫ్‌కు మద్దతు ఇవ్వటం ద్వారా ఎఫ్ఎఫ్‌సి కూటమి తన విశ్వసనీయతను కోల్పోయిందని గతంలో ఆ సంస్థలో ఒక ప్రధాన భాగస్వామిగా ఉండి తరువాత వెలుపలికి వచ్చిన కమ్యూనిస్టు పార్టీ స్పష్టం చేసింది. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే విప్లవ కార్యాచరణకు తిరిగి ఉపక్రమించటం, ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పరచటం తప్ప మరొక మార్గం లేదని కూడా పేర్కొన్నది.

సెల్: 8331013288

భీతి గొలిపే వాస్తవాలు

ప్రపంచం ఒక కుగ్రామంగా మారింది. మనుషులు పెట్టుబడి చదరంగంలో పావులుగా ఉపయోగించబడుతున్న సందర్భంలో అంత ర్జాతీయ నివేదికలు, రిపోర్టులు అత్యంత ప్రాధాన్యతను సంతరించు కుంటున్నాయి. ఎందుకంటే రాజకీయాలు సమాజాన్ని భవిష్యత్తీ కరించడంపై దృష్టి పెట్టడం లేదు. పరిపాల నాధికారం కోసం ప్రాకులాడుతున్న సందర్భంలో, జాతీయ రాజకీయ విధానాలను స్థిరపరచుకునే స్థానిక రాజకీయ సమూహాలు వాస్తవాలను జీర్ణించుకునే స్థితిలో లేవు. అందు చేతనే దాదాపు అనేక దేశాలలో స్థానికంగా వెలువడుతున్న రిపోర్టు లన్నీ వాస్తవాలను ప్రతిబింబించడం లేదు. అలా ఎక్కడైనా బహిర్గతమైతే వాటిని దేశద్రోహం గానో లేదా అంతర్జాతీయ కుట్రలు గానో చిత్రీక రిస్తున్నారు. సదరు సమాచారాన్ని వెలువరించిన వారిని చిత్రవధ చేసే దుస్థితి నెలకొన్నది. అందుచేతనే అంతర్జాతీయ స్థాయిలో అన్వేషించి వివిధ దేశాల, ప్రాంతాల, జాతుల వాస్తవ పరిస్థితులను బహిర్గతం చేసే ప్రయత్నాలు చేస్తున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం గాని, ఆక్స్‌ఫామ్ సంస్థ గాని అందరి మన్ననలను పొందుతున్నాయి.


జి. తిరుపతయ్య

వరల్డ్ ఎకనామిక్ ఫోరం తాజాగా వెలువ రించిన నివేదిక 'గ్లోబల్ రిస్క్ రిపోర్ట్ 2023' పలు ఆసక్తికర, ఆందోళనకర అంశాలను ప్రపంచం దృష్టికి తెచ్చింది. రానున్న రెండేండ్లలో ప్రపంచాన్ని అత్యంత ఎక్కువగా కుదిపేసేది జీవన వ్యయం ('కాస్ట్ ఆఫ్ లివింగ్') అని, రానున్న దశాబ్ద కాలంలో జీవన ప్రమాణాలను అత్యంత ప్రభావం చేసేది పర్యావరణ మార్పులు అని సోదాహరణలుగా రిపోర్టు పేర్కొన్నది. ఈ అంశాన్ని ఒకసారి నిశితంగా పరిశీలించి భారతదేశ ప్రజల సంపాదనలకు పోల్చి చూసినప్పుడు కొన్ని విషయాలు అర్థమవుతాయి. ఈ మధ్యకాలంలో కార్ల కంపెనీలకు సంబంధించిన రిపోర్టు ఒకటి వెలువడింది. దాని ప్రకారం చిన్న కార్లు, తక్కువ ధరకు లభించే కార్లకు గిరాకీ బాగా పడిపోయిందని, మధ్యతరగతి పైన అనగా ఎస్‌యువి (స్పోర్ట్స్ యుటిలిటి వెహికిల్) రేంజ్ కార్ల గిరాకీ పెరిగిందని తెలిసింది. ధనవంతులు ధనవంతు లుగా, పేదలు పేదలుగా మారే ప్రక్రియకు ఇది చక్కటి ఉదాహరణ. అనగా బాగా సంపాదిస్తున్న వారి సంపాదనలో విపరీతమైన పెరుగుదల ఉంటే, తక్కువ సంపాది స్తున్న వారి సంపాదనలో తగ్గుదల ఉంది, అని నిరుడు ఆక్స్‌ఫామ్ అనే సంస్థ ఇచ్చిన రిపోర్టును ఇది ధ్రువీకరిస్తుంది. నిజానికి ఆర్థిక వ్యవస్థ సమతుల అభివృద్ధి సాధిస్తే చిన్నకారుల గిరాకీ పెరగాలి. తద్వారా పారిశ్రామిక అభివృద్ధి కూడా మరింత పెరుగుతుంది. అలాకాకుండా విలాసవంత మైన వస్తువుల వినియోగం పెరిగితే అది విశాల అభివృద్ధికి సూచిక కాదు. కోవిడ్ అనంతరం భారతదేశంలో గ్రామస్థాయిలో ఆహార వస్తువుల వినియోగం పెరిగింది. దీనికి ప్రధాన కారణం వలసలు. పట్టణాల నుండి గ్రామాలకు తిరిగి వెళ్లడంతో అక్కడ ఆహార వస్తువుల వినియోగం పెరిగింది. అందుచేత వరల్డ్ ఎకనామిక్ ఫోరం అభిప్రాయ పడినట్లు రాబోయే రోజుల్లో కాస్ట్ ఆఫ్ లివింగ్ పెరిగే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తున్నది.

ఇక 30ఏండ్ల నుండి అనేక దఫాలుగా అంతర్జాతీయ వేదికలపై వాగ్దానాలు కురిసి నప్పటికీ పెరుగుతున్న కార్బన్ ఉద్గారాలను తగ్గించే తక్షణ చర్యలు అభివృద్ధిని చెందిన దేశాలలో ఏమాత్రం కనిపించడం లేదు. అందుచేత విపరీత మైన పర్యావరణ మార్పుతో ప్రధానంగా ప్రభావిత మయ్యేది ఆఫ్రికా, ఆసియా ఖండాల ప్రజలు. ఎందుకంటే వాతావరణ మార్పులు పారిశ్రామిక ఉత్పత్తులపై ప్రభావం చూపడమే కాకుండా ప్రజల ఆహార వినియోగం ప్రకృతి స్వావలంబన, సమైక జీవన విధానంపై కూడా ఎక్కువగా ప్రభావం చూపేవి ఈ ప్రదేశాలలోనే. ముందస్తుగానే మేల్కొనే అలవాటున్న అభివృద్ధి చెందిన దేశాలకు నష్టం అంతగా ఉండదు.

ఉపాధి సంబంధిత అంశాలపై ఆసక్తి గొలిపే రిపోర్టు ఇది. రానున్న ఐదేండ్లలో ప్రపంచంలోని మొత్తం ఉపాధుల్లో 23శాతం మార్పులు చోటు చేసుకుంటాయని డబ్ల్యుఈఎఫ్ అభిప్రాయపడింది. అనగా సగటున 23శాతం ఉద్యోగాల్లో ఒడిదుడుకులు, తొలగింపులు, వేతన తగ్గింపులు, ఉపాధి సంబంధిత కాంట్రాక్టుల్లో మార్పులు వంటివి సంభవిస్తాయని తెలిపింది. అయితే ఈ



రిపోర్టు వెలువడక ముందే గత ఏడాది ప్రపంచ దిగ్గజ సంస్థలు అనేకమంది ఉద్యోగులను రాత్రికి రాత్రి తొలగించారు. లేదా పీస్ రేట్ సిస్టం అనే విధానంతో పనులు పూర్తి చేయించుకునేలా అంగీకారాలు కుదుర్చుకోవడం మనం చూశాం. మరో ఆసక్తికరమైన అంశం ఏమంటే రానున్న కాలంలో 6.9కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయని, 8.3కోట్ల ఉద్యోగాలు తొలగించబడతాయని రిపోర్టు తెలుపుతోంది. దీన్ని చదివినప్పుడు ఒకింత గందరగోళంగా అనిపిస్తుండవచ్చు. కానీ వాస్తవం ఏమంటే మారుతున్న సాంకేతిక ఇతరత్రా కోణాల దృష్ట్యా ఇప్పుడున్న ఉద్యోగులు చేసే పనికి సరితూగే అవకాశం లేనందువల్ల 8.3కోట్ల మందిని సంస్థలు తొలగించనున్నా యన్నమాట. వారి స్థానంలో 6.9 కోట్ల మందిని నియమించు కోనున్నారు. తొలగించబడనున్న ఈ 8.3కోట్ల మంది, కుదిరితే తక్కువ స్థాయి ఉద్యోగాలను ఎంచుకోవడం, లేదా మరోరకంగా కష్టపడటమే దారిగా కనిపిస్తున్నది. ఇది ఒక ఎత్తైతే రానున్న ఐదేండ్లలో మార్కెట్లోకి ఉపాధి వెతుక్కుంటూ వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నప్పటికీ కేవలం 6.9కోట్ల మందికి మాత్రమే ఉపాధి లభించే అవకాశం ఉందని తెలుస్తుండటం చాలా ఆందోళన కలిగించే అంశం. ఉద్యోగాల సంఖ్య బాగా తగ్గిపోవడానికి ప్రధాన కారణం పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం. దానికి మించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే నూతన ఆవిష్కరణ. మన అనుభవం కూడా ఇదే బహిర్గతపరిస్తోంది.

ఒక దశాబ్దం కిందట 10లక్షల పైన ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు ఉంటే ఇప్పుడిది ఆరు లక్షలు ఉన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, డిఫెన్స్, రైల్వే ఉద్యోగాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. గత రెండు దశాబ్దాల కిందట విపరీతమైన ఆశావాహంతో ప్రవాహంలా దూసుకొచ్చిన సాఫ్ట్‌వేర్ రంగంలో నియామకాలు ఇప్పుడు బాగా తగ్గిపోయాయి. ఒక్క టిసిఎస్ కంపెనీ గత ఏడాది నాలుగు లక్షల ఉద్యోగులను నియమించు కుంటే ఈ ఏడు కేవలం ఎనభై వేల నియామకాలు మాత్రమే చేపట్టింది. "పెట్టుబడి-లాభదాయకమైన రిటర్న్" అనే కాన్సెప్ట్ అంతర్జాతీయంగా పెరిగింది. మానవాభివృద్ధిపై ఇన్వెస్ట్‌మెంట్ చేయడం లేదు. ఇటువంటి విధానాల వల్ల, ప్రత్యామ్నాయ ఉపాధి ఏర్పాట్లను దేశాల ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. అందుకే ఈ రకమైన ఉపాధి లేమి సమస్య అన్ని దేశాలను పట్టిపీడించే అవకాశం ఉందని రిపోర్టు అభిప్రాయపడింది. కోవిడ్ మహమ్మారి మిగిల్చిన అభద్రత, అంతం లేకుండా

నివేదికను అర్థం చేసుకున్న ప్రభుత్వాలు ప్రధానంగా దృష్టి పెట్టవలసింది ప్రత్యామ్నాయ ఉపాధి ఏర్పాట్లపై. ఎందుకంటే పెరుగనున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వల్ల, అనేక రంగాలలో నిరంతర తొలగింపుల వల్ల స్థిరమైన ఉపాధి లేకుండా అనిశ్చితి నెలకొనే అవకాశం ఉంది. అందుచేత కొత్త స్టార్టప్‌లు, స్వయం ఉపాధి మార్గాలతో పాటు వృత్తి విద్యా విధానాలు అవలంబించడంతో దీన్ని అధిగమించే అవకాశం ఉంది. ఆ దిశగా దృష్టి పెడితే కొంతమేర నివారించవచ్చు.

కొనసాగుతున్న రష్యా యుక్రెయిన్ యుద్ధం ప్రపంచ ఆహార, చమురు ధరలను స్థిమితం లేకుండా చేస్తున్నాయి. దాని ప్రభావం వల్ల అనేక దేశాలు రక్షణాత్మక చర్యలకు పాల్పడుతున్నాయని, ఇలాంటి రక్షణాత్మక చర్యల వలన సామాన్య ప్రజల జీవనస్థితి సన్నగిల్లి, ఆర్థిక అసమానతలు మరింత పెరుగుతాయని రిపోర్టు సోదాహరణంగా వివరిం చింది. రక్షణాత్మక చర్యలతో పాటు తమ ఆధిప త్యాన్ని నిలబెట్టుకుంటూ ఇతరుల ఎదుగు దలను అడ్డుకునే ప్రయత్నాలు ప్రపంచ దేశాల్లో రానున్న రోజుల్లో మరింత ముమ్మరం అవుతాయని ఈ రిపోర్టు తెలిపింది. వీటిని గమనిస్తే ప్రస్తుతం అభి వృద్ధి చెందిన అమెరికా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ వంటి అనేక దేశాల వ్యవహారాలు మనకు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తున్నవి.

ఈ నివేదికను అర్థం చేసుకున్న ప్రభుత్వాలు ప్రధానంగా దృష్టి పెట్టవలసింది ప్రత్యామ్నాయ ఉపాధి ఏర్పాట్లపై. ఎందుకంటే పెరుగనున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వల్ల, అనేక రంగాలలో నిరంతర తొలగింపుల వల్ల స్థిరమైన ఉపాధి లేకుండా అనిశ్చితి నెలకొనే అవకాశం ఉంది. అందుచేత కొత్త స్టార్టప్‌లు, స్వయం ఉపాధి మార్గాలతో పాటు వృత్తి విద్యా విధానాలు అవలంబించడంతో దీన్ని అధిగమించే అవకాశం ఉంది. ఆ దిశగా దృష్టి పెడితే కొంతమేర నివారించవచ్చు.

సెల్: 9951300016

మానవి
హైదరాబాద్ నవతెలంగాణ 5
www.navatelangana.com
బుధవారం 10 మే 2023



ప్రతికూల పరిస్థితులను మనకు అనుకూలంగా మలచుకొని ముందుకు సాగడమే తెలివైన పని. అలాంటి బతుకుపోరులో ధైర్యంగా నిలిచి గెలిచిన ధీర వనిత డా.అడువాల సుజాత. ఆమె జీవితం స్ఫూర్తి దాయకం, ఆదర్శప్రాయం. బీడీ కార్మికురాలిగా అట్టడుగు స్థాయి నుండి ఆత్మవిశ్వాసమే ఆలంబనగా ఉన్నత స్థాయి సాహిత్య శిఖరారోహణ చేసిన ఆమె పరిచయం నేటి మానవిలో...

విజయానికి సంకేతం సుజాత జీవితం

కరీంనగర్ జిల్లా, జగిత్యాల పట్టణంలో చేనేత కార్మికుల ఇంట జన్మించారు సుజాత. తల్లి సత్తెమ్మ, తండ్రి రాజన్న. వీరికి ఆరుగురు సంతానం. సుజాత రెండవ సంతానం. ఈమెకు ఒక అక్క ఒక చెల్లెలు, ముగ్గురు తమ్ముళ్లు. నిరుపేద కుటుంబం. ఆర్థిక పరిస్థితులు షరా మామూలే. అరకొర వసతులతో బతుకు బండి లాగుతున్న ఏ తండ్రీ అమ్మాయిలను చదివించే సాహసం చేయడు. అయితే రాజన్న తన కూతురు సుజాతను ఇంటర్ దాకా చదివించాడు. తర్వాత అందరిలాగే ఏదైనా మంచి సంబంధం అంటే తమ శక్తికి సరితూగే సంబంధం కుదిరితే పెండ్లి చేయాలనుకున్నాడు. అప్పటికే పెద్దమ్మాయికి పెండ్లి చేశాడు. ఈ బరువు కూడా తగ్గించుకోవాలనుకుంటున్న తరుణంలో కోరుకున్న సంబంధం వచ్చింది. కోరుట్లకు చెందిన మచ్చ రవీందర్‌తో 1989 సుజాత పెండ్లి జరిగింది.

పిల్లలు పుట్టిన తర్వాత...

పెండ్లయితే చేసుకున్నారు కానీ సుజాతకు పై చదువులు చదివి తన కాళ్లపై తాను నిలబడాలన్న ఆకాంక్ష తీరనేలేదు. పుట్టినింట్లో ఉన్నప్పుడే ఆమె మిషన్ కుట్టుకుంటూ కుటుంబానికి సహకరిస్తూ బడికి వెళ్ళి చదువుకున్నారు. అత్తగారింట్లో కూడ బీడీలు చుట్టేవారు. ఇద్దరు కొడుకులు పుట్టిన తర్వాత అణగివున్న విద్యాకాంక్ష ఒక్కసారిగా పెల్లుబికింది. వరంగల్లో తెలుగు సబ్జెక్ట్ తీసుకొని బి.పి. (లిట్)చేశారు. కేవలం బి.ఏ. తో ఆగిపోతే ఉద్యోగం దొరికేదెట్లా? అందుకే హన్మకొండలో తెలుగు పండిత శిక్షణ (టి.పి.టి) కూడా తీసుకున్నారు.

ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ...

చదువు కొనసాగిస్తూ ముందుకు సాగడానికే నిర్ణయించుకున్నారు. ఒక్కొక్క మెట్టులో పొందుతున్న విజయాలను చూస్తున్న ఆమె ఇక ఆగలేదు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం.ఏ. తెలుగు పూర్తి చేశారు. 'తెలంగాణా పోరాట నవలల్లో స్త్రీ' అన్న అంశంపై పరిశోధన చేసి ఎం.ఫిల్ పట్టా పొందారు. 2002లో ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సంపాదించారు. అంతటితో ఆగకుండా రెట్టించిన ఉత్సాహంతో 'డాక్టర్ పి. యశోదారెడ్డి కథలు – సమగ్ర పరిశీలన' అన్న అంశంపై పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టా అందుకున్నారు. ఈ రెండూ కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో సాగించిన పరిశోధనాంశాలే.

అమ్మలా ఆదరించారు...

వాస్తవానికి ఎం.ఏ. రెగ్యులర్‌గా చదివిన వాళ్లకు తప్ప మిగతా వాళ్ళకు విశ్వవిద్యాలయాల్లో సీటు దొరకడం అంతసులభమైన విషయం కాదు. అందులో అప్పటికే ప్రభుత్వ రంగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సుజాత లాంటి వాళ్లకు గైడుగా ఉండటానికి ఎవరూ సమ్మతించరు. అలాంటి స్థితిలో ఆచార్య బి.రుక్మిణి ఎంతో ప్రేమతో సుజాతను చేరదీశారు. ఎం.ఫిల్, పిహెచ్.డి. అంశాలకు రెంటికీ తానే పర్యవేక్షకురాలిగా ఉన్నారు. ఒకప్పటి బీడీ కార్మికురాలిని డాక్టరుగా లోకానికి చూపడంలో ఎంతగానో సహకరించారు. తల్లి మనసుతో ఆదరించారు. ఆ తర్వాత మద్రాస్ యూనివర్సిటీ నుండి డి.లిట్ కూడా పూర్తి చేశారు.

సాధారణ స్థాయి నుండి...

అప్పటి వరకు సుజాత వాసనలేని పువ్వు, వట్టి గడ్డి పువ్వు. కాని స్వయం కృషితో కష్టపడి విద్యావంతురాలిగా ఎదిగి తనతో పాటు కుటుంబాన్ని కూడా పరిమళవంతం చేశారు. సుజాత పట్టువదలని వనిత, ధీర నారి. అందుకే తన చదువు కొనసాగిస్తూనే టైపు రైటింగ్, కంప్యూటర్, ఐటిఐ, డ్రెస్ మేకింగ్ లాంటి ఇతర జీవనోపాధి కోర్సులు కూడా చేశారు. ప్రభుత్వ ఉద్యోగానికి ముందు కొంతకాలం మహిళలకు డ్రెస్ మేకింగ్‌లో శిక్షకురాలిగా పని చేశారు. పురుషాధిక్య ఆధిపత్యం చెలాయిస్తున్న ఈ రోజుల్లో ఒక స్త్రీ, అందులో సామాన్య గృహిణి, మెట్టినింటిలో బరువు బాధ్యతలు నిర్వహిస్తున్న పెద్దకోడలు సుజాత. సాధారణ స్థాయినుండి ఉన్నత స్థాయికి ఎదగడం అసాధారణ విషయమే అనుకోవాలి.

అనేక సాహితీ కార్యక్రమాల్లో...

సుజాత ప్రస్తుతం తెలుగు పండితురాలిగా కరీంనగర్ జిల్లాలోని మామిడాలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తున్నారు. ప్రవృత్తి పరంగా ఈమె బహుముఖీన రంగాలలో రాణిస్తుంది. అనేక కవి సమ్మేళనాలలో కవయిత్రిగా, సందర్భోచిత వ్యాసాలు రాసి అనేక పత్రికలకు పంపుతున్నారు. పరిశోధకురాలిగా పేరు తెచ్చుకుంటున్నారు. నానీల కనయిత్రిగా 'మట్టి మల్లెలు' తో నానీల అతి పెద్ద కుటుంబంలో స్థానం సంపాదించుకున్నారు. స్థానిక సంస్థల్లో మంచి గుర్తింపు తెచుకున్నారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా శాఖ ఉపాధ్యక్షురాలుగా, తెలంగాణా రచయితల వేదిక, కరీంనగర్ జిల్లా శాఖకు కోశాధికారిగా, సమైక్య సాహితీ సంస్థకు కార్యవర్గం సభ్యురాలిగా, భారతీ సాహిత్య సమితి, కోరుట్ల సంస్థకు శాశ్వత సభ్యురాలిగా వివిధ సాహితీ సేవా కార్యక్రమాల్లో 'నేను సైతం' అంటూ తన స్థానాన్ని పదిల పరచు కుంటూ సాహిత్య ప్రస్థానం సాగిస్తున్నారు. తన ఉనికిని చాటుకుంటున్నారు.


ఉన్నతంగా ఎదుగుతూ...

2008 వరకు సుజాత రచనలు పుస్తక రూపం దాల్చలేక పోయాయి. ఆర్థిక పరిస్థితులే అందుకు కారణం. వదాన్యులు ఆర్థిక సహకారంతో పరిశోధనా గ్రంథాలు రెండింటితో పాటు, నానీల సంపుటిని కూడా 2008లో ముద్రించారు. 2013లో 'కాలమా కాస్త వినుమా' వచన కవిత్వం, 2014లో 'బతుకమ్మ పాటలు' సంకలనం, 2017లో 'వ్యాసపారిజాతం', 2017లో 'విలోకనం' అనే సాహిత్య వ్యాసాలు పుస్తక రూపంలో వచ్చాయి. దేశభక్తి గీతాలు సంకలనం అముద్రితంగా వుంది. ఆత్మ స్థైర్యానికి, ధైర్యానికి, పట్టుదలకు మారు పేరుగా తన జీవితాన్ని తీర్చిదిద్దుకొని, సాహితీ రంగంలో ఉన్నతంగా ఎదుగుతున్నారు.

అందరినీ మెప్పించి

అత్తమామలు, భర్త ప్రోత్సాహం లేకుండా ఒక వివాహిత పై చదువులు చదువుకోవాలన్న కల సాకారం కావడం అంత సులభమేమీ కాదు. ఇక్కడ వారి సహాయ సహకారాలు, ప్రోత్సాహం సంపాదించిన నైపుణ్య మంతా సుజాతదే. చదువుతో పాటు సంస్కారం, వినయ విధేయతలు సుజాతకు పెట్టనికోటలు, సహజాలంకారాలు. ఈ రక్షణకవచాలతో అన్ని అడ్డంకులనూ ఎదుర్కొన్నారు. అందరినీ మెప్పించి ఒప్పించారు. కుటుంబ పోషణకు సహకరిస్తూనే మరొకవైపు ఉన్నత విద్యవైపు దృష్టి సారించారు. ఫలితాలను అద్భుతంగా, అనూహ్యంగా సాధించారు. తన తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచారు. 'పుటం పెడితే పుత్తడి ప్రకాశిస్తుంది' అన్న సామెతను మరోసారి రుజువుచేసి, కష్టాల కడలిని ఈదుతూనే గమ్యాన్ని ఛేదించారు.







పిల్లలకు సెలవులు దొరుకుతాయి. కాబట్టి, ఇల్లు మారాలను కునే వారిలో చాలా మంది వేసవిని అనుకూల సమయంగా భావిస్తారు. మీరూ అలాగే ఆలోచిస్తున్నారా? అయితే ఈ సూచనలు మీకోసమే..

ఇల్లు మారాలనుకుంటే..?



- కొత్త ఇల్లు సర్దేప్పుడు చెత్త భారీగా పోగవడం సహజం. దీన్ని మోసుకెళ్లడం.. తర్వాత పడేయడం రెండూ శ్రమతో కూడుకున్న పని. ప్యాకింగ్ చేసేప్పుడే అనసరమైనవి, తక్కువగా వాడేవి పక్కన పెట్టేయండి. చివర్లో తీరిగ్గా ఆలోచిస్తే వాటి ఉపయోగం ఎంత వరకనేది అర్థమవుతుంది. దాన్ని బట్టి పడేయొచ్చు. లేదా ఎవరికైనా ఇచ్చేయొచ్చు.
- ఫ్రిజ్‌లోని వస్తువుల్లో పాడయ్యే వాటిని వీలైతే ముందుగానే వాడేయండి. లేదంటే ఇచ్చేయడమో, తీసేయడమో చేయండి. ఫ్రిజ్‌తో పాటు అవెన్‌నీ ఇక్కడే శుభ్రం చేసుకొని వెళితే.. శ్రమా తగ్గుతుంది. వెళ్లగానే సులువుగా ఉపయోగించుకోవచ్చు.
- పెద్ద పెట్టెల్లో సర్దితే త్వరగా పని అవుతుంది అనిపిస్తుంది చాలా మందికి. కానీ మోసే వారికి భారం. తేలిగ్గా ఉన్న వాటిని పెద్దవాటిలో.. బరువున్న వాటిని చిన్న చిన్న వాటిల్లో సర్దేస్తే సరి. అలాగే ప్రతి దానికీ ఓ నంబరు ఇవ్వండి. వేటిలో ఏమున్నాయన్న దాన్ని ఫోనులో లేదా చిన్న పుస్తకంలో రాసి పెట్టుకుంటే తర్వాత వెదుకులాట ఉండదు.
- మారిన రోజే మొత్తం సర్దుకునేంత ఓపిక ఉండదు. భోజనాలు వరకూ బయట నుంచి తెచ్చుకోగలం. విశ్రాంతి తీసుకోవడానికీ, స్నానాలు వగైరా వాటికి అత్యవసరమైనవి కొన్ని ఉంటాయి. వాటికోసం బాక్సులన్నీ తెరుస్తూ కూర్చోలేం. తెరిచినా ఇల్లంతా చిందరవందరగా కనిపిస్తుంది. కాబట్టి 'అర్జెంట్ బాక్స్'ని సిద్ధం చేసుకోండి. పేపర్ ప్లేట్లు, మార్చుకోవాల్సిన దుస్తులు, పక్క దుప్పట్లు, బ్రష్‌లు, సబ్బులు, స్నాక్స్, అత్యవసర వంట సామగ్రి... ఇలా ఆ రోజుకు అవసరమయ్యే వాటన్నింటినీ దానిలో పెట్టేసుకుంటే పని సులువవుతుంది.

రక్తపాతాలు, కుట్రలను పురిగొల్పేది పెత్తందారీ శక్తులే !

(మొదటిపేజి తరువాయి)

ఏ సిద్ధాంతమైనా దాని స్వభావరీత్యా హేయమైనది, నేరపూరితమైనది, దారుణమైనది" అని రష్యన్లు విశ్వసిస్తారని పుతిన్ వ్యాఖ్యానించారు. "ప్రపంచంలోని ఆధిపత్య వర్గాలు తమ అసాధారణవాదాన్ని నొక్కి చెబుతూనే వున్నాయి. ప్రజలను ఒకరిపై ఒకరు పోట్లాడుకునేలా చేస్తారు. సమాజాలను చీలుస్తారు, రక్తపాతంతో కూడిన ఘర్షణలను రెచ్చగొడతారు, కుట్రలకు పాల్పడుతారు, విద్వేష బీజాలు నాటుతారు. రష్యా అంటే విద్వేషం, దూకుడుతో కూడిన జాతీయవాదం, సాంప్రదాయ కుటుంబ విలువలను నాశనం చేయడం వంటివి పురిగొల్పుతారు."అని పుతిన్ పేర్కొన్నారు. ప్రజల అభీష్టాలను, వారి హక్కులను, ఆదేశాలను మరింతగా నిర్దేశించడానికి అమెరికా, దాని మిత్రపక్షాలు ఇదంతా చేస్తున్నాయని పుతిన్ విమర్శించారు. అంతర్జాతీయ వేదికపై దోపిడీ, హింస, అణచివేతలతో కూడిన వ్యవస్థను అమలు చేయడానికే ఇదంతా అని విమర్శించారు. నాజీల పిచ్చి, అపవిత్రమైన ఆశయాలు చివరకు ఎలాంటి పర్యవసానాలకు, పరిస్థితులకు దారి తీసాయో వారు మరిచినట్లు కనిపిస్తోందని పుతిన్ వ్యాఖ్యానించారు. ఈ దుష్ట శక్తిని ఓడించిన వారి గురించి వారు విస్మరించారని అన్నారు. ఉక్రెయిన్‌లో ఘర్షణలను ప్రస్తావిస్తూ పుతిన్ రష్యాపై అసలైన యుద్ధం ఆరంభమైందని అన్నారు. కానీ అంతర్జాతీయ తీవ్రవాదాన్ని మనం ప్రతిఘటిస్తున్నామన్నారు. మన దేశాన్ని విచ్ఛిన్నం చేసి, విధ్వంసం చేయడం, రెండో ప్రపంచ యుద్ధ ఫలితాలను రద్దు చేయడం, అంతర్జాతీయ భద్రతా వ్యవస్థను, అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా కుప్పకూల్చడం, అభివృద్ధి సార్వభౌమ కేంద్రాల గొంతు నులమడమన్నది పశ్చిమ దేశాల లక్ష్యంగా వుందన్నారు. ఉక్రెయిన్‌లో పరిస్థితులు పెచ్చరిల్లడానికి అమెరికా దాని మిత్రపక్షాలే కారణమని పుతిన్ స్పష్టంచేశారు. మితిమీరిన ఆశయాలు, అహంకారం, స్వేచ్ఛ ఇవన్నీ ఇటువంటి విషాదాలకే దారి తీస్తాయన్నారు. ఉక్రెయిన్ ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున విపత్తు, వినాశనానికి ఇదే అసలైన కారణమని స్పష్టం చేశారు. 2014లో దేశంలో జరిగిన కుట్రలో ఉక్రెయినిన్లు బందీలుగా మారారని,తమ దారుణమైన స్వార్ధపు ఆలోచనలను అమలు చేసుకునేందుకు పశ్చిమ దేశాల చేతుల్లో చిప్‌గా మారారని పుతిన్ విమర్శించారు.

విచారణలో ఉన్న అంశంపై రాజకీయమా..?

(మొదటిపేజి తరువాయి)

మార్చిలో తీసుకున్న నిర్ణయాన్ని ఎల్ గులాం రసూల్ తదితరులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై విచారణ ప్రారంభించిన సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వ నిర్ణయ అమలును తాత్కాలికంగా నిలిపేసింది. ఈ పిటిషన్లపై జస్టిస్ కెఎం జోసఫ్, జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా ధర్మాసనం విచారణ జరుపుతోంది. పిటిషనర్ల తరపున సీనియర్ అడ్వకేట్ దుష్యంత్ దవే వాదనలు వినిపిస్తూ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కర్నాటకలో మాట్లాడుతూ ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారన్నారు. దీనిపై న్యాయమూర్తులు స్పందిస్తూ, ఈ అంశం కోర్టు విచారణలో ఉన్నదని, అందువల్ల రాజకీయ ప్రకటనలను అనుమతించేది లేదని అన్నారు. కర్నాటక ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారో, లేదో తనకు తెలియదన్నారు. అయితే ఎన్నికల ప్రణాళికలో అటువంటి హామీ ఇవ్వవచ్చని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, దీనిపై బహిరంగ ప్రకటనలు చేయరాదని, తమకు రాజకీయాలతో సంబంధం లేదని పేర్కొంది. అమిత్ షా వ్యాఖ్యలను సాక్ష్యాధారాలతో కోర్టు ముందు ఉంచుతానని సీనియర్ అడ్వకేట్ దవే చెప్పారు. ముస్లింల రిజర్వేషన్ల రద్దుపై తదుపరి చర్యలు తీసుకోబోమని కర్నాటక ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ చెప్పిన విషయాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ముస్లింలు సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన స్థితిలో ఉన్నట్టు ఓ కేసులో సుప్రీంకోర్టు అంగీకరించిందని పిటిషనర్లు ధర్మాసనానికి తెలిపారు. ఆర్థిక బలహీన వర్గాల వర్గంలోకి ముస్లింలను కలపడం అన్యాయమని తెలిపారు.

ఐక్యంగా పోరాడితే అన్నీ విజయాలే

(మొదటిపేజి తరువాయి)

స్వాగతం పలికారు. అనంతరం జక్కలొద్ది సెంటర్‌లో గుడిసెవాసులు కట్టుకున్న నూతన గృహాలకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం సెంటర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. జక్కలొద్ది గుడిసె వాసుల పోరాటాలకు సజీవ సాక్ష్యంగా ఉన్న మహా వృక్షం వద్ద ఏర్పాటు చేసిన అమరు వీరుల స్మృతి స్థూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం జక్కలొద్ది కాలనీకి ప్రగతినగర్ అని, బెస్తం చెరువు కాలనీకి లక్ష్మీపురంగా నామకరణం చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రంగసాయిపేట కార్యదర్శి మాలోతు సాగర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని మాట్లాడారు. ఏడాది కాలంగా ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి జక్కలొద్ది, బెస్తం చెరువులో భూ పోరాటాలు చేస్తూ గృహాలు నిర్మించుకున్న గుడిసెవాసులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తొమ్మిదేండ్లుగా సీఎం కేసీఆర్ సొంతింటి కల నెరవేరుస్తామంటే ఎదురుచూసిన పేదలకు ఓపిక నశించగా.. సీపీఐ(ఎం) ఇచ్చిన భూ పోరాటాల పిలుపుతో ఎర్రజెండా నీడన గుడిసెలు వేసుకున్నారన్నారు. జక్కలొద్దిలో గుడిసె స్థలాల కోసం చేసిన పోరాటాలు యావత్ దేశానికి స్ఫూర్తిదాయకంగా నిలిచాయని, అందుకు మీరు చేసిన ఐక్యపోరాటాలే కారణమని తెలిపారు. ఏడాది కాలంగా ఎన్నో ఇబ్బందులు పడుతూ స్థలాన్ని దక్కించుకున్నారని, ఇదే ఐక్యమత్యంతో పోరాడితే ఈ స్థలాలకు పట్టాలు కూడా దక్కుతాయని స్పష్టంచేశారు. సీపీఐ(ఎం) మీ వెంట ఎప్పుడూ ఉంటుందని, ఎవరు ఎన్ని చెప్పినా పార్టీ జెండాను వదలకుండా ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నాగయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతోందని, పేదలు బీజేపీ మాయలో పడొద్దని, భూ పోరాటాల స్ఫూర్తితో మతతత్వ రాజకీయ పార్టీలపై పోరాడాలని అన్నారు. మనం ఓట్లేసిన నాయకులు ఏసీ బిల్డింగ్‌ల్లో ఉంటున్నారు కానీ మనం మాత్రం గుడిసెలు వేసుకొని అనేక ఇబ్బందులు పడుతూ బతుకుతున్నా, మన దగ్గరకి ఒక్క ఎమ్మెల్యే, కార్పొరేటర్లు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకులు జి. రాములు మాట్లాడుతూ.. రంగు రంగుల జెండాలు ఎన్నో.. మనల్ని మోసం చేసాయి కానీ పేద ప్రజల కోసం ఎర్ర జెండా ఎప్పుడు మీవైపు ఉంటుందని స్పష్టంచేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ.. మీ పోరాటం దేశంలో అన్ని భూపోరాటాలకి ఆదర్శం అని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో కాలనీకి కరెంట్, తాగునీరు, రోడ్లు వచ్చేవరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చింతమళ్ళ రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఇస్సంపెల్లి బాబు, సింగారపు బాబు, సమ్మయ్య, హనుమకొండ శ్రీధర్, బషీర్, యాదగిరి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామస్వామి, కేవీపీస్ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాంబమూర్తి, ప్రజానాట్య మండలి అధ్యక్ష, కార్యదర్శులు దుర్గయ్య, అనిల్, ఏరియా కమిటీ సభ్యులు, సోషల్ మీడియా కార్యదర్శి గజ్జ చందు, పార్టీ శాఖ కార్యదర్శులు, కమిటీ సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

నేడే కర్నాటకలో పోలింగ్

- 224 స్థానాల్లో 2,615 మంది పోటీ
- ఉదయం 7 గంటల నుంచి 6 గంటల వరకూ ఓటింగ్

బెంగళూరు : కర్నాటక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ బుధవారం జరగనుంది. మొత్తం 224 నియోజకవర్గాల్లో 5,31,33,054 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరిగే ఓటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 58,545 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్, జెడి(ఎస్) ప్రధాన పార్టీలుగా పోటీ చేస్తున్నాయి. సిపిఎం నాలుగు స్థానాల్లో బరిలో ఉంది. మొత్తంగా 2,615 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఓటర్లల్లో 2,67,28,053 మంది పురుషులు కాగా, 2,64,00,074 మంది మహిళలు, 4,927 మంది ఇతరులు.

2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 72.44 శాతం ఓటింగ్ నమోదయింది. రాజధాని బెంగళూరులో కేవలం 55 శాతం మాత్రమే నమోదయింది. దీంతో ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి అధికారులు కృషి చేస్తున్నారు. ఓటర్లను ఆకర్షించడానికి బృహత్ బెంగళూరు మహనగర పాలిక (బిబిఎంపి)లో 264 థీమ్ బేస్డ్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఆరోగ్యం, యువజన, సాంస్కృతికం, పింక్, ట్రాన్స్‌జెండర్, చిరుధాన్యాలు, గో గ్రీన్, వికలాంగులు, పర్యావరణం, శాస్త్ర–సాంకేతికత, క్రీడలు, సైన్యం వంటి థీమ్స్‌తో వీటిని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కాగా, దేశంలో తొలిసారిగానే ఈ ఎన్నికల్లో 'ఓట్ ఫ్రమ్ హోం' అనే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. దీని ద్వారా వికలాంగులు, 80 ఏళ్ల దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయింది.

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. గతేడాది పదవీచ్యుతుడై నప్పటి నుండి ఆయనపై పెండింగ్‌లో వున్న పలు కేసుల్లో ఒక కేసు విచారణ సందర్భంగా కోర్టుకు హాజరైన సమయంలో ఆయనను కోర్టు వెలుపల పేరా మిలటరీ రేంజర్లు అరెస్టు చేశారు. ఖాదిర్ ట్రస్టు అవినీతి కేసులో ఇమ్రాన్ ఖాన్ అరెస్టయ్యారని ఇస్లామాబాద్ పోలీసుల ట్విట్టర్ ఖాతా పేర్కొంది. కాగా ఇస్లామాబాద్‌లో 144వ సెక్షన్‌ను విధించినట్లు తెలిపింది. ఆ నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఆయన అరెస్టును పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ కూడా ధృవీకరించింది. ఖాన్‌పై నమోదైన కుట్ర కేసులో మే 3 వరకు తొలుత సుప్రీం కోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. సీనియర్ ఆర్మీ అధికారిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారంటూ ఖాన్‌పై సైన్యం విమర్శలు చేసిన మరుసటి రోజే ఈ అరెస్టు చోటు చేసుకుంది. తనను చంపేసేందుకు సైన్యం కుట్ర పన్నుతోందంటూ ఇమ్రాన్ ఆరోపణలు చేశారు. ఇమ్రాన్ ఖాన్‌ను వేధిస్తున్నారని పార్టీ ఆరోపించింది కానీ ఆ ఆరోపణలు వాస్తవమా కాదా అనేది వెల్లడి కాలేదు. అరెస్టు గురించి తెలియగానే వందలాదిమంది పార్టీ కార్యకర్తలు ఇస్లామాబాద్ వ్యాప్తంగా నిరసనలు నిర్వహించారు. అల్లర్ల తరహా పరిస్థితులను సృష్టించారు. అయితే ఎక్కడా హింసాత్మక ఘటనలు జరగలేదని పోలీసులు చెప్పారు. లాహోర్‌లో కూడా నిరసనలు చోటు చేసుకున్నాయి. లాహోర్ నుండి ఇస్లామాబాద్‌కు వచ్చిన ఇమ్రాన్ ఖాన్ కోర్టు వెలుపల బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తుండగా, గ్లాస్ విండోను ఛేదించుకుని వచ్చిన రేంజర్లు తొలుత ఖాన్ భద్రతా సిబ్బందిపై, లాయర్లపై చేయి చేసుకున్నారు. అనంతరం ఆయనను అరెస్టు చేశారని పార్టీ సీనియర్ నేత షిరీన్ మజారి తెలిపారు. ఇమ్రాన్ కారును చుట్టుముట్టారని పిటిఐ ఉపాధ్యక్షుడు ఫవద్ చౌదరి ట్వీట్ చేశారు. రియల్ ఎస్టేట్ నుండి కోట్లాది రూపాయిలను ఇమ్రాన్ ఆయన భార్య ముడుపులుగా తీసుకున్న కేసులో ఈ అరెస్టు జరిగినట్లు పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు.

120కి పైగా కేసులు

పాక్ మాజీ ప్రధానిపై దేశవ్యాప్తంగా 121 కేసులు వున్నాయి. దేశద్రోహం, దైవ దూషణ, హింసకు, తీవ్రవాదానికి పాల్పడడం, రెచ్చగొట్టడానికి సంబంధించిన కేసులే ఇవన్నీ. రాజధానిలో 31కేసులు నమోదవగా, లాహోర్‌లో 30 కేసులు, కాల్ అప్ నోటీసులు జారీ అయ్యాయని ఇటీవల ఇస్లామాబాద్ హైకోర్టుకు అందచేసిన జాబితా పేర్కొంది. తీవ్రవాదానికి సంబంధించిన కేసుల్లో 12 కేసులు లాహోర్‌లో, 14 కేసులు ఫైజలాబాద్‌లో నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా పలు చోట్ల మరో 22 కేసులు వున్నాయి.

మధ్య ప్రదేశ్‌లో ఘోరం

(మొదటిపేజి తరువాయి)


ఇండోర్ నుంచి ఖర్గోన్ పట్టణం సమీపంలోని శ్రీఖంది గ్రామానికి వెళుతుండగా, డోంగర్గాన్ గ్రామం వద్ద ఉదయం 8:40 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం సమయంలో బస్సులో 50 మందికిపై ప్రయాణీకులు ఉన్నారు. ముందుగా వంతెన రెయిలింగ్‌ను ఢీకొట్టి బస్సు తరువాత నదిలో పడిపోయింది. ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రులను ఖర్గోన్‌లోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుల్లో బస్సు డ్రైవర్, క్లీనర్‌గా ఉన్నారు. బస్సు ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందినదని, పరిమితికి మించిన ప్రయాణీకుల సంఖ్య కారణంగానే బస్సు ప్రమాదానికి గురై ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం, పీఎంఓ

ఈ ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 4 లక్షల పరిహారాన్ని మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ. 50 వేలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ. 25 వేల పరిహారాన్ని ప్రకటించింది. అలాగే ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) కూడా ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ప్రమాదంలో మరణించిన ప్రతీ వ్యక్తీ కుటుంబానికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ 2 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. అలాగే గాయపడిన వారికి రూ.50 వేల పరిహారాన్ని ప్రకటించింది.

వెనక్కి తగ్గం...

(మొదటిపేజి తరువాయి)



కొత్తగూడెం జిల్లాలో ములకలపల్లిలో వైస్ఎంపీపీ కొదుమూరు పుల్లారావు మద్దతు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల సమ్మె 12వ రోజు కొనసాగింది. ఆమనగల్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షల్లో కందుకూరు, ఆమనగల్, మహేశ్వరం, కడ్తాల్, తలకొండపల్లి మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. వారికి పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

సీఎం ప్రధాన సలహాదారుడిగా సోమేశ్ కుమార్

(మొదటిపేజి తరువాయి)

కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. సంబంధిత ఉత్తర్వులను హైకోర్టు కూడా సమర్థించింది. ఇందుకు సంబంధించి క్యాట్ ఇచ్చిన తీర్పును సైతం హైకోర్టు కొట్టేయటంతో ఆయన ఏపీకి బదిలీ కావాల్సి వచ్చింది. ఆ తర్వాత సోమేశ్... స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో తనకు అత్యంత సన్నిహితుడైన సోమేశ్ కుమార్‌కు తగు ప్రాధాన్యతనిచ్చిన సీఎం కేసీఆర్... ఆయనకు క్యాబినెట్ హోదా కలిగిన ప్రధాన సలహాదారుడి పదవిని కట్టబెట్టారు. ఈ సందర్భంగా సోమేశ్... సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మరో నలుగురు అరెస్ట్

(మొదటిపేజి తరువాయి)

నాగార్జునసాగర్‌కు చెందిన రమావత్ మహేష్, ఖమ్మం జిల్లాకు చెందిన పొన్నం వరణ్‌ను సిట్ మంగళవారం అరెస్టు చేసింది. ఈ కేసులో నిందితుల సంఖ్య ఇప్పటికి 28కి చేరగా 27 మందిని అరెస్టు చేసింది. నలుగురు నిందితులను కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకోనుంది. ఇదిలాఉండగా సోమవారం అరెస్టు చేసిన మనోజ్, మురళీధర్‌కు కోర్టు రిమాండ్ విధించింది.

1036 జూనియర్ కాలేజీలకే గుర్తింపు

- ఫీజు చెల్లించిన కళాశాలలు 1,531
- త్వరలోనే అనుబంధ గుర్తింపు ప్రక్రియ పూర్తి
- ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇప్పటి వరకు 1,036 జూనియర్ కాలేజీలకే అనుబంధ గుర్తింపు లభించింది. అందులో ప్రభుత్వ ఆధ్వర్యంలోని జూనియర్ కాలేజీలే ఉన్నట్టు తెలుస్తున్నది. ఉదాహరణకు గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లున్నాయి. జూనియర్ కాలేజీల నుంచి ఇప్పటికే దరఖాస్తులను స్వీకరించారు. వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. 1,531 జూనియర్ కాలేజీలు ఫీజును చెల్లించాయి. డీఐఈవోలు, ఇంటర్ బోర్డులో ఆ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ పరీక్షలు ఆ తర్వాత ఫలితాల విడుదలపైనే అధికారులు దృష్టి కేంద్రీకరించారు. అందుకే అనుబంధ గుర్తింపు ప్రక్రియ ఆలస్యమైంది. రాష్ట్రంలో మిక్స్‌డ్ ఆక్యుపెన్సీలో ఉండే జూనియర్ కాలేజీల పట్ల ఇంటర్ బోర్డు కఠినంగా వ్యవహరిస్తున్నది. 2023-24లో ప్రవేశాలు పొందే సమయంలోనే విద్యార్థుల నుంచి డిక్లరేషన్ పొందాలని ఆంక్షలు విధిస్తున్నది. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీలో ఉన్నందున 2024-25 విద్యాసంవత్సరంలో ఆ కాలేజీకి గుర్తింపు రాకుంటే వేరే కాలేజీలో చదివేందుకు ఇష్టమే అంటూ విద్యార్థులు అంగీకరించాల్సి ఉంటుంది. ఇంకోవైపు ఆ కాలేజీ మిక్స్‌డ్ ఆక్యుపెన్సీలో ఉందన్న వాస్తవం విద్యార్థులకు తెలియడం కోసమే ఈ నిర్ణయాన్ని అధికారులు తీసుకున్నట్టు సమాచారం. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీలో ఉండే కాలేజీలకు ఫైర్ ఎన్వోసీ తప్పనిసరిగా కావాల్సి ఉంటుంది. అయితే హోం శాఖ నిబంధనలు కఠినంగా ఉన్నందున ఆ ఎన్వోసీ కాలేజీలకు రావడం లేదు. దీంతో ఏటా ఆయా కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ఫైర్ ఎన్వోసీ నుంచి సడలింపునివ్వడం షరామామూలుగా జరుగుతున్నది. వచ్చే విద్యాసంవత్సరం వరకు మిక్స్‌డ్ ఆక్యుపెన్సీలోని కాలేజీలకు ప్రభుత్వం సడలింపునిచ్చింది. కానీ 2024-25 విద్యాసంవత్సరంలో ఆ కాలేజీల పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారనుంది. అందుకే ఇంటర్ బోర్డు వచ్చే విద్యాసంవత్సరంలో చేరే విద్యార్థుల నుంచి డిక్లరేషన్‌ను తీసుకోవాలని నిర్ణయించింది. జూనియర్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం తనను కలిసిన విలేకర్లతో చెప్పారు. ఇప్పటికే దరఖాస్తులను స్వీకరించామని, వాటిని పరిశీలించి త్వరితగతిన నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

మా అనుమతి తీసుకున్నాకే ప్రకటన ఇవ్వాలి

- నీట్, జేఈఈ, ఎంసెట్ ర్యాంకుల ప్రచారానికీ అవసరమే
- నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తాం
- కార్పొరేట్ కాలేజీలకు ఇంటర్ బోర్డు హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు ప్రకటన ఇవ్వాలంటే ఇంటర్ బోర్డు అనుమతి పొందడం తప్పనిసరి. ఆ తర్వాతే ఆ ప్రకటనను మీడియా సంస్థలకు ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘించి ప్రకటనలిస్తే జరిమానా విధిస్తామని ఇంటర్ బోర్డు హెచ్చరించింది. ఆ ప్రకటనలకు ఎంత ఖర్చు అవుతుందో అంతే డబ్బును ఇంటర్ బోర్డుకు జరిమానా కట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆ ప్రకటనను ఖండిస్తూ ఇంటర్ బోర్డు మీడియాకు ఇచ్చే ప్రకటనకు అయ్యే ఖర్చును కూడా ఆయా కాలేజీల యాజమాన్యాలే భరించాల్సి ఉంటుందని బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం తనను కలిసిన విలేకర్లతో చెప్పారు. ఇంటర్మీడియెట్ మార్కులే కాకుండా జూనియర్ కాలేజీ పేరుతో ఇచ్చే ఏ ప్రకటన అయినా బోర్డు అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. నీట్, జేఈఈ, ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షల్లో సాధించిన ర్యాంకుల ప్రచారానికీ అనుమతి తీసుకోవాలని అన్నారు. మీడియాలో వచ్చే ప్రకటనలను పర్యవేక్షించడం కోసం కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ప్రకటనలపై నిఘా పెంచేందుకు ఐదుగురితో కమిటీని నియమించామని వివరించారు. తప్పుడు పద్ధతుల్లో మోసపూరిత ప్రకటనల ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులను మభ్యపెట్టే విధానానికి స్వస్తి పలుకుతామని చెప్పారు. అయితే కాలేజీలు ఇచ్చే ప్రకటనలను తాము నియంత్రించబోమని, ఆ ప్రకటనలో ఉండే తప్పుడు సమాచారాన్ని మాత్రమే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

యువత బీఆర్ఎస్ వైపే...

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని యువతరం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)తోనే ఉన్నదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఎస్పీ పార్టీలకు చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా వచ్చి, మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు భావోద్వేగాలతో తాము బీఆర్ఎస్‌లో ఎందుకు చేరుతున్నామో చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతున్నదనీ, దాన్ని తాము కళ్లారా చూస్తూ కూడా మరో పార్టీల జెండాలు మోయడం సరికాదని భావిస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ నీచ, అవినీతి రాజకీయాలకు..అభివద్ధికి మధ్య జరిగే పోరాటంలో యువత అభివద్ధి వైపే ఉంటారని ఆశాభావం వ్యక్తంచేశారు.

బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో యువకులు బీఆర్ఎస్‌లో చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మెన్ మార గంగారెడ్డి, ఎంపీపీ డాక్టర్ మధుశేఖర్, వైస్ ఎంపీపీ సురేష్, సర్పంచ్ లింబాద్రి, రాజశేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ అశోక్, తలారి ప్రభాకర్, మోర్తాడ్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు..

బీఎన్ స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరు

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.సుధాకర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎంపీ భీమిరెడ్డి నరసింహారెడ్డి స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో బీఎన్ 15వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఎన్ చిత్రపటానికి ఆ పార్టీ సీనియర్ నాయకులు గాదె మల్లేశ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. వనం సుధాకర్ మాట్లాడుతూ... తెలంగాణలో కుల మతాలకతీతంగా ప్రజలను సమీకరించి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. ఆ పోరాటంలో బీఎన్ తెలంగాణ చేగువేరాగా గుర్తింపు పొందారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని, బీఎన్ లాంటి మహనీయుల చరిత్రను చెరిపివేసే కుట్రలకు పూనుకున్నదని విమర్శించారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.తుకారాం నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుకన్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర రాజేష్,ఇ. కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ యోధుడు బీఎన్ : బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్

బీఎన్ సామాజిక న్యాయ యోధుడని బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ కొనియాడారు. ఓంకార్ భవన్‌లో బీఎన్ వర్ధంతిలో బీసీపీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలుతో కలిసి ఆయన పాల్గొన్నారు. వారు బీఎన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నల్లా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. సమస్త ప్రజల సమానత్వాన్ని బీఎన్ కోరుకున్నారన్నారు.

క్రీడలను విస్మరిస్తున్న రాష్ట్ర సర్కారు

పీలో తెలంగాణ-పిలావో నినాదంతో కేసీఆర్ పాలన : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఖేలో ఇండియా- జీతో ఇండియా' నినాదంతో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తున్నదనీ, రాష్ట్రంలోనేమో సీఎం కేసీఆర్ 'పీలో తెలంగాణ-పిలావో తెలంగాణ' నినాదంతో మద్యాన్ని ఏరులై పారిస్తూ క్రీడలను విస్మరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ విమర్శించారు. హైదరాబాద్‌లోని ఛాదర్‌ఘాట్ లో 'ఖేలో భారత్-జీతో భాగ్యనగర్' పేరిట క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మెన్ హన్స్‌రాజ్ అహిర్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ శంకర్, ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌లతో కలిసి ఆయన క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ..విద్యార్థులకు చదువు ఎంత ప్రాధాన్యత ఇస్తారో ఆటలకు కూడా అంతే ఇవ్వాలని సూచించారు.

చదువే జీవితం కాదు...

- పరీక్షలంటే మితిమీరిన భయమొద్దు
- ఆత్మహత్యలు పరిష్కారం కాదు: డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మనిషికి చదువే జీవితం కాదనీ, పరీక్షలంటే మితిమీరిన భయం పెట్టుకోవద్దని కౌన్సెలింగ్ సైకో థెరపిస్ట్, హిప్నో థెరపిస్ట్ డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యతిరేక ఆలోచనలు కలిగిన వారికి ప్రతిదీ పరీక్షలాగానే కనిపిస్తుందని తెలిపారు. ఆత్మహత్యలు ఏ సమస్యకూ పరిష్కారం కాదని స్పష్టం చేశారు. పరీక్షలు విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకునేందుకే గానీ అవే సర్వస్వం కాదని ఆమె పేర్కొన్నారు. ఒకసారి మార్కులు తక్కువ వచ్చిన వారు మళ్లీ బాగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకునే పిల్లలు నిరాశలో ఉన్న సమయంలో తల్లిదండ్రులు వారిని గుర్తించి స్నేహపూర్వకంగా పర్యవేక్షించాలని సూచించారు. ప్రేమతో మాట్లాడుతూ సైకాలజిస్టు వద్దకు తీసుకెళ్లాలని కోరారు. పరీక్ష తప్పితే లోపమెక్కడ ఉందో తెలుసుకుని మెరుగుపరుచుకుని విజయం సాధించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆనందాలకు దూరం చేస్తూ చదివే యంత్రాలుగా పిల్లలను మార్చవద్దని తల్లిదండ్రులకు ఆమె సూచించారు.

ఎక్కడ తవ్వినా...ముందు సమాచారమివ్వాలి

టెలికం సంస్థలకు సీఎస్ హెచ్చరిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఎలాంటి తవ్వకాలు జరిగినా ప్రభుత్వానికి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాల్సిందేనని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. మంగళవారంనాడామె అధ్యక్షతన స్టేట్ బ్రాడ్‌బ్యాండ్ కమిటీ సమావేశం జరిగింది. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మ, ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఆర్ అండ్ బీ కార్యదర్శి శ్రీనివాస్ రాజు, పీఆర్ అండ్ ఆర్డీ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, బీఎస్ఎన్ఎల్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెలికాం సూచికల్లో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే చాలా ముందుందని చెప్పారు. 3.5 కోట్ల జనాభాకు నాలుగు కోట్లకు పైగా మొబైల్ కనెక్షన్లతో టెలి-సాంద్రత (107శాతం) ఉందన్నారు. 97.7 శాతం గ్రామాలు మొబైల్ కనెక్టివిటీతో ఉన్నాయనీ, దేశంలో 5జీని ప్రారంభించిన అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉన్నదని వివరించారు. 5జీ సేవలను వేగవంతం చేసేందుకు వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఏ రకమైన తవ్వకాలనైనా ప్రారంభించేందుకు 'కాల్ బిఫోర్ యు డిగ్' (సీబీయుడీ) యాప్ ద్వారా ముందస్తు సమాచారం అందించిన తర్వాతే తవ్వకాలు చేయాలని తేల్చిచెప్పారు.

సరుకు రవాణాలో రైల్వే రికార్డు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే జోన్ సరుకు రవాణాలో రికార్డులను అధిగమించిందని జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఏప్రిల్ నెలలో రైల్వే ప్రయాణీకుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ఏప్రిల్ నెలలో ప్రయాణీకుల రవాణా ద్వారా రూ. 465.38 కోట్లు గడించామని మంగళవారంనాటి ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ పెంపుదల 27 శాతం ఉందన్నారు. అలాగే సరుకు రవాణాలో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 11.298 మెట్రిక్ టన్నులు లోడింగ్ చేసి, రూ.1,105.79 కోట్ల ఆదాయాన్ని గడించామన్నారు.

రైతుల బాధలు పట్టించుకోండీ..

సీఎం కేసీఆర్‌కు ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ గడీని వీడి రైతుల సమస్యలను పట్టించుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్నదాతలను పట్టించుకునే వారు లేకపోవటంతో వారు రోడ్లపైకొచ్చి పోలీసు అధికారుల కాళ్లు మొక్కుతున్నారని తెలిపారు. 'అబ్ కి బార్ కిసాన్ కి సర్కార్' అంటే ఇదేనా అని ప్రశ్నించారు.అకాల వర్షాల వల్ల ధాన్యం పాడైపోతే ప్రభుత్వం నుండి రైతులకు లభించిన సహకారం ఏమీ లేదని తెలిపారు.

ఆగస్టు నాటికి 31 సీవరేజి ట్రీట్మెంట్ ప్లాంట్లు

- మహాప్రస్థానం కంటే అద్భుతంగా బేగంపేట శ్మశానవాటిక
- నగరంలో త్వరలో డబుల్ బెడ్‌రూమ్స్ పంపిణీ :కేటీఆర్



నవతెలంగాణ-బేగంపేట్

ఈ సంవత్సరం ఆగస్టు 31 నాటికి హైదరాబాద్ నగరంలో రూ.3866 కోట్లతో 31 సీవరేజి ట్రీట్మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ బేగంపేట డివిజన్‌లోని శ్మశానవాటిక జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం కంటే అద్భుతంగా ఉందన్నారు. బేగంపేటలో రూ.8.54 కోట్లతో నిర్మించిన శ్మశానవాటికను మంగళవారం మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేగంపేట డివిజన్‌లోని ధనియాల గుట్టలో శ్మశాన వాటిక విషయంలో ఎమ్మెల్యే కృష్ణారావు ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నారని చెప్పారు. ఎల్బీనగర్‌లో మూడు మతాల వారికి ఒకే చోట తొమ్మిది ఎకరాల్లో శ్మశానవాటిక నిర్మించినట్టు చెప్పారు.నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లను త్వరలో పంపిణీ చేయనున్నట్టు మంత్రి తెలిపారు. గతంలో వరదలు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు రూ.560 కోట్ల సహాయం చేసిందని చెప్పారు. కేంద్రం పైసా కూడా ఇవ్వలేదన్నారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో పెట్టే విధంగా పని చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రూ.45 లక్షల విలువ గల రెండు అంతిమ యాత్ర వాహనాలను విరాళంగా అందజేసిన నర్సింహారెడ్డిని మంత్రి అభినందించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ధనియాలగుట్ట శ్మశానవాటిక వల్ల 20 బస్తీలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో రానున్న కాలంలో 54 గ్రేవ్ యార్డ్‌లను అభివృద్ధి చేసి ప్రజలకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపాల్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, సురేష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆ నిధులనూ వదలని సర్కార్

- దారిమళ్లిన లైంగిక దాడి బాధితుల నష్టపరిహార డబ్బులు..
- వాటిని తక్షణం విడుదల చేయాలి..లేదంటే ఉద్యమం..
- దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



నవతెలంగాణా బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ ఎస్టీ లైంగిక దాడి బాధితులకోసం వినియోగించాల్సిన నిధులను దారిమళ్లించడం అత్యంత హేయమైన చర్యనీ, సమాజంలో వివిధ రూపాల్లో దాడులు, వివక్షను ఎదుర్కొంటున్న బాధితులపై ప్రభుత్వం మరో రకమైన వివక్ష చూపించటమంటే..చట్టాన్ని ఉల్లంఘించటమేనని పలువురు దళిత సంఘాల నేతలు విమర్శించారు.

బాధితులకు చెల్లించాల్సిన రూ.10 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్ళించి, వారిని దగా చేయటం తగదని వారు హెచ్చరించారు. దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్), నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్ (ఎన్ఏపీఎఫ్), మాల సంక్షేమ సంఘం (ఎంఎస్ఎస్) అధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ లైంగిక దాడి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలనే రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రాంప్రసాద్, శంకర్, శివలింగం, పులి కల్పన మాట్లాడుతూ బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఫిబ్రవరిలో రూ.5 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు.ఆ మొత్తానికి మరో రూ.5 కోట్లను జమచేసి మొత్తం పది కోట్లకు బడ్జెట్ రిలీజ్ అర్డర్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల ఖాతాలకు డబ్బులు పంపి గంట వ్యవధిలోనే తిరిగి తీసుకుందని వాపోయారు. ఈ రకంగా బాధితులకు ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 వేల మంది బాధితులకు నష్టపరిహారం చెల్లించలేదని చెప్పారు. వారికి అందించాల్సిన పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తక్షణ సహయం,నష్టపరిహారం,పునరావాసం భిక్ష కాదనీ, హక్కు అని చెప్పారు.పెండింగ్‌లో ఉన్న మొదటి, రెండు, మూడు దశల్లో చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని బాధితులకు అందించి పునరావాసం కల్పించాలన్నారు. బాధితుల నష్టపరిహారం నిధులను వెనక్కి తీసుకునే స్థాయికి రాష్ట్ర ప్రభుత్వం దిగజారడమేంటని ప్రశ్నించారు. ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదైన ఏడు రోజుల్లో మొదటి దశ నష్టపరిహారం చెల్లించాలనీ, ఛార్జీషీటు వేసిన తర్వాత రెండో దశ, నిందితులకు శిక్ష పడిన తర్వాత చివరి దశ నష్టపరిహారాన్ని చెల్లించి పునరవాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన్నే ఉందని తెలిపారు. కాచిగూడకు చెందిన బాధితురాలు సంధ్య మాట్లాడుతూ తన భర్త గణేష్ మరణించిన కేసులో జనవరిలో ప్రభుత్వం మొదటి దశగా రూ.25 వేల నష్టపరిహారం ఇస్తూ ప్రొసిడింగ్ ఇచ్చినప్పటికీ నేటికి పరిహారం అందలేదన్నారు. బషీర్‌బాగ్‌కు చెందిన ప్రవీణ్ మాట్లాడుతూ తనకు జనవరిలో ప్రొసిడింగ్ ఇచ్చినప్పటికీ పరిహారం అందలేదని చెప్పారు. లాలాపేటకు చెందిన పద్మ మాట్లాడుతూ తన తమ్ముడు పాండును హత్య చేసి ఆరు నెల్లు గడుస్తున్నా న్యాయం జరగలేదని వివరించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు డాక్టర్ నిమ్మ బాబురావు, శ్రీ కాంత్, దాసు తదితరులు పాల్గొన్నారు.

పశువులా మాట్లాడకు...తలసాని?

కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతరావు హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పశుసంవర్ధక శాఖ బాధ్యతలు నిర్వహిస్తూ...పశువులా మాట్లాడకు అంటూ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావు హెచ్చరించారు. టీడీపీలో ఉండి ఆయన ప్రజలకు ఏం చేశారోఅందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సునీతారావు విలేకర్లతో మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఎవరి దమ్ము ఎంతో తెలుస్తుందని హెచ్చరించారు. శ్రీకాంతాచారి చనిపోవడానికి కారణం తలసాని శ్రీనివాస్ కదా? అని ప్రశ్నించారు.

రెజ్లర్లపై బీజేపీ ఎంపీ వేధింపులు దేశానికే అవమానకరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఒలింపిక్, కామన్వెల్త్ గేమ్స్ పతకాలను సాధించి భారతదేశ కీర్తిపతాకాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులు దేశానికే అవమానకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బ్రిజ్ భూషణ్ వంటి నిందితులను కాపాడుతూ, న్యాయం కోసం పోరాడుతున్న మహిళా క్రీడాకారిణులను అవమానపరుస్తూ బీజేపీ దేశం పరువు తీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రెజ్లర్లకు సంఘీభావంగా సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ మఖ్దూమ్ భవన్ నుంచి 'వై' జంక్షన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.

ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాలతో బ్రిజ్ భూషణ్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిడితోనే ఢిల్లీ పోలీసులు అతన్ని అరెస్టు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపుల నిందితులను కాపాడటంలో బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దేశ ప్రతిష్ఠను దెబ్బ తీస్తుందన్నారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ.. మైనర్‌తోపాటు ఏడుగురు రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ విషయంలో కేంద్ర నాయకత్వం ఎందుకు మౌనం పాటిస్తున్నదని ప్రశ్నించారు. బీజేపీ మౌనం 'మహిళా వ్యతిరేక' ముఖాన్ని బట్టబయలు చేసిందన్నారు. నేరాలు చేయడం, ముఠాలను నడిపించడం, హత్యలు, లైంగికదాడులు, దోపిడీలకు పాల్పడిన వారు ఎక్కువ మంది బీజేపీలో ప్రజాప్రతినిధులుగా ఉన్నారని విమర్శించారు.

సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ బ్రిజ్ భూషణ్‌కు మోడీ ప్రభుత్వం మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. దేశం మహిళా రెజ్లర్ల కన్నీళ్లను చూస్తోందని, దేశం బీజేపీని క్షమించదని అన్నారు. మహిళా రెజ్లర్లకు న్యాయం జరిగే వరకు సీపీఐ దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి.నరసింహ, పశ్య పద్మ, విఎస్.బోస్, నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, టి.శ్రీనివాస్‌రావు, నాయకులు కలవేణి శంకర్, ఎన్.బాలమల్లేష్, ఎం.బాలనరసింహ, బి.హేమంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఐదుగురు ఉగ్రవాదులను పట్టుకున్న మధ్యప్రదేశ ఏటీఎస్

నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో మరోసారి ఉగ్రవాదుల కదలికలు తేలాయి. హైదరాబాద్ నగరంలోనే మకాం వేసిన ఐదుగురు ఉగ్రవాదులను మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) ప్రత్యేక టీమ్ అరెస్టు చేసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం హిజ్ ఉజ్ తంజమిన్ అనే ఉగ్రవాద సంస్థకు చెందిన కొందరు ఉగ్రవాదులు హైదరాబాద్‌లో మకాం వేసినట్టు కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులకు మొదట సమాచారం అందింది. అప్పటికే ఈ సంస్థకు చెందిన వారు మధ్యప్రదేశ్‌లో కూడా తమ రహస్య కార్యకలాపాలను సాగిస్తున్నట్టు ఐబీ సమాచారం. దీని ఆధారంగా రంగంలోకి దిగిన మధ్యప్రదేశ్ ఏటీఎస్ పోలీసులు అక్కడ 11 మంది ఉగ్రవాదులను అరెస్టు చేశారు. వారి విచారణలో హైదరాబాద్‌లో కూడా మారు పేర్లతో మకాం వేసిన మరి కొందరు ఉగ్రవాదుల గురించిన సమాచారం బయటపడింది. దీంతో గత మూడు రోజులుగా మకాం వేసిన ఏటీఎస్ పోలీసులు రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారుల సహకారంతో ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలను అత్యంత రహస్యంగా చేపట్టారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పాతబస్తీతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఐగుదురు ఉగ్రవాదులను ప్రత్యేక టీమ్ అధికారులు పట్టుకున్నారు.

నేడు టెన్త్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని ఎస్సీఈఆర్టీ ప్రాంగణంలోని గోదావరి హాల్‌లో విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేయనున్నారు. పదో తరగతి పరీక్షలు గతనెల మూడు నుంచి 13వ తేదీ వరకు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 18 మూల్యాంకన కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థుల జవాబు పత్రాలను మూల్యాంకనం చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 4,94,620 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 4,85,826 మంది రెగ్యులర్ విద్యార్థులున్నారు. పదో తరగతి ఫలితాల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు http://results.bse.telangana. gov.in, http:// results. bsetelangana.org వెబ్‌సైట్లను సంప్రదించాల్సి ఉంటుంది.

ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులపై సాధింపు చర్యలు మానుకోవాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని శాంతియుత పద్ధతిలో నిరసన తెలిపితే, నోటీసులు ఇచ్చి పోలీసులతో బెదిరింపులకు గురిచేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ స్పష్టంచేసింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టీ నాగరాజు ఓ ప్రతికా ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం లేదనే విషయాన్ని ఆరునెలల క్రితమే వీసీ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా క్యాంపస్‌లో తాగడానికి నీరు కూడా అందుబాటులో లేదన్నారు. క్యాంటీన్, సరైన కంప్యూటర్ ల్యాబ్ లేవన్నారు. విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారనే నెపంతో అర్ధంతరంగా యూనివర్సిటీకి సెలవులు ప్రకటించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

జూన్ 4న సీపీఐ ప్రజాగర్జన సభ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇంటింటికీ సీపీఐ ముగింపు కార్యక్రమాన్ని జూన్ 4వ తేదీ కొత్తగూడెంలో 'ప్రజాగర్జన'పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్టు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. మనుధర్మం, విద్య కాషాయీకరణ, నిరుద్యోగం, పెరిగిన ధరలు, రైతుల కష్టాలు, పాలకుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఈ సభను నిర్వహిస్తామన్నారు. ప్రజాగర్జన సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా, కార్యదర్శులు కే నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

15న హుస్నాబాద్ సభ

హుస్నాబాద్‌లో ఈనెల 15న 25వేల మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. తమకు బలమైన హుస్నాబాద్, మునుగోడు, కొత్తగూడెం, బెల్లంపల్లి, దేవరకొండ నియోజకర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. సీట్ల సర్దుబాటును ఎన్నికల సమయం నాటికి మాట్లాడుతామని చెప్పారు.

నేటినుంచి ఎంసెట్

నిమిషం ఆలస్యమైనా నోఎంట్రీ

- 3.20 లక్షల మంది దరఖాస్తు
- 137 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్ ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పకడ్బందీగా ఈ పరీక్షలను నిర్వహించడం కోసం అధికారులు సర్వంసిద్ధం చేశారు. ఈనెల 10, 11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, 12 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను నిర్వహిస్తారు. రోజూ రెండో విడతల్లో పరీక్షలుంటాయి. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటలకు రెండో విడత పరీక్షలు జరుగుతాయి. మొదటి విడతకు ఉదయం 7.30 నుంచి తొమ్మిది గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. రెండో విడతకు మధ్యాహ్నం 1.30 నుంచి మూడు గంటల వరకు అనుమతిస్తారు.

సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతిని నిరాకరిస్తారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌పై ఉన్న నియమ, నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా తెచ్చుకోవాలి. బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. తెలంగాణలో 104, ఏపీలో 33 కలిపి మొత్తం 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 2,05,405 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,15,361 మంది కలిపి మొత్తం 3,20,766 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఇంజినీరింగ్‌కు తెలంగాణ నుంచి 1,53,935 మంది, ఏపీ నుంచి 51,470 మంది అభ్యర్థులు, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి తెలంగాణ నుంచి 94,614 మంది, ఏపీ నుంచి 20,747 మంది దరఖాస్తు చేశారు. ఈ ఏడాది ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల స్థానంలో ఈసారి సిట్టింగ్ అబ్జర్వర్లను ప్రతి కేంద్రంలో నియమిస్తారు. వారే పరీక్ష నిర్వహణకు సంబంధించి అన్ని రకాల పనులనూ పర్యవేక్షిస్తారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచుతారు.

తారీక్ అన్సారీని కలిసిన మొహమ్మద్ సలీం



నవ తెలంగాణ - చైతన్యపురి

తెలంగాణ స్టేట్ మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీక్ అన్సారీ ని మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ మైనార్టీ ఉద్యమ నాయకుడు మొహమ్మద్ సలీం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తారీక్ అన్సారీ ని మొహమ్మద్ సలీం శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు ఎడ్ల. మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలేందర్‌కు ఉస్మానియా డాక్టరేట్



నవతెలంగాణ-బోడుప్పల్

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరుల కుటుంబంలో జన్మించిన కంకల ఎలేందర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా విద్యాలయంలో రిటైర్డ్ ప్రొఫెసర్ జి. లాలయ్య పర్యవేక్షణలో సమాచారహక్కు చట్టం, దాని అమలు నల్లగొండ జిల్లా అధ్యయనం అనే అంశంపై ఎలేందర్ పీహెచ్ డీ పూర్తి చేశారు. ఈ పరిశోధనలో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాలలో జరిగిన అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో తన పరిశోధనా పత్రాలను సమర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలకంగా పని చేసిన ఓయూ జేఏసీ నేత ఎలేందర్ ఉద్యమంలో భాగంగా గాయపడిన సందర్భంలో నాటి ఉద్యమ రథసారథి నేటి తెలంగాణ సీఎం కేసీఆర్ ఎలేందర్ ను పరామర్శించారు. అనంతరం ఎలేందర్ కు ఉస్మానియా ప్రొఫెసర్లు, తెలంగాణ వాదులు అభినందించారు.

నియోజకవర్గ స్థాయిలో నా మార్క్ చూపిస్తా



- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నవతెలంగాణ - హయత్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధితో తన మార్క్‌ను చూపిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హయత్‌నగర్ డివిజన్‌లో దాదాపు రూ.93లక్షల వ్యయంతో వివిధ కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.12.50లక్షలతో హైకోర్ట్ కాలనీ కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ వాల్, పైన చైన్ లింక్ ఫెన్సింగ్ పనులు, రూ.51లక్షలతో రాఘవేంద్ర కాలనీలో బీటీ రోడ్, రూ.13.50లక్షలతో హయత్ నగర్ ఓల్డ్ విలేజ్ కురుమ బస్తీలో సీసీ రోడ్డు, రూ.16లక్షలతో హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద సీసీ రోడ్ నిర్మాణ పనులు చెపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, బీజేపీ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, భాస్కర్ సాగర్, ప్రధాన కార్యదర్శి యానాల కష్ణా రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అంజలి గౌడ్, మాజీ అధ్యక్షుడు గుడాల మల్లేష్, రాకేశ్, గుజ్జ జగన్ మోహన్, బాలునాయక్ గుగులోత్, గోవర్ధన్ నాయక్, దేవరాంనాయక్, పంతునాయక్, బిక్కునాయక్, శంకర్ నాయక్, గాసిరంనాయక్, రవినాయక్, స్కైలాబ్, ఉమ సీనియర్ నాయకులు, పలు డివిజన్ల కమిటీ సభ్యులు, ఉద్యమకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవు

- డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి



నవతెలంగాణ-హయత్ నగర్

నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే గుత్తేదారులపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహా రెడ్డి హెచ్చరించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న జడ్జెస్ కాలనీ ఫేస్ -1 లో 30లక్షల రూపాయలతో చేపడుతున్న నూతన సంక్షేమ భవన నిర్మాణ పనులను అధికారులు, కాలనీ వాసులతో కలిసి జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లో అవసరాల దృష్ట్యా నిర్దిష్టమైన ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీర్ శాఖ ఏ ఈ స్వప్న, సీతారాం, కాలనీ వాసులు అంజయ్య గౌడ్, బాస్కర్, యాదయ్య, బిజెపి నాయకులు పాతూరి శ్రీధర్ గౌడ్, మునగాల హరీష్ రెడ్డి, సిద్ధు పాల్గొన్నారు.

జల్‌పల్లి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొహమ్మద్ షర్ఫుద్దీన్



నవతెలంగాణ - బడంగ్ పేట్

జల్ పల్లి మున్సిపాలిటీ బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మొహమ్మద్ షర్ఫుద్దీన్ నియామకమయ్యాడు. ఈ మేరకు మహమ్మద్ షర్ఫుద్దీన్ కు నియామక పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల, మైనార్టీల అభివద్ధే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టారని కొనియాడారు. అనంతరం మొహమ్మద్ షర్ఫుద్దీన్ తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు కైసర్ బామ్, జల్ పల్లి మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుడు సూరెడ్డి కష్ణారెడ్డి, జల్ పల్లి మున్సిపల్ రిప్రజెంటేటివ్ వైస్ చైర్మన్ సయ్యద్ యూసఫ్ పటేల్, కౌన్సిలర్లు మహమ్మద్ శంషుద్దీన్, పల్లపు శంకర్, పుష్పమ్మ కొండల్ యాదవ్, జల్ పల్లి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షులు ఇక్బాల్ బిన్ ఖలీఫా, వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, జల్ పల్లి మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు అబ్దుల్లా గాలిబ్, యువ నాయకులు యంజాల అర్జున్, జల్ పల్లి మున్సిపాలిటీ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అఫ్జల్, జల్ పల్లి మున్సిపాలిటీ స్పోక్స్ పర్సన్ అబ్దుల్ రావుఫ్, సీనియర్ నాయకులు నాగేష్ ముదిరాజ్, షాకీర్ భాయ్, అంజాద్ భాయ్, అబ్దుల్లా భాయ్, జహంగీర్ భాయ్, సయ్యద్ హీదాబ్, మనస్ భాయ్ బీఆర్ఎస్వీ అధ్యక్షులు, ఫిరోజ్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేసిన కార్యకర్తలకు అభినందనలు



- మల్ రెడ్డి రాం రెడ్డి

నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ లోని సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంఘర్షణ సభను విజయవంతం చేసిన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాం రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రియాంక గాంధీ ముఖ్య అతిథిగా హాజరైన సభకు ప్రజలు వేలాదిగా తరలివచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సభను చూసి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ సభ పూర్తి అయినా గంటకే కాంగ్రెస్ జెండాలు తొలగించారని ఆరోపించారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, కుట్ల నరసింహా యాదవ్, బండ సురేందర్ రెడ్డి, సుజాత రెడ్డి, రమేష్ నాయక్, జైపాల్ రెడ్డి, సరిత, అలివేలు, భాగ్యలక్ష్మి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్తీ ధవఖాన పనుల పరిశీలన



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న బస్తీ దావఖాన నిర్మాణ పనులను మంగళవారం మేయర్ సామల బుచ్చిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దావఖాన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చెరువు సుందరీకరణ పనులను ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చంటి శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మలక్ పేట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



- ఎమ్మెల్యే అహ్మద్ బిన్

నవతెలంగాణ- సంతోష్ నగర్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..అభివద్ధి సంక్షేమ ఫలాలను అందించి మలక్ పేట్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా అన్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కాలనీ పరిశ్రమల ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సమస్యలు తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరిగా ప్రభుత్వ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. స్థానిక సమస్యలుంటే తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సీనియర్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమే

- వీడ్కోలు సభలో మేయర్ వెంకట్ రెడ్డి



నవతెలంగాణ - బోడుప్పల్

ప్రభుత్వ ఉద్యోగులకు వత్తిలో భాగంగా బదిలీలు సాధారణమే అని ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఫీర్జాదిగూడ నగర కమిషనర్ డాక్టర్ రామకష్ణ రావు బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వత్తి ధర్మంలో భాగంగా అనేక సవాళ్లు ఎదురైనా ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేయడం వలన అందరికీ ప్రయోజకంగా ఉంటుందని అన్నారు. అనంతరం నూతన కమిషనర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన వంశీకష్ణ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి సీఐ గోవర్ధన గిరి, కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన పలు కాలేజీలు



ఎస్ఆర్ (శ్రీ గాయత్రీ) లో..

నవ తెలంగాణ - చైతన్యపురి

తెలంగాణ రాష్ట్ర ఇంటర్ ఫలితాలలో ఎస్ఆర్ (శ్రీ గాయత్రీ) విద్యా సంస్థల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ ఎ.సంతోష్ రెడ్డి, డీజీఎం భగవాన్ రెడ్డి లు తెలిపారు. దిల్ సుఖ్ నగర్ లోని ఎస్ ఆర్(శ్రీ గాయత్రి) బ్రాంచ్ లో మంగళవారం అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటిష్టమైన అకాడమిక్ ప్రణాళిక, విద్యార్థుల నిర్విరామ కషి, తల్లీదండ్రుల, అధ్యాపకుల ప్రోత్సాహం వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో శ్రీకర్, లావణ్య నిహారిక, శ్రీవిద్యలకు 470 గాను 460 మార్కులు, బైపీసీ విభాగంలో శతి, దీక్షిత్ లు 436 మార్కులు, ఎంఈసీ విభాగంలో రాగిణికి 492, సైదా కు 489 మార్కులు సాధించినట్లు వివరించారు. ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాలలో ఎంపీసీ విభాగంలో మహితాదేవి, దీపిక, విజయ్ రాయ్ లకు 1000 గాను 992 మార్కులు, బైపీసీ విభాగంలో ప్రేరణకు 986 మార్కులు వచ్చాయని తెలిపారు. అనంతరం అకాడమిక్ డైరెక్టర్ శ్రీనివాస్, జోనల్ ఇంచార్జ్ బంగారు బాబు, ఏజీఎం సురేష్, శివ, ప్రిన్సిపల్స్ వెంకట్ రెడ్డి, సుధీర్, మాధవిలు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

మీర్‌పేట్ : ప్రభుత్వ కాలేజీ..



ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో మీర్‌పేట్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ సైదులు తెలిపారు. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలోనే కళాశాల మంజూరు చేసిందని కళాశాల సెప్టెంబర్ నెలలో ప్రారంభమయ్యిందని అన్నారు. కామర్స్ లెక్చరర్ లేకపోవడంతో కొంత మంది విద్యార్థులు పేయిల్ అయ్యారని తెలిపారు. తక్కువ సమయంలోనే మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. మొదటి సంవత్సరం జి.సెవెంద్ర చారి ఎంపీసీలో 470 మార్కులకు 449, సీఈసీ కె.లావణ్య 378/500మార్కులు సాధించారని తెలిపారు.



చైతన్యపురి : శివాని మహిళా కాలేజీ...

శివాని మహిళా కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ కళాశాల చైర్మన్ డాక్టర్ పి.రామ్ రెడ్డి, కరస్పాండెంట్ వెదిరే సుదర్శన్ రెడ్డి లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఈసీ విభాగంలో రూబ మహమ్మద్ 500 గాను 480, బైపీసీ విభాగంలో అఫ్ష జబీన్ 500కు 469, ఎంపీసీ విభాగంలో మోక్షిత 470కి 454, బైపీసీ విభాగంలో హఫ్సా ఫాతిమాకు 440కి 428 మార్కులు వచ్చాయని తెలిపారు. ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీ విభాగంలో నీసా కుమారికి 983, బైపీసీ విభాగంలో లికితకు 978, ఎంఈసీ విభాగంలో అంకితకు 970, సీ ఈసీ విభాగం లో హర్షితకు 957 మార్కులు సాధించారని చెప్పారు. అనంతరం వారు విద్యార్థులను అభినందించారు.

బోడుప్పల్ : ఎస్ఆర్ కాలేజీ..

ఇంటర్ ఫలితాలలో మేడిపల్లి మండల పరిధిలోని బోడుప్పల్ ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సష్టించారని కళాశాల చైర్మన్ వరద రెడ్డి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1000 గాను కె.కావ్య కు 991, ఎల్.సూర్యకిరణ్ రెడ్డికి 988, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో వై.ఉపేందర్ 467/470, ప్రన్యా ఠాకూర్ 467/470, ఎ. రజిత 466/470, కె.దీక్షిత 466/470, కె.శతి 465/470, ఎన్.అఖిల 465/470, ఎస్.కే.నహీమా 465/470, బైపీసీలో ఎమ్.శతి 433/440 మార్కులను సాధించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సంతోష్, మధుకర్ రెడ్డి, జోనల్ ఇంచార్జ్ సీహెచ్ వెంకట్ రెడ్డి, ఎజీఎం, ప్రిన్సిపాల్స్ కె.మల్లారెడ్డి,ఎన్.లక్ష్మణ్,బీ.నరేష్, పి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.





మీర్ పేట్ :శ్రీ వాగ్దేవి కాలేజీ...

ఇంటర్ ఫలితాల్లో శ్రీ వాగ్దేవి కాలేజీ విద్యార్థులు ప్రభంజనం సష్టించారని ఆ కళాశాల చైర్మన్ సిద్ధాల బీరప్ప అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వి.స్నేహ 1000/989 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. బి. నిహారిక 1000/982, ఎంఈసీలో ఎం. హర్షిని 1000/963 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 470/464 మార్కులు నలుగురు విద్యార్థులు, ఇద్దరు 470/462, ముగ్గురు 461, ముగ్గురు 460 మార్కులు సాధించారని చెప్పారు. మొత్తం 14 మంది విద్యార్థులు 470/ 460 మార్కులు పైబడి సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, డైరెక్టర్స్ పోలోజు రవికుమార్, తిప్పర్తి నరసింహారెడ్డి, ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

హయత్ నగర్ :ప్రభుత్వ కాలేజీ..



ఇంటర్మీడియట్ ఫలితాల్లో హయత్ నగర్ లో ఉన్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి వెల్లడించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని గొడిశాల సోని 983 మార్కులు, సీఈసీలో బనమోని పావని 929, అదే గ్రూప్ లో కొండముడి జోనాతన్ 913 మార్కులు సాధించి అగ్ర స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.



చైతన్యపురి :నారాయణ జూనియర్ కాలేజీ...

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో చైతన్యపురిలోని మేకల బ్రాంచ్ నారాయణ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రభంజనం సష్టించారని ఆ కళాశాల కోర్ డీన్ రాధా క్రిష్ణ అన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ లో కె. గౌతమ్ 470 గాను 467 మార్కులు, ఆరు మంది 466, 12 మంది 465, 100 మంది 450, అలాగే 12 మంది విద్యార్థులు 460 ఆపైన 50 మంది విద్యార్థులు సాధించారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డీజీఎం రాజు, డీన్ అమరేందర్, ప్రిన్సిపల్ రవీందర్ రెడ్డి, ఏవో విజయ్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఆంజనేయ స్వామి రథోత్సవంలో మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ- వనస్థలిపురం

సాహెబ్ నగర్ త్రినేత్ర ఆంజనేయ స్వామి జాతర సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి రథోత్సవం ఊరేగింపు వేడుకలను బీఎన్ రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్, తిగుల స్వరూప పద్మారావు గౌడ్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రవీణ్, శంకర్ మహారాజ్, తరుణ్ మహరాజ్, మాజీ కౌన్సిలర్ అంజన్ కుమార్, ఉమేష్ గౌడ్, ముద్దగౌని చంద్రకాంత్ గౌడ్, నక్క శ్రవణ్ యదవ్, పంకల రాజు, ప్రదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'త్వరగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి'



నవతెలంగాణ- వనస్థలిపురం

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి అన్నారు. డివిజన్ లోని శారదా నగర్ లో చేపట్టిన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీలైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి గోవింద చారి, నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ, అరుణ్, ప్రేమ్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి కల్యాణం



నవతెలంగాణ- ఘట్ కేసర్

పోచారం మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్ గూడ గ్రామంలో ఈగ కష్ణ ముదిరాజ్ కుమారుడు మధు ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇటికాల కష్ణా రెడ్డి, పొట్ట శ్రీశైలం కురుమ, మల్లేష్, గండిపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీదండ్రుల చెంతకు చేరిన తప్పిపోయిన పాప



నవ తెలంగాణ - వనస్థలి పురం

తప్పిపోయిన ఓ పాపను పోలీసులు తల్లీదండ్రుల చెంతకు చేర్చారు. ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..వనస్థలిపురం హుడా సాయి నగర్ లో జరిగే ఓ ఫంక్షన్ కు ఖమ్మం నుండి ఒక కుటుంబం హాజరైంది. ఈ క్రమంలో మౌనిక(4) అనే పాప తప్పిపోయి హుడా సాయి నగర్ కాలనీలో తిరుగుతుంది. గమనించిన కాలనీ వాసులు 100 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు తప్పిపోయిన పాప గురించి ఆ చుట్టుపక్కల విచారించారు. విచారణలో ఫంక్షన్ కు హాజరైనట్లు సమాచారం అందింది. దీంతో వెంటనే వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి ఆ పాపను ఆమె తల్లీదండ్రులకు అప్పగించారు. ఎలాంటి ఫంక్షన్లకు హాజరైన కుటుంబ సభ్యులు తమ పిల్లల్ని జాగ్రత్తగా గమనించుకోవాలని సూచించారు.

విగ్రహా ప్రతిష్టాపనకు మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు ఆహ్వానం



నవతెలంగాణ - ఘట్ కేసర్

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ కంట మహేశ్వర స్వామి ఆలయ విగ్రహా ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ను మంగళవారం చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈ నెల 10 నుండి 15వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోచారం భారత్ రాష్ట్ర సమితి పార్టీ ప్రధాన కార్యదర్శి నల్ల వెల్లి శేఖర్, అన్నోజిగూడ గౌడ సంఘం నాయకులు పొలగొనీ వెంకట స్వామి గౌడ్, ఆల్వాల దర్శన్ గౌడ్, యంజలా శంకర్ గౌడ్, యంజలా భాస్కర్ గౌడ్, అల్వాలా లక్ష్మయ్యగౌడ్, మట్ట దశరథ, బాలగొనీ శంకర్ గౌడ్, బాలగొనీ శ్రీనివాస్ గౌడ్, బాలగొనీ సదానందం గౌడ్, నవీన్ గౌడ్, బాలగొనీ విజయ్ గౌడ్, బాత్కుల శ్రీకాంత్ గౌడ్, శ్రీదర్ గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు ఆపకపోతే ఉద్యమం తప్పదు



- మాసబ్ చెరువు పరిరక్షణ సమితి, అఖిల పక్ష నాయకుల డిమాండ్

నవతెలంగాణ-తుర్కయాంజల్

మాసబ్ చెరువులో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను ఆపకపోతే ప్రజా ఉద్యమం చేస్తామని మాసబ్ చెరువు పరిరక్షణ సమితి, అఖిల పక్ష నాయకులు హెచ్చరించారు. తుర్కయాంజల్ మున్సిపల్ పరిధిలో ఉన్న మాసబ్ చెరువును కాపాడాలని, ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంట నిలిపివేయాలని కోరుతూ మంగళవారం అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో తుర్కయాంజల్ అంబేద్కర్ చౌరస్తా నుండి మాసబ్ చెరువు వరకు ర్యాలీ నిర్వహించారు. తర్వాత సాగర్ రహదారిపై రాస్తారోకో, ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాసబ్ చెరువును రీ సర్వే చేసి హద్దులు గుర్తించాలని డిమాండ్ చేశారు. మాసబ్ చెరువుకు సంబంధించి రూ.వందల కోట్లు విలువైన ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న భూములు కబ్జాకు గురవుతుంటే..రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందని విమర్శించారు. తుర్కయాంజల్ రెవిన్యూ సర్వే నెంబర్ 205లోని సుమారు 12 ఎకరాల భూమి ఇది పూర్తిగా బఫర్ జోన్ కిందికి వస్తుందని అన్నారు. ఈ భూమిలోని పట్టాదారులు కేవలం వ్యవసాయం సాగు చేసుకోవడానికి మాత్రమే అవకాశం ఉంది. కానీ ఇరిగేషన్, రెవిన్యూ, అలాగే మున్సిపల్ అధికారులు కుమ్మక్కై ఈ భూమికి ఎన్ వోసీ ఇచ్చారని ఆరోపించారు. దీంతో రాత్రి సమయాలలో అడ్డగోలుగా వందల సంఖ్యలో లారీలు, టిప్పర్ల మట్టితో చెరువును నింపుతున్నారని వివరించారు. ఈ విధంగా అక్రమ నిర్మాణాలు చేసుకోవడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ కబ్జాదారులను పరోక్షంగా పురిగొల్పుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి రామచందర్, తుర్కయాంజల్ మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు మంగమ్మ శివకుమార్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొశిక అయిలయ్య, కౌన్సిలర్లు కొంద్రు మల్లేష్, కాకుమాను సునీల్, బొక్క రవీందర్ రెడ్డి, నాయకులు దన్ రాజ్ గౌడ్, దర్శన్, చిన్నయ్య, చంద్రశేఖర్ రెడ్డి, చెరువుల పరిరక్షణ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జి. ఆర్ కరుణాకర్, ప్రముఖ న్యాయవాది అరుణ్ కుమార్, బీజేపీ నాయకులు కొత్త అశోక్ గౌడ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ దళిత మోర్చా అధ్యక్షుడు బచ్చిగళ్ల రమేష్, కొంద్రు పురుషోత్తం, బీఆర్ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్ నాయక్ , కొంతం యాదిరెడ్డి, సీపీఎం నాయకులు డి. కిషన్, ఈ .నరసింహ, ఎం. సత్యనారాయణ, భాస్కర్, బీఎస్పీ నాయకులు వద్దిగళ్ల బాబు, గ్యార మల్లేష్, మేతరి కుమార్, టీడీపీ నాయకులు వీరేశం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములు లాక్కుంటున్న కేసీఆర్

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



నవతెలంగాణ, బడంగ్ పేట్

పేదల భూములను కేసీఆర్ ప్రభుత్వం లాక్కుంటుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గ మీర్ పేట్ మున్సిపాలిటీలోని జిల్లెలగూడ లో పీపుల్స్ మార్చ్ పాదయాత్రను మంగళవారం నిర్వహించారు. ఈ పాదయాత్ర మీర్ పేట్, అల్మాస్ గూడ బడంగ్ పేట్ , నాగర్ గుల్ ప్రాంతాల మీదుగా సాగింది. ఈ యాత్రలో ప్రజా గాయకులు గద్దర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి. బడంగ్ పేట్ మున్సిపల్ మేయర్ పారిజాత నరసింహారెడ్డి, పీసీసీ సభ్యులు యేళ్మెటి అమరేందర్ రెడ్డి, దేప భాస్కర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండలంలో 500 ఎకరాల పేదల భూమిని అప్పనంగా ఫార్మసిటీకి అప్పగించింది కేసీఆర్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనే ఐదు లక్షల కోట్ల విలువైన పదివేల ఎకరాల భూమిని, రాజధాని చుట్టూ 25 లక్షల కోట్ల విలువైన భూములను పేదలను భయపెట్టి బలవంతంగా ఈ ప్రభుత్వం గుంజుకున్నదని ఆరోపించారు. ప్రియాంక గాంధీ ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ పార్టీ అధ్యక్షులు పెద్దబావి వెంకటరెడ్డి, కార్పొరేటర్స్ ప్రభాకర్ రెడ్డి,పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్ల గూడెం సంతోషం శ్రీనివాస్ రెడ్డి చల్ల కవిత బాల్ రెడ్డి, బండారి మనోహర్, సిద్దాల మౌనిక శ్రీశైలం, అమత నాయుడు, బోయపల్లి రాఘవేంద్ర రెడ్డి బోయ పల్లి గోవర్ధన్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, గట్టు బాలకష్ణ , సుర్గ గంటివిజయ్ తదితరులు పాల్గొన్నారు.

భూదేవినగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ -నేరేడ్‌మెట్



వెంకటాపురం డివిజన్ పరిధిలోని భూదేవినగర్‌లో రూ 8.4 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు సహకారంతో వెంకటాపురం డివిజన్‌ను సమగ్రాభివద్ధి చేస్తున్నట్టు చెప్పారు.అన్ని కాలనీలు,బస్తీలలో మౌలిక సదుపాయాల కల్పనపై తాను దష్టి సారించినట్టు తెలిపారు. ఈ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివద్ధి చేసి ఆదర్శంగా నిలపడమే ఏకైక ధ్యేయమని స్పష్టం చేశారు . ఈ కార్యక్రమంలో ఏఈ అరుణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, కాలనీ వాసులు లక్ష్మణ్‌రావు, సునీల్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, కమలమ్మ, శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మోసిన్, మైవాన్, సుధేష్, చంద్ర శేఖర్, జాంధర్, జనార్దన్, రఘుపతి రెడ్డి, రామ్, లక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కాప్రా



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టుల సమూదాయ నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం కేసీఆర్ ఐదు ఎకరాల స్థలంలో 90 కోట్ల రూపాయల నిధులను ప్రకటించిన సందర్భంగా జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు కతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటానికి పాలాభిషేక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పాల్గొని మాట్లాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టుల సమూదాయ నూతన భవనాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య , బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట రామచంద్రా రెడ్డి, ఉపాధ్యక్షులు, బార్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా న్యాయస్థానం న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలి

- శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తప్పని సరి
- నంబర్‌ప్లేట్లపై నిర్లక్ష్యం చేస్తే కేసులు పెట్టాలి
- రాచకొండ కమిషనర్ డీ.ఎస్ చౌహాన్

నవతెలంగాణ-సిటీబ్యూరో



రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సీపీ డిఎస్ చౌహాన్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ స్థాయి అధికారులతో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నేరాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మేమున్నామే ధైర్యాన్ని ప్రజల్లో కల్గించాలన్నారు. నేరస్తులను పట్టుకోవటంలో, నేర పరిశోధనలో, సాంకేతిక ఆధారాలతోపాటు సీసీటీవీ కెమెరాలను ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నేరస్తులు తిరిగి నేరాలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాచకొండ పోలీసులు తీసుకుంటున్న చర్యలతో నేరాల శాతం తగ్గిందని కమిషనర్ గుర్తు చేశారు. నేర దర్యాప్తులో సివిల్, ట్రాఫిక్ విభాగాలతోపాటు సాంకేతిక విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాల కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అటువంటి వాహన యాజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాగా పనిచేస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న సిబ్బందికి రివార్డులు అందిస్తామన్నారు. కమిషనరేట్ పరిధిలో మంజూరు చేసిన నూతన పోలీస్ స్టేషన్‌లు త్వరలోనే ప్రారంభం అవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ సత్యనారాయణ, డీసీపీ మల్కాజ్ గిరి జానకి, డీసీపీ యాదాద్రి రాజేష్ చంద్ర, డీసీపీ ఎల్.బి.నగర్ సాయి, ఎస్ఓటి డీసీపీలు గిరిధర్, మురళీధర్, డీసీపీలు మధుకర్ స్వామి, శ్రీ బాల, ఇందిర, అదనపు డీసీపీలు నర్మద, షమీర్‌తోపాటు తదితర అధికారులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ ఢీ కొని విద్యార్థిని మృతి



నవతెలంగాణ-నాచారం

వాటర్ ట్యాంకర్ డీసీఎం ఢీకొని ఓ విద్యార్థిని అక్కడికక్కడే మతి చెందిన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... బోడుప్పల్ హేమ నగర్‌కు చెందిన గోవింద్ స్వామి కుమార్తె బల్గారి మానస (23) ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ కంప్యూటర్ రెండో సంవత్సరం చదువుతోంది. మంగళవారం ఉదయం ఆమె కాలేజీకి స్కూటీ (నెంబర్ టీఎస్08 హెచ్ఎఫ్ 6216) పై వెళ్తున్న క్రమంలో నాచారం పారిశ్రామిక వాడలోని శ్రీకష్ణ ఫార్మ సమీపంలో వాటర్ ట్యాంకర్ డీసీఎం (నెంబర్ ఏపీ 29 యూ 1572) వెనక నుండి స్కూటీ ని ఢీకొట్టింది. దాంతో మానస అక్కడికక్కడే మతి చెందింది. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ముగిసిన మేడే వారోత్సవాలు

నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో మేడే వారోత్సవాల్లో భాగంగా ముగింపు సభ సూరానా చౌరస్తా వద్ద నిర్వహించారు. ఈ సభకి ముఖ్య అతిథిగా సిన్మయాస్ ఛైర్మెన్ జె .రోశిరెడ్డి , సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే .చంద్రశేఖర్ , చర్లపల్లి ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు హాజరై బహుమతుల ప్రదానం చేశారు. ఈ సమావేశానికి చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రోశి రెడ్డి మాట్లాడుతూ సీఐటీయూ నాయకులు కార్మికులను ఉత్సాహంగా చైతన్య పరచడానికి క్రీడలు నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. కార్మికులు తమ హక్కుల కోసమే కాకుండా సమాజం కోసం పనిచేయాలని సూచించారు. అదేవిధంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులకు పర్మనెంట్ ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మించడానికి కృషి జరుగుతోందని తెలియజేశారు. అదేవిధంగా కార్మికులు డ్యూటీలకు రావడం కోసం రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందిగా ఉన్నది దానిని పరిష్కరించడానికి కోసం కృషి జరుగుతోందని తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి జే. చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికులు ఆర్థికపరమైన అంశాల పైననే పోరాటం చేయకుండా నివాస ప్రాంతాలలో ఎదుర్కొంటున్న సమస్యలపైన కూడా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రాజకీయ పోరాటం కూడా చేయవలసిన అవసరం ఉందన్నారు. బీజేపీ మతోన్మాదం చర్యలపైన కార్మికులు ఐక్య పోరాటాలు చేయవలసిన అవసరం ఉందని తెలియజేశారు. అనంతరం మేడే వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన కార్మికులకు బహుమతులు అందజేశారు. క్రికెట్ విన్నర్స్ విశ్వదీప ఇంజనీరింగ్, రన్నర్స్ గండూరి ఫుడ్స్, వాలీబాల్ విన్నర్స్ గండూరి ఫుడ్స్, రన్నర్స్ ఏపీ రాక్ ఎంప్లాయిస్‌లకు, షటిల్ విన్నర్స్, రన్నర్స్ కు, మ్యూజికల్ చైర్స్ విన్నర్స్ మహిళలకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం. శ్రీనివాసరావు, కొండల్ రెడ్డి, రసూల్, జె.వెంకటేష్, మణికంఠ, బాలరాజ్, ఆదాం ,సంతోష్, సోమాచారి, నరసింహులు, సుభాష్, బాబురావు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత భవితకు భరోసా యువ సంఘర్షణ సభ

- సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-నాచారం

తెలంగాణ నిరుద్యోగ యువత భవితకు భరోసా యువ సంఘర్షణ సభ అని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన యువత సంఘర్షణ సభకు కాప్రా పరిధిలోని డివిజన్ అధ్యక్షులు నెల్లుట్ల శ్రీనివాస్ గౌడ్, పత్తి కుమార్, అంజిరెడ్డి, యాదగిరి, నరేందర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. బాయ్ బాయ్ మోడీ, బాయ్ బాయ్ కేసీఆర్ భారీ బ్యానర్ సభా ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రియాంక గాంధీ సభలో ప్రసంగిస్తున్న సందర్భంగా ప్లకార్డ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విధంగా ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నిరుద్యోగ సంఘర్షణ సభ యువతకు నూతన ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్, కమలాకర్, పొన్నాల రాజు, బుల్లెట్ శ్రీను, శ్రీకాంత్, గౌస్ పాషా, రాములు గౌడ్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సాయి నగర్ కాలనీలోకి బొల్లారంలోని విద్యుత్తు ఆఫీస్..

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



బొల్లారంలోని విద్యుత్తు సెక్షన్ ఆఫీస్ ను శ్రీ సాయి నగర్ కాలనీలోకి మార్చారు. మంగళ వారం మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరై ఆఫీసును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యం కోసం దీనిని మార్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలన్నిటినీ పరిష్కరిస్తా

- పూజ వ్యాస్ బిలాల్

నవతెలంగాణ-బేగంపేట్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటిని పరిష్కరిస్తానని బీఆర్ఎస్ నాయకురాలు పూజా వ్యాస్ బిలాల్ అన్నారు. మంగళ వారం బేగంబజార్, ఫలక్‌నుమా ప్రాంతాల్లో పర్యటించి అక్కడ వారి సమస్యలను అడిగి



తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎక్కువగా రద్దీగా ఉండే బేగంబజార్ ప్రాంతంలో సమస్యలు చాలా నెలకొన్నాయని, వాటిని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు పబ్లిక్ టాయిలెట్ల పాత కావడంతో వాటి స్థానంలో నూతన టాయిలెట్లను ఆధునిక హంగులతో కట్టిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ బేగంబజార్ డివిజన్ అధ్యక్షులు సునీల్ సాహెరా జి, కిషోర్ సింగ్ ప్రదీప్ రాజ్, రాజ్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ, బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణను నియోజకవర్గ పరిధిలోని వివిధ బస్తీలకు చెందిన ప్రజలు మంగళవారం శంభీపూర్ లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ తమ సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. అలాగే మరికొందరు పలు శుభకార్యాలకు హాజరవ్వాలని ఆహ్వాన పత్రికలను అందజేశారు.

నవతెలంగాణ-దుండిగల్



సమస్య పరిష్కారానికి కాలనీలో పర్యటించిన కార్పొరేటర్

నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీలో గత కొన్ని రోజులుగా పైప్ లైన్ నుంచి నీటి ప్రెజర్ తక్కువగా వస్తుందని స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం వాటర్ వర్క్స్ ఏఈ రోహిత్, సిబ్బందితో కలిసి స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా సమస్య గురించి తెలుసుకున్నారు. జంక్షన్ వద్ద వాల్వ్ బిగిస్తే సమస్య చెక్ పెట్టవచ్చని తెలపడంతో వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి వాల్వ్ బిగించడానికి కషి చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో రంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి,తిరుపతి రెడ్డి, సురేందర్ రెడ్డి,మధు సుధన్ రెడ్డి,ఐలయ్య, భూపాల్ రెడ్డి నాయకులు బల్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ తదతరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాలలో హెలెన్ కెల్లర్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

ఇంటర్ ఫలితాల్లో నేరేడ్‌మెట్ హెలెన్ కెల్లర్స్ (ఐపీఎం) కళాశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 94 శాతం బధిర విద్యార్థులు, ప్రథమ సంవత్సరంలో 86 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు ఆ కళాశాల ఫౌండర్, చైర్మెన్ పఠాన్ ఉమ్మర్ ఖాన్ తెలిపారు. ఈ కళాశాలలో ఇంటర్ ఎంఈసీ, సీఈసీ తెలుగు, ఇంగ్లీషు మీడియంలో దివ్యాంగులు మంచి ఫలితాలు సాధించి ఇతరులతో తాము సమానమని చాటి చెప్పటం విశేషం. సెకండ్ ఇయర్‌లో 56కు 53 మంది , ప్రథమ సంవత్సరంలో 99 కి 93 మంది విద్యార్థులు, అందరితో సమానంగా అన్ని సబ్జెక్టులు సైగల ద్వారా చదివి, కండ్లతో చదువు తాము చేతులతో మాట్లడుతాము' అని ఈ బధిర విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. కె.హరిత 800 మార్కులకు గాను 695 మార్కులు సాధించి మొదటి ర్యాంక్ ను,ఎం.సంధ్య 643 మార్కులతో 2వ ర్యాంక్ , ఎం . మణిందర్ 626 మార్కులతో 3వ ర్యాంక్‌లను సాధించారు. ఈ బధిరులు ఒకే భాష రాయగలరని ఈ సందర్భంగా పాస్ అయిన విద్యార్థులకు, కళాశాల ఫౌండర్ చైర్మెన్ శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్

నవతెలంగాణ-మల్కాజిగిరి



ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధి .లోని రామచంద్ర ఎన్ క్లేవ్‌లో రూ. 42 లక్షతో సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొ రేటర్ ప్రేమ్ కుమార్ మంగళ వారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్, నాయకులు బాబు, కిషోర్, రాంచంద్ర, ఎన్‌క్లేవ్ కాలని అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, వైస్ ప్రసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రటరీ సీతా రామా స్వామీ, ట్రెజరర్ రమేష్, జాయింట్ సెక్రటరీ పట్టాభి రామన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నీలు స్వామీ,సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'దళిత బంధు' సాధనకు 29న చలో ఇందిరాపార్క్

- దళిత బంధు కోసం

ఎస్సీ 57 ఉపకులాల లొల్లి

నవతెలంగాణ-సిటీబ్యూరో



స్వాతంత్రం వచ్చిఏండ్లు గడుస్తున్నా నేటి వరకు ఎస్సీ ఉపకులాల బతుకులు మారలేదని ఎస్సీ 57ఉపకులాల రాష్ట్ర అధ్యక్షులు చింతల రాజలింగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలోనే ఓట్లకోసం ఎస్సీ ఉపకులాలను మభ్యపెడుతున్న రాజకీయ నాయకులు గద్దెనెక్కిన తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. దళితులు అభివృద్ధి చెందాలనీ కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని, అయితే ఎస్సీ (బుడగ జంగాలు, మోచి, డెక్కలి తదితర) ఉపకులానికి చెందిన ఒక్కరికి కూడా ఇవ్వలేదన్నారు. 'దళిత బంధు' సాధించేందుకు ఈ నెల 29న ఇందిరాపార్కు వద్ద 'ఎస్సీ 57ఉపకులాల లొల్లి'పేరుతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ 57 ఉపకులాల వారు తరలివచ్చి విజయ వంతం చేయాలన్నారు. ఐక్యంగా పోరా డితేనే అన్ని సాధించగలమని అభిప్రాయపడ్డారు

లో ప్రెషర్‌తో పాటు లీకేజీల సమస్యలను అరికట్టాలి

నవతెలంగాణ - జగద్గిరిగుట్ట



రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గాంధీ నగర్ ప్రాంతంలో రోడ్ నంబర్ 12/1 వీధిలో మంచినీరు లీకేజీతో పాటు ,రోడ్ నంబర్ 14, 15 వీధులలో మంచి నీరు లో ప్రెషర్ తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను అరికట్టాలని స్థానికులు జలమండలి మేనేజర్ పూజిత దృష్టికి తీసుకువెళ్లారు. పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రయినేజ్ పనులు, రోడ్ నంబర్ 12/2,12/3, మసీద్ వీధి,హనుమాన్ దేవాలయం వీధులను మంగళవారం ఆమె పరిశీలించారు. సదరు సమస్యలను ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్లి త్వరలో పనులు ప్రారంభిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు, బీఆర్ఎస్ యూత్ నాయకులు జల్ద లక్ష్మి నాథ్, బస్తీ నాయకులు చింతయ్య భీమయ్య నర్సిరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ది మామ్ కో ప్రచారంలో బ్రాండ్ అంబాసిడర్ సోనమ్ కపూర్

నవతెలంగాణ - హైదరాబాద్

దిమామస్‌కో ఇండియా అగ్రగామిగా ఉన్న టాక్సిన్ - రహిత, సహజ వ్యక్తిగత సంరక్షణ డీ2సీ బ్రాండ్, ప్రతి తల్లి కోసం, ప్రతి మార్పు నుండి ప్రారంభించింది. ఈ కొత్త డిజిటల్ ప్రచారం బ్రాండ్ అంబాసిడర్, సోనమ్ ఏ. కపూర్ ద్వారా తల్లి, పిల్లల సంరక్షణ పరిధి కోసం సజీవంగా తీసు కురాబడుతుంది. ఈసందర్భంగా గుడ్ బ్రాండ్స్‌కో, ది గుడ్ గ్లామ్ గ్రూప్, సీఈఓ, సుక్లీన్ అనెజా మాట్లాడుతూ... ది మామ్స్ కో తల్లి అవసరాలను ఇంకే బ్రాండ్ అర్థం చేసుకో నంతగా చేసుకుంటు ందన్నారు. తమ కొత్త ప్రచారం ద్వారా, ప్రతి తల్లి కోసం ప్రతి మార్పు నుండి తాము తల్లి తన జీవితంలోని ప్రతి దశలో వెళ్లే మార్పులను గుర్తించడాన్ని ఎత్తి చూపించాలని కోరుకుంటున్నామన్నారు. నటి, బ్రాండ్ అంబాసిడర్ సోనమ్ ఏ.కపూర్ మాట్లాడుతూ... కొత్త తల్లిగా తాను అమ్మదనంలోకి ప్రయాణం ఎంత మార్పును కలిగి ఉంటుందో, శారీరకంగా, మానసికంగా రెండింటిలో అనుభవించానన్నారు.

అందువల్లే తాను ది మామ్‌కోలో ప్రతి తల్లి కోసం, ప్రతి మార్పు నుండి ప్రచారం లో భాగమైనందుకు గర్విస్తున్నానన్నారు. ఈ బ్రాండ్ నిజంగా తల్లుల, పిల్లల్లో ఎదుగుతున్న అవసరాలను గుర్తిస్తుందన్నారు. వారికి డెర్మిటాలజికల్గా సురక్షితమైన, 100శాతం సహజమైన, వారి ప్రతి దారిలో మద్దతునిచ్చే ప్రభావితమైన ఉత్పత్తులను అందిస్తుందన్నారు.

ఫాస్ట్ ఎక్స్ చూడడానికి 5 కారణాలు

నవతెలంగాణ - హైదరాబాద్

యూనివర్సల్ పిక్చర్స్ ది లెగసీ ఆఫ్ ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్ ఫాస్ట్ ఎక్స్‌తో ముగుస్తుంది. రోడ్డు ముగింపు చాలా యాక్షన్, కార్లు, పేలుళ్లు, కుటుంబ భావోద్వేగాలతో ప్రారంభ మవుతుంది. ఇది ఉత్కంఠభరితమైన ప్రయాణం, ఇక్కడ ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్ సాగాలోని అన్ని దిగ్గజ పాత్రలు చివరి రేసు కోసం చివరిసారిగా కలిసి రావడం మనం చూస్తాము. జస్టిన్ లిన్, డాన్ మజియో రచనను లూయిస్ లెటెరియర్ దర్శకత్వంలో ఫాస్ట్ ఎక్స్‌గా తెరకెక్కిం చిన ఈ చిత్రం ఈనెల 19న విడుదల కానుంది.

కార్ రేసింగ్‌లో డోమ్ టొరెట్టో (విన్ డీజిల్) చెడ్డవారి సైన్యంతో మనుగడ, ఆధిపత్యం కోసం చేసిన పోరాటంలో గుండె కొట్టుకునే యాక్షన్ సన్నివేశాలను మనం ఎప్పటికీ మర్చిపోలేము. ప్రాణాంతకమైన వీధి యుద్ధంలో విలన్‌లను అధిగమించడా నికి డోమ్ టొరెట్టో, అతని బృందం వారి మృగ వాహనాలను ఉపయోగిస్తున్నప్పుడు అడ్రినలిన్ రద్దీ, ఉల్లాసాన్ని విస్మరించలేము. ఫాస్ట్ ఎక్స్, థియేటర్‌లకు వెళ్లడానికి ముందు, మీరు ఈ సినిమాని చూడటానికి గ్రిప్పింగ్ స్టోరీలైన్, యాక్షన్ ఫిల్డ్ రైడ్, స్టార్-స్టడెడ్, అడ్రినలిన్ కార్ అడ్వెంచర్, విలన్‌గా జాసన్ మోమోవా అనే ఐదు కారణాలు ఉన్నాయి.

మ్యాంగో ఫీస్టాని ప్రకటించిన అమేజాన్ ఫ్రెష్

నవతెలంగాణ - హైదరాబాద్

వేసవి కాలం పండ్లలోనే రారాజైన మామిడి పండ్లకు మారుపేరుగా నిలుస్తుంది. అమేజాన్ ఫ్రెష్ వారి మ్యాంగో ఫీస్టా కొనసాగుతున్న సమయంలో ఈ రుచికరమైన పండు కంటే ఆనందించడానికి మెరుగైన విధానం ఏముంది. ఫీస్టా వివిధ ప్రాంతాలు నుండి ఉన్నతమైన నాణ్యత గల తాజా, వివిధ రకాల మామిడి పండ్లను ఒక చోటు చేర్చింది. ప్రతి ఒక్కటి తమదైన రుచి, పరిమళం, గొప్ప డీల్స్ను కలిగి ఉన్నాయి. మీరు తియ్యని, రసంతో నిండిన రత్నగిరి ఆల్ఫాన్సో అభిమాని కావచ్చు, వగరు, రుచికరమైన బంగినపల్లిని ఇష్టపడవచ్చు లేదా విలక్షణమైన, పీచులేని తోతాపురి, రసంతో నిండిన బాదామి మామిడి పండును, విటమిన్స్ సమృద్ధిగా గల సఫేదా. బంగినపల్లి మామిడి, తియ్యని సింధూరా (లాల్ బాగ్) మామిడి పండును ఇష్టపడవచ్చు. అమేజాన్ ఫ్రెష్ పై మ్యాంగో ఫీస్టా అన్నింటిని అందిస్తోంది.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అబిడ్స్‌లోని మహవీర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు గడ్డం ఆశిష్ కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేద ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం అభినందనీయం అన్నారు. అనంతరం ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్ కుమార్, నిర్వాహకులు జేసీ జయంతి శెట్టి, చతుర్వే, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల బస్తీలో 'కంటి వెలుగు' ప్రారంభం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని గంగపుత్ర సంఘం తుమ్మల బస్తీలో ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ సంధ్య, కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్, పి.హెచ్.ఎన్ శకుంతల, ఆప్టోమెట్రిస్ట్ నరేష్, డీఈఓ శ్రీలత, గంగపుత్ర సంఘం అధ్యక్షులు బాబురావు, కార్యవర్గ సభ్యులు, బస్తీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట

- కార్పొరేట్‌కు దీటుగా తార్నాక ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు
- ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్
- 4 ఆపరేషన్ థియేటర్లు ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

టీఎస్ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తామని ఆ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా తార్నాక ఆస్పత్రిని అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించామన్నారు. ఆస్పత్రిలో కొత్తగా నిర్మించిన 4 సూపర్ స్పెషాలిటీ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో పాటు 15 బెడ్ల మెడికల్, 10 బెడ్ల సర్జికల్ ఐసీయూలను సజ్జనార్ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే ఏ సంస్థ అయినా బాగుంటుందనీ, అప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సిబ్బంది ఆరోగ్య సంక్షేమంపై సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఉద్యోగుల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధతో హెల్త్ వాలంటీర్ల వ్యవస్థను సంస్థ రూపొందించినట్టు తెలిపారు. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా తార్నాకలోని టీఎస్ఆర్టీసీ ఆస్పత్రిని రూపుదిద్దామన్నారు. అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో కూడిన 4 సూపర్ స్పెషాలిటీ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించామని వివరించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో మద్దతుతో 25 ఐసీయూ బెడ్లు, వాటికి అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనుభవం, నైపుణ్యం ఉన్న డాక్టర్లు ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నారన్నారు. గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌లో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని 50 వేల మంది సిబ్బందికి రోగ నిర్ధారణ పరీక్షలు చేసి 'హెల్త్ ప్రొఫైల్' రూపొందించినట్టు తెలిపారు. వారి ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు హెల్త్ వలంటీర్ల సేవలను వినియోగించుకోనున్నామని తెలిపారు. అనారోగ్యం నుంచి కోలుకున్న ఉద్యోగులు, హెల్త్ ప్రొఫైల్‌లో రిస్క్ కేటగిరిల వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు డిస్పెన్సరీ డాక్టర్ల దృష్టికి వాలంటీర్లు తీసుకెళ్తారన్నారు.

కొత్తగా వలంటీర్ల సేవలు

తార్నాక ఆస్పత్రిలో మంగళవారం హెల్త్ వలంటీర్ల వ్యవస్థను సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ ప్రారంభించారు. కొత్తగా నియమితులైన హెల్త్ వలంటీర్లతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం గ్లూకో, బీపీ మీటర్, డిజిటల్ థర్మామీటర్, తమ విధి విధానాలకు సంబంధించిన హ్యాండ్ బుక్‌తో కూడిన కిట్‌లను హెల్త్ వలంటీర్లకు అందజేశారు. ఉద్యోగుల ఆరోగ్యంపై వలంటీర్లు ప్రధానంగా దృష్టి సారించాలని డాక్టర్లు సూచించిన విషయాలపై అశ్రద్ధగా ఉండకూడదని ఉద్యోగులకు చెప్పాలన్నారు. సంస్థను అభ్యున్నతి దిశగా తీసుకెళ్లడానికి అందరి సహకారంతో కృషి చేస్తున్నట్టు టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. సంస్థ క్లిష్ట పరిస్థితుల నుంచి గట్టెక్కి పురోగమనం వైపు పయనిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకోవడం గర్వంగా ఉందన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యే దిశలో అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టీఎస్ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్ (విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ) డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్, ఎస్.కృష్ణకాంత్, సీసీవోఎస్ విజయభాస్కర్, సీసీఈ రాంప్రసాద్, తార్నాక ఆస్పత్రి ఓఎస్డీ సైదిరెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజా మూర్తి, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం చేయండి.. పునర్జన్మ ప్రసాదించండి..



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అవయవ దానంపై అవగాహనను కల్పించేందుకు జీవన్‌ధాన్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో కలిసి 'రైజ్ ఎగైన్' పేరుతో అపోలో హాస్పిటల్ ప్రచారం ప్రారంభించింది. ప్రాణాంతకమైన అనారోగ్యంతో బాధపడుతున్న అనేకమంది రోగులకు తాజా జీవితాన్ని అందించడం కోసం, అవయవాలను దానం చేయాల్సిన అవసరం గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ జీవన్‌ధాన్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో కలిసి 'రైజ్ ఎగైన్' పేరుతో అపోలో హాస్పిటల్స్ ఒక విస్తృత అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సభ్యులు ముత్తయ్య మురళీధరన్, డేల్ స్టెయిన్, ఉమ్రాన్ మాలిక్, హెన్రిచ్ క్లాసెన్, జట్టుకు చెందిన ఇతర సభ్యులతో పాటు అపోలో హాస్పిటల్స్, జూబ్లీహిల్స్, సీఈఓ, వి.తేజేస్వీ రావు, అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్-మెడికల్ సర్వీసెస్, డాక్టర్ రవీందర్ బాబు, తెలంగాణ జీవన్‌ధాన్ సీఈఓ డాక్టర్ స్వర్ణలత, అపోలో హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ వాస్కులర్ సర్జన్, డాక్టర్ పి.వి.నరేష్ కుమార్, అపోలో హాస్పిటల్స్, సీనియర్ కన్సల్టెంట్ రెనాల్ ట్రాన్స్‌ప్లాంట్, డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, అపోలో హాస్పిటల్స్, కన్సల్టెంట్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్, డాక్టర్ ఆనంద్ రామమూర్తి, అపోలో హాస్పిటల్స్, కన్సల్టెంట్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్, హెపాటో-ప్యాంక్రియాటికో-బిలియరీ (హెచ్‌పిబి) సర్జరీ, డాక్టర్ ఎల్.శశిధర్ రెడ్డి, అవయవ గ్రహీతలు, వలంటీర్లు, వైద్యులు మంగళవారం జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్స్‌లో అవయవాలను దానం చేస్తామనీ, ఇతరులు కూడా ముందుకు వచ్చి వారి అవయవాలను దానం చేసేలా ప్రోత్సహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అవయవాలు దానం చేయగా పునర్జన్మ పొందిన రోగులను అందరికీ పరిచయం చేసి, స్టేజ్పై వారిని సన్మానించారు. వారికి అవయవాలు దానం చేసిన వారి మేలు ఎప్పటికీ మర్చిపోమనీ, వారు చనిపోయి మాకు పునర్జన్మ ప్రసాదించారనీ, వారికి వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ కార్యక్రమానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సభ్యులు గొప్ప స్ఫూర్తిని తీసుకువచ్చారు. బ్రెయిన్ డెడ్ అయిన ప్రతి వ్యక్తి కాలేయం, మూత్రపిండాలు, ప్యాంక్రియాస్, పేగులు, గుండె, ఊపిరితిత్తుల తో కూడిన వారి అవయవాలను దానం చేయడం ద్వారా అతడు ఏడు ప్రాణాలను రక్షించగలడు. కార్నియా, గుండె కవాటాలు, చర్మం, ఎముకలు, వాస్కులైజ్డ్ కాంపోజిట్ టిష్యులు వంటి వాటిని అవసరమైన రోగులకు సహాయం చేయవచ్చు' అని డాక్టర్ రవీందర్‌బాబు చెప్పారు. డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ అవయవ దానం రేటులో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న దన్నారు. అవయవాల కొరత కారణంగా 0.8 మిలియన్ల మంది మరణిస్తున్నారని తెలిపారు. మన రాష్ట్ర అవయవ దానం రేటు మిలియన్ జనాభాకు 5.5గా ఉన్నదనీ, అవ యవ దానం కేవలం ధనికుల కోసం మాత్రమే అనే అపో హతో కాకుండా పేదలు కూడా ఆరోగ్యశ్రీ కవరేజ్ ద్వారా అవయవ మార్పిడిని పొందగలరని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వాస్పత్రుల్లో అవయవ మార్పిడి కార్యక్రమం ద్వారా దాదాపు 500 మంది రోగులు లబ్ది పొందుతున్నారు. ఈ ప్రభుత్వ కార్యక్రమాన్ని దశాబ్దం క్రితం ప్రారంభించాం. అపోలో హాస్పిటల్స్ వివిధ కమిటీల్లో భాగంగా ఉన్నది. వారు మొత్తం అవయవ దానం కార్యక్రమాన్ని క్రమబద్ధీకరించడానికి, వివిధ మార్గదర్శకాలను అధికారికంగా రూపొందించడంలో సహాయపడ్డారని తెలిపారు. అవ యవదానం చేయడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్స్ సీఈవో తేజేస్వీ రావు మాట్లాడుతూ అవయవదానం అనేది దాన్ని స్వీకరించే రోగికే కాకుండా అతని కుటుంబానికి కూడా జీవన బహుమతి అన్నారు. నేడు మార్పిడి కోసం అందుబాటులో ఉన్న అవయవాల సంఖ్య, వాటి అవసరమున్న వ్యక్తుల సంఖ్య మధ్య భారీ వ్యత్యాసం ఉన్నదన్నారు. అవయవాల కొరత కారణంగా మరణాల సంఖ్యను అరికట్టడానికి వీలైనంత త్వరగా ఈ అంతరాన్ని పూడ్చేందుకు మార్గాలను రూపొందించాలన్నారు. అవయవాలను దానం చేయడం, అవయవ అవసరం వున్న రోగులకు సహాయం అందించాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అపోలో హాస్పిటల్స్ చేపట్టిన ఈ ప్రచారంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సభ్యులు ముందుకొచ్చి పాల్గొంటున్నందుకు వారిని అభినందిస్తున్నట్టు తెలిపారు.

20 గంటల హైరిస్కు సర్జరీ విజయవంతం



నవతెలంగాణ-బంజారాహిల్స్

తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న రోగిని రక్షించడానికి 20-గంటల బైపాస్ సర్జరీని కేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రతీక్ భట్నాగర్ బృందం విజయవంతంగా నిర్వహించింది. నగరానికి చెందిన 61 ఏండ్ల కృష్ణ తీవ్రమైన గుండె జబ్బు, ట్రిపుల్ వెస్సెల్ కరోనరీ ఆర్టరీ వ్యాధి మధుమేహంతో బాధపడుతున్నారు. అతని గుండె పని తీరును పునరుద్ధరించడానికి గుండెలోని ప్రతి ప్రాంతాన్నీ తిరిగి రక్తనాళాలుగా మార్చేలా చేయడానికి క్లిష్టమైన గుండె శస్త్రచికిత్స అవసరమైందని గుర్తించారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న గుండె ద్వారా సవాళ్లు ఎదురైనప్పటికీ, అతన్ని వైద్య బృందం పట్టుదలతో విజయం సాధించే వరకు ఆశను కోల్పోకుండా 20 గంటలు శస్త్రచికిత్స పాటు 10 బైపాస్ గ్రాఫ్ట్‌ల ఏర్పాటుతో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్డియోక్ సర్జన్ డాక్టర్ ప్రతీక్ భట్నాగర్ మాట్లాడుతూ ఇలాంటి శస్త్ర చికిత్సలు చాలా అరుదు, హై రిస్క్‌తో కూడినట్టు తెలిపారు. విజయవంతం చేయడం చాలా క్లిష్టమన్నారు. ఈ శస్త్రచికిత్స జరిగిన మూడు నెలల తర్వాత కృష్ణ గుండె 60శాతం ఎడమ జఠరిక ఎజెక్షన్ భిన్నంతో సాధారణంగా పంపింగ్ చేయబడుతోందనీ, అతను ప్రతిరోజూ 4 కిమీల పొడవైన మార్నింగ్ వాక్ చేయకలుగుతున్నాడని తెలిపారు. బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్‌లో అత్యంత నైపుణ్యం గల వైద్యుల బృందం సంక్లిష్టమైన, హై-రిస్క్ హార్ట్ బైపాస్ సర్జరీని నిర్వయించే వైద్య బృందం ఉండంతో తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగిని విజయవంతంగా రక్షించడం సాధ్యపడిందని ఆయన తెలిపారు.



డ్రయినేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తాం

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-అడిక్‌మెట్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని బస్తీలో కలుషిత మంచినీరు, డ్రయినేజీ సమస్యను వీలైనంత తొందరలో పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని జ్యోతి నగర్‌లో బస్తీల్లో కలుషిత మంచినీరు, డ్రయినేజీ సమస్యలపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీలైనంత తొందరలో సమస్యలను పరిష్కరిస్తామని బస్తీ వాసులకు హామీనిచ్చారు. డ్రయినేజీ, మంచి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రత్యేక ప్రణాళికతో పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ వల్లాల శ్యామ్ యాదవ్, కార్యదర్శి సాయి కృష్ణ, స్వామి, శంకర్, రాజు, రాజేష్, లక్ష్మీ గణపతి దేవస్థానం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, నరసింహారావు, కరిక కిరణ్, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పటేల్‌నగర్ చిలుకమ్మ గల్లీలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధిని ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న పనుల శాశ్వత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అంబర్ పేట డివిజన్ లో అవసరమైన ప్రతి చోట నూతన సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామనీ, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రోడ్డు పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ పటేల్ నగర్ చిలుకలమ్మ గల్లీలో ఇటీవల నూతన డ్రైనేజీ పనులను పూర్తి చేశామనీ, నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని తెలిపారు. అంబర్‌పేట డివిజన్‌లోని ప్రతి బస్తీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయనీ, ఎలాంటి సమస్యల్లేకుండా ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ మజీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, రమేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకులు రామారావు యాదవ్, యాసీన్, రంగు సతీష్ గౌడ్, రాగుల ప్రవీణ్ పటేల్, మహేష్ ముదిరాజ్, రఘు, రంగు ఉదయ్ కిరణ్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

వయస్సు పైబడిన వారికి శస్త్ర చికిత్స అంత సులువు కాదు



నవతెలంగాణ-బంజారాహిల్స్

వయస్సు పైబడిన వారికి శస్త్ర చికిత్స అంత సులువు కాదు అని మా ఈఎన్టీ హాస్పిటల్ బృందం తెలిపింది. అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన మా ఈఎన్టి హాస్పిటల్ బృందం మంగళవారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్థోవన్ ఎండీ, ప్రముఖ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ డాక్టర్ వి.కోటేశ్వర ప్రసాద్ వివరాలను వెల్లడించారు. వయసు పైబడిన వారికి శస్త్ర చికిత్సలు అందులో కష్టమైన శస్త్ర చికిత్సలు నిర్వహించడం అంత సులువైన పని కాదన్నారు. 65 ఏండ్ల వయసు పైబడిన వ్యక్తికి నగరంలోని జూబ్లీహిల్స్ మా ఈఎన్టీ హాస్పిటల్‌లో సాంకేతిక పరిజ్ఞానం నిష్ణాతులైన వైద్యుల బృందంతో కలిసి మోకాలి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించడంతోపాటు కేవలం రెండు రోజుల్లోనే రోగిని డిశ్చార్జ్ చేశామన్నారు. ఇదివరకులా మామూలుగానే రోగి నడవగలుగుతున్నడని తెలిపారు. ప్రమాదవశాత్తు కింద పడిపోయిన రోగిని జీవితంలో ఇక మీరు నడవలేరు, ఈ కట్టు కట్టుకుని ఇలా ఉండటం తప్ప వేరే మార్గం లేదని చెప్పిన మాటలు విని ఆయన బెంగపడుతూ అనేక హాస్పిటల్స్ తిరిగి చివరకు తమను సంప్రదించారని తెలిపారు. రోగి కొన్నేండ్లుగా తిరుగుతున్నా అన్ని రకాల వైద్య పరీక్షలను పరిశీలించి గతంలో ఆయనకు చేసిన చికిత్స వల్ల విరిగిన ఆ కాలు మూడీంచులు పొట్టిగా మారిందని ఆశ్చర్యపోయారు. ఎండో స్కోపిక్ స్పైన్, కీ హెూల్ సర్జరీ, రీ జనరేటివ్ ఆర్థోపెడిక్, మినిమల్లీ ఇన్వెసివ్ టోటల్‌ని రీప్లేస్‌మెంట్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు. నొప్పులను నివారిస్తామనీ, మెరుగైన వైద్యం అందిస్తామనీ, ఈ రోజుల్లో చాలా మోసపూరిత ప్రకటనల పట్ల జనం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హాస్పిటల్ సీఎండీ సునీత కుమార్ మాట్లాడుతూ ఏదైనా సమస్య వస్తే సంబంధిత స్పెషలిస్ట్ డాక్టర్లను సంప్రదిస్తేనే సరైన ఫలితం దక్కుతుందలిపారు. పేద రైతును దృష్టిలో పెట్టుకుని తక్కువ ఖర్చుకే ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. తమ హాస్పిటల్‌లో ఆర్థో సంబంధిత అన్ని సమస్యలకు చికిత్స అందుబాటులో ఉందని చెప్పారు.



జాతీయ స్థాయిలో ప్రజా ఏక్త పార్టీ విస్తరణ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రజా ఏక్తా పార్టీని వివిధ రాష్ట్రాల్లో విస్తరించేందుకు కమిటీలను వేస్తున్నామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బీహార్ రాష్ట్రం కైమూర్ జిల్లాకు ప్రజా ఏక్తా పార్టీ కో-ఆర్డినేటర్‌గా రాజేష్ కుమార్‌ను నియమిస్తూ నియామక పత్రం అందజేసి మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో తమ పార్టీని విస్తరించి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి రాష్ట్రంలో తమ పార్టీని విస్తరించి రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లో ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కో-ఆర్డినేటర్ ధర్మేంద్ర తివారీ, నాయకులు సాంబ రవీంద్రనాథ్, పోలారం మాలి, ప్రశాంత్ గౌడ్, విష్ణు శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు కనీస గౌరవ వేతనం ప్రకటించండి

- తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్యవేదిక



నవతెలంగాణ-బంజారాహిల్స్

రేషన్ డీలర్లకు కనీస గౌరవ వేతనం ప్రకటించాలనీ, లేదంటే జూన్ 5వ తేదీ నుంచి డీలర్ల నిరవధిక సమ్మె చేస్తామని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్యవేదిక స్పష్టం చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ నాయకోటి రాజు, వైస్ చైర్మన్ బత్తుల రమేష్ బాబు మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటులో తమ వంతు పాత్ర పోషించామన్నారు. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేండ్లు గడిచిన వేతనాలు పెంచలేదన్నారు. తొమ్మిది నెలలుగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 70 పైసల కమిషన్‌తోనే సరిపెట్టుకుంటున్నామనీ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే కమిషన్ అందడం లేదన్నారు. రేషన్ డీలర్లకు కనీస గౌరవేతనం ప్రకటిస్తానని చెప్పిన ముఖ్యమంత్రికి నగరంలో నివసించే వారికి రూ.40 వేలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 5వ తేదీ వరకు ప్రభుత్వం తమను చర్చలకు పిలవాలనీ, లేనిపక్షంలో వివిధ జిల్లాల వారితో చర్చలు జరిపి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ దొమ్మాటి రవీందర్, కో-కన్వీనర్ గడ్డం మల్లికార్జున్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లాల శ్రీధర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కూర ప్రకష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పట్ల నిర్లక్ష్యం ఎందుకు..?



నవతెలంగాణ-బంజారాహిల్స్

పేద కార్మికుల పట్ల నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని నిమ్స్ (సీఐటీయూ) మాజీ ప్రధాన కార్యదర్శి జి.నరసింహ, ప్రజానాట్యమండలి గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు బల్గారి పవన్ ఆధ్వర్యంలో నిమ్స్ ఆస్పత్రి ఆవరణలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో కార్మికశాఖ జాయింట్ కమిషనర్, రిజిస్ట్రార్ అధికారి పరంజ్యోతి ఆధ్వర్యంలో పెరిగిన వీడీఏ, పాయింట్లను అలాగే ఈవీడీఏను అమలు చేస్తామని హామీనిచ్చి నాలుగేండ్లు గడుస్తున్నా ఎందుకు అమలు చేయడం లేదో నిమ్స్ డైరెక్టర్, యజమాన్యం చెప్పాలన్నారు. వీటి ఆధారంగా తమకు రావాల్సిన నెలసరి వేతనం రూ.2,100, ఎక్స్‌గ్రేషియా, సీనియారిటీ ప్రకారం రెగ్యులైజేషన్, వైద్య సదుపాయం, చనిపోయిన కార్మికుడికి రావాల్సిన తదితర విషయాల పట్ల చర్చ గోష్టి జరిగి వాటికి సమ్మతం తెలిపిన యజమాన్యం అమలు చేయడంలో ఉన్న సమస్యలు ఏమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నింటికీ నిమ్స్ యాజమాన్యం, డైరెక్టర్ సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తమకు న్యాయమైన డిమాండ్లను వారు ఒప్పుకున్న వాటిని అడిగితే స్పందించని యజమాన్యంపై ప్రభుత్వం చొరవ తీసుకుని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే దిశగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రిలే దీక్షలు కూర్చున్న ఎం.కృష్ణ, ఎం,రమేష్, రతన్ చంద్రమౌళి, స్వరూప, పద్మ, రత్నకు నిమ్స్ (సీఐటీయూ) అధ్యక్షుడు ఎం.వెంకటేష్ ప్రధాన కార్యదర్శి ఈ,నరసింహు మద్దతు తెలిపారు.



పురానీహవేలీలోని పాత కొత్వాల్ భవనాన్ని తీర్చిదిద్దేందుకు పునరుద్ధరణ పనులను నగర సీపీ సీవీ ఆనంద్ మంగళవారం ప్రారంభించారు. ఈ భవనం 176 ఏండ్లది. హెరిటేజ్ భవనాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు సీపీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్, డీసీపీ సాయి చైతన్య, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో



పార్లమెంటుల్లో బీసీ బిల్లు పెట్టాలనీ, ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారామ్‌ని కలిసివినతి పత్రం అందజేసిన రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ. ఈ కార్యక్రమంలో నాయకులు నీలం వెంకటేశ్, మల్లేష్ యాదవ్, నందగోపాల్, రాజేందర్, అనంతయ్య, అంజి, సుధాకర్, జోషి, రాఘవ, కమలాకర్, హరీష్, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

సంక్షేమ ఫలాలు ఇంటింటికీ చేరాలి : డిప్యూటీ స్పీకర్



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అన్ని సంక్షేమ కార్యక్రమాల ఫలాలు పేదలకు చేరేలా కృషి చేయాలని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ బీఆర్ఎస్ శ్రేణులు, అధికారులను కోరారు. తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం లాలాపేట ప్రొఫెసర్ జయ శంకర్ స్టేడియంలో అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ పేదలకు పెండ్లిళ్ల చేయడం కష్టతరంగా మారిన ఈ రోజుల్లో కల్యాణలక్ష్మి ఉపకరిస్తుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదల వైద్యానికి అండగా నిలుస్తున్నామని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల్లో ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదనీ, ఎవరైనా డబ్బులు అడిగితే సీతాఫల్‌మండిలోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని పద్మారావు గౌడ్ తెలిపారు. లాలాపేటలో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను అయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యతను పాటించాలని అధికారులను కోరారు.

రాష్ట్ర సాధన ఉద్యమంలో నాయిని పాత్ర కీలకం



నవతెలంగాణ-అడిక్‌మెట్

ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో నాయిని నర్సింహారెడ్డి కీలక పాత్ర పోషించారని గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బోగారపు దయానంద్ అన్నారు. రాష్ట్రం ఏర్పాటు కాగానే తొలి హెూంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి పోలీసు శాఖలో గొప్ప సంస్కరణలు తీసుకువచ్చారని కొనియాడారు. నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న నాయిని నర్సింహారెడ్డి మెమోరియల్ పోటీలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, టీఎస్టీటీఎస్ చైర్మన్ జగన్ మోహన్ హాజరై టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమంలో నాయిని పాల్గొన్న నేపథ్యంలో కేసీఆర్ సహితం ఆయనను నర్సన్న అని ప్రేమగా పిలిచేవారని గుర్తు చేశారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూస్తూ వారి సంక్షేమం కోసం. పాటుపడుతుందన్నారు. నాయిని నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం శుభపరిణామం అన్నా రు. రాబోయే రోజుల్లో మరింత ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామేశ్వర్ గౌడ్, కల్వ గోపి, నేత శ్రీను, సిరిగిరీ శ్యామ్, కిరణ్, పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి

- మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్



నవతెలంగాణ-ధూల్‌పేట్

హైదరాబాద్ పోలీసు వారికి రాబోయే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పూర్తయ్యేలా చూడాలని మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ సూచించారు. మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికారా సంస్థ చైర్మన్ - సెషన్స్ జడ్జి ఎస్.ప్రేమవతి ఆదేశాల మేరకు మంగళవారం హైదరాబాద్ పోలీస్‌శాఖ వారితో ఈ నెల 10వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజలు, పార్టీలకు మరింతగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. మెట్రోపాలిటన్ న్యాయ సేవాదికార సంస్థ, హైదరాబాద్ వారు అడిగిన వెంటనే ఈ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినందుకు అదనపు కమిషనర్ ఆఫ్ పోలీస్, క్రైమ్స్, సిట్, ఏ.ఆర్.శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ 10
కుత్బుల్లాపూర్
బుధవారం 10 మే 2023

డీవీజీ ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో నివసించే కృష్ణమ్మ (72) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ స్థానిక నాయకులకు సూచించి బాధిత కుటుంబ సభ్యులకు డివిజి ట్రస్ట్ ద్వారా 6 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించి పరామర్శించారు. కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, ప్రీతి, బాబ్జి తదితరులు ఉన్నారు.

కార్మికులకు న్యాయం చేయడమే లక్ష్యం



- బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర కార్మిక నాయకుడు రవి సింగ్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

జీడిమెట్ల, షాపూర్ నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో పాండు అనే కార్మికుడు షెడ్డు నిర్మాణం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు షెడ్ పై నుంచి గాయపడ్డాడు. అయితే బాధితుడిని షెడ్ యజమాన్యం పట్టించుకోనట్టు బాధిత కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత రవి సింగ్ వెంటనే షెడ్ వద్దకు వెళ్లి యజమాన్యంతో చర్చించారు. కార్మికుడికి నష్టపరిహారంగా రూ.1 లక్ష, అలాగే ట్రీట్మెంట్ ఖర్చులకు రూ.50,000 రూపాయలు ఇప్పించారు. న్యాయం చేసిన రవి సింగ్‌కు కార్మికుల కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస చారి ,సంతోష్ గౌడ్, మనోజ్ కుమార్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

- 9,15వ స్థానంలో నిలిచిన హైదరాబాద్ జిల్లా
- ఫస్టియర్ 59.35శాతం, సెకండ్ ఇయర్‌లో 60.26శాతం ఉత్తీర్ణత
- ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మేడ్చల్ జిల్లా అగ్రస్థానం
- ద్వితీయ సంవత్సరంలో మూడో స్థానంలో నిలిచిన వైనం
- ఫస్టియర్, సెకండ ఇయర్‌లో 75శాతం ఉత్తీర్ణత



ఫైల్ ఫోటో

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో గ్రేటర్ హైదరాబాద్ సత్తా చాటింది. మళ్లీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, హైదరాబాద్ జిల్లా 9వ స్థానానికి పరిమితమైంది. ఇంటర్ ఫస్టియర్ రెగ్యులర్‌లో మేడ్చల్ జిల్లా 75శాతం, హైదరాబాద్ 59.35శాతం ఉత్తీర్ణత సాధించగా.. సెకండ్ ఇయర్‌లో మేడ్చల్ జిల్లా 75శాతం, హైదరాబాద్ జిల్లా 60.26శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను నాంపల్లి ఇంటర్‌బోర్డు కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులతో కలిసి విడుదల చేశారు.

అమ్మాయిలే టాప్

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఫలితాల్లో ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా అమ్మాయిల హవా కొనసాగింది. ఫస్ట్ ఇయర్ ఫలితాలు పరిశీలిస్తే.. హైదరాబాద్ జిల్లా పరిధిలో బాలికలు 66.7శాతం, బాలురు 52.34శాతం ఉత్తీర్ణులయ్యారు. మేడ్చల్-మల్కాజిగిరిలో బాలికలు 79శాతం, బాలురు 72శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్ ఫలితాలు పరిశీలిస్తే.. హైదరాబాద్ జిల్లాలో బాలికలు 68.73శాతం, బాలురు 51.53శాతం ఉత్తీర్ణత సాధించగా, మేడ్చల్-మల్కాజిగిరిలో బాలికలు 79శాతం, బాలురు 72శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇదిలావుంటే ప్రభుత్వ కళాశాలలో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గత సంవత్సరంతో పోలిస్తే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించారు. మారేడుపల్లిలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ విద్యార్థిని 979 మార్కులు సాధించగా.. ఇతర కళాశాలలకు చెందిన బి.అనూషా 981 మార్కులు, జి. శ్రీహిత 979 మార్కులతో తమ సత్తా చాటారు. కాగా నేటి నుంచి 16వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, రికౌంటింగ్, రివేరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.ఒడ్డెన్న మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రేటర్ పరిధిలో ఇంటర్మీడియట్ రెగ్యులర్ విద్యార్థుల ఫలితాలు ఇలా..

జిల్లా	ఫస్ట్ ఇయర్		సెకండ్ ఇయర్	
	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణత	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణత
హైదరాబాద్	77432	45958	72343	43594
మేడ్చల్	62553	47474	50821	38446

వృత్తి విద్య విభాగంలో ..

ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో మేడ్చల్ 48శాతం, హైదరాబాద్ 54.82శాతం ఉత్తీర్ణత సాధించాయి. సెకండ్ ఇయర్‌లో మేడ్చల్ జిల్లా 69శాతం, హైదరాబాద్ జిల్లా 67.40శాతం ఉత్తీర్ణత సాధించాయి.

నిషేధిత మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ-మేడ్చల్

ధనార్జనే ధ్యేయంగా యువతనే టార్గెట్‌గా చేసుకుని నిషేధిత మాదక ద్రవ్యాలు అమ్ముతూ జల్సాలు చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం మేడ్చల్ ఏసీపీ శ్యామల వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ నివాసం ఉంటూ డ్రగ్స్ సరఫరా చేస్తున్న నిందితుడు పోతిరెడ్డి మెహర్ బాబా నుంచి నిషేదిత ఏండీఎంఏ మాదక ద్రవ్యం 41 గ్రాములు,ఒక స్కూటీ,రెండు మొబైల్ ఫోన్లను మేడ్చల్ ఏస్ఓటి పోలీసులు మెరుపు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. నిందితుని అదుపులోకి తీసుకొని విచారిం చగా అతను రెండు సంవత్సరాల క్రితం గోవా టూర్‌కు వెళ్లగా అక్కడ ఢిల్లీకి చెందిన మరొక నిందితుడు జిన్ని పరిచయం కావడంతో ఇరువురు కలిసి యువతను టార్గెట్ చేసుకొని వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. మరోక నిందితుడు జిన్ని పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. పట్టుబడిన నిషేధిత డ్రగ్స్ విలువ 3 లక్షల 80వేల రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఓటి సీఐ జేమ్స్ బాబు,ఎస్సైలు సత్య నారాయణ,చంద్ర శేఖర్,సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామని అదనపు సీపీ, ట్రాఫిక్ బాస్ జీ.సుధీర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల దశనుంచే పిల్లలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహ నతోపాటు పిల్లలకు, పోలీసుల మధ్య మరింత సాన్నిహి తాన్ని పెంచే విధంగా క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్, 'హొండా మోటర్స్ సైకిల్ స్కూటర్స్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్' సంయుక్తంగా ఫ్రీ సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఈ నెల 15 నుంచి 20 వరకు ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. డ్యాన్సింగ్, మ్యూజిక్, పేయింటింగ్ అండ్ కార్టూన్, హ్యాండ్ రైటింగ్, ట్రాఫిక్ నిబంధనలపై అవేర్‌నెస్, సెల్ఫ్‌డిఫెన్స్ తదితర రంగాలల్లో ఉచితంగా ట్రెనింగ్ అందిస్తామన్నారు. ఆరో తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్‌నెంబర్ 8712660655, 040-27854754లోగానీ లేదా ఇన్‌స్పెక్టర్ హరీష్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ఫలితాల్లో భాగ్యరథి కళాశాల ప్రభంజనం



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాలలో చింతల్ లోని భాగ్యరథి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్ ఎంపీసీ గ్రూపులో వీ భావన (987/100), బైపీసీ గ్రూపులో వీ మాధవి (974/1000), ఎం.ఈ.సి రాకేష్ కుమార్ (980/1000) , సి.ఇ.సి లో జే ఐశ్వర్య (971/1000) మార్కులతో రాణించారు. అలాగే జూనియర్ ఎం.పీ.సీ.లో ఏం.నందిని (459/470) , బై.పీ.సీ.లో ఎండీ రషీద్ (432/440) , ఎం.ఈ.సి లో ఎస్. సౌమ్య (463/500), సి.ఈ.సి గ్రూపులో సిహెచ్ సాయి చందన (484/500) మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల యజమాన్యం విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తదుపరి సంవత్సరం ఎటువంటి ట్యూషన్ ఫీజు లేకుండా ఉచిత విద్య అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జి. రమేష్ బాబు , కె. రామకృష్ణ , నల్లా జయశంకర్ గౌడ్ , గోవిందా రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మంత్రిని కలిసిన ముజీబ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్), కార్యదర్శి విక్రమ్ కుమార్‌తో కలిసి మంగళవారం పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ, తూనికలు, కొలతల శాఖలలో ఉన్న ఉద్యోగుల సమస్యల గురించి ఆయనకు విన్నవించారు. ముఖ్యంగా సాయన్న అనే ఉద్యోగికి పదోన్నతి ఇవ్వకుండా కొందరు అధికారులు అడ్డుపడుతున్నారని, పౌరసరఫరాల శాఖలోనూ అర్హులకు పదోన్నతులు ఇవ్వడం లేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే జీవో 317 ప్రకారం జరిగిన ఉద్యోగుల విభజనలో కొందరికి అన్యాయం జరిగిందని, ఇలా అనేక సమస్యలు ఉండగా.. వాటిని మంత్రి దృష్టికి డాక్టర్ ముజీబ్ తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. వెంటనే పౌరసరఫరాల శాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్‌ని సంప్రదించి ఉద్యోగుల సమస్యలను.. సంఘ సభ్యులతో చర్చించి వెంటనే పరిష్కారం చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్టు ముజీబ్ తెలిపారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెపై బెదిరింపు వైఖరి తగదు

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

పర్మనెంట్ చేస్తా అని చెప్పి ఇప్పుడు చేయకపోవడం వల్ల 13వేల మంది పంచాయతీ కార్యదర్శులు అనేక సార్లు మంత్రులకు,అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారని.. అయినప్పటికీ వారు పట్టించుకోకపోవడం వల్లే సమ్మెకు దిగారని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కార్యదర్శి ఈ .ఉమామహేశ్ తెలిపారు. అయితే కేసీఆర్ సమస్యలను పరిష్కరించకుండా అహంకార పూరితంగా కార్మికులను బెదిరించడం తగదన్నారు. మంగళవారం జగద్గిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఆర్టీసీ, సింగరేణి, కార్మికులతో కూడా ఇలానే వ్యవహరి స్తున్నారని, ఇప్పుడు గ్రామ పంచాయితీ కార్యదర్శిలతో కూడా వ్యతిరేక భావనతో వ్యవహరించడం అన్యాయమన్నారు. ఇది ఎంతవరకు సమం జసం అని ప్రశ్నిం చారు. ఈ అంశాలు వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో కేసీఆర్ పై తీవ్రప్రభావం చూపుతుందని వ్యాఖ్యా నించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం సకల జనుల సమ్మె చేసిన చరిత్ర కార్మికులకు ఉందని గుర్తు చేశారు. వారి వల్లే తెలంగాణ ఉద్యమం తీవ్రతరం అయ్యి తెలంగాణ రాష్ట్రం సాకారం కావడానికి ఉపయో గపడిందని తెలుసుకో వాలన్నారు. ఉద్యోగాల జీవితాలతో చెలగాటమాడే ఈ ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని అది గుర్తుం చుకో వాలన్నారు. అలాంటి సమ్మెను నిరాకరించడం తగదన్నారు.

ప్రజా సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ కొలుకుల జగన్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీలకతీతంగా సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తానని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మైసమ్మ నగర్ ప్రాంతంలో సమస్యలపై స్థానిక నాయకులతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర చేశారు. రోడు, డ్రయినేజీ తదితర సమస్యలను బస్తీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ అట్టి సమస్యలను సంబంధిత అధికారుల దష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుం టానన్నారు. ప్రజల సహకారంతో జగద్గిరిగుట్ట డివిజన్‌ను అన్ని విధాల అభివృద్ధి పరుస్తానన్నారు .బస్తీలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు పిల్లి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, స్థానిక నాయకులు హనుమంతు. కురుమారెడ్డి. పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అద్భుత ఫలితాలు సాధించిన గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ఇంటర్మీడియట్ ఫలితాలలో ఎస్సార్ శ్రీ గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. పటిష్టమైన అకాడమిక్ ప్రణాళిక, విద్యార్థుల నిర్విరామ కృషి తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహము వలన ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఎస్సార్ శ్రీ గాయత్రీ విద్యాసంస్థల ప్రతినిధులు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎం.పీ.సీ, బై.పీ.సీ , సీ.ఈ.సీ , ఎం.ఈ.సీ విభాగాలలో డి శ్రీకర్, డి. లావణ్య, డి నిహారిక, ఏ శ్రీవిద్యలు ఎంపీసీలో 467 మార్కులు సాధించారు. ఏ శతి, ఎం దీక్షిత్ బైపీసీలో 436 మార్కులు సాధించారు. జి రాగిణి ఎంఈసిలో 492 మార్కులు సాధించారు సైదా ముస్రా, అఫ్రిన్ భాను సీఈసీలో 489 మార్కులు సాధించారు. అలాగే ఎంతో మంది విద్యార్థులు అద్భుతమైన మార్కులు సాధించారు. ఇక సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎం.మహితా దేవి, కే దీపికలు ఎంపీసీ లో 992 మార్కులు సాధించగా బైపీసీలో విజయ్ రాయ్ 992 మార్కులు సాధించి సత్తా చాటారు. ఎంఈసీలో వై ప్రేరణ 986 మార్కులు సాధించారు. ఆపైన ఎంతో మంది విద్యార్థులు అద్భుతమైన మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ ఏ సంతోష్ రెడ్డి, డీజీఎం బి భగవాన్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ కె. శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జులు సిహెచ్ నరేష్, బావాజీ, ప్రిన్సిపల్ సిహెచ్ వాసు, తులసి రామ్, బోధన, ఇతర సిబ్బంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్ఫూర్తి విద్యార్థుల సత్తా

నవతెలంగాణ-మేడ్చల్

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బైపీసీ గ్రూపులో శ్రీ వైష్ణవి 986/1000, ఎంపీసీ గ్రూపులో ప్రశాంత్ 981/1000 మార్కులతో మేడ్చల్ మండలంలో ఉత్తమ ఫలితాలను సాధించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో లక్ష్మి కచావా 470 మార్కులకు గాను 464, బైపీసీ గ్రూపులో శ్రీ మన్విత 440 మార్కులకు గాను 433, బైపీసీ గ్రూపులో అర్షియా 440 మార్కుల గాను 433 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్య సభ్యులు కమలాకర్ రెడ్డి, మంజుల ప్రకాష్, గణేష్, రామ్ శంకర్, సత్యనారాయణ, ప్రిన్సిపాల్ దేవరాజ్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. అధ్యాపకుల కృషి తల్లిదండ్రుల ప్రోత్సాహం విద్యార్థుల ప్రతిభతో ఇలాంటి ఉత్తమ ఫలితాలను స్ఫూర్తి కళాశాల సాధించిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



విజ్ఞాన్ విజయభేరి



నవతెలంగాణ- దుండిగల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో విజ్ఞాన్ కళాశాల నిజాంపేట్, మేడ్చల్ బ్రాంచీలలోని విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని విజ్ఞాన విద్యాసంస్థల వైస్ చైర్ పర్సన్. రాణి రుద్రమదేవి తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో బి. పూర్ణ శ్రీ 466, పి. లికిత 465, కీర్తి రెడ్డి 465, సాయి జ్యోతి రిషిత 465 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఏ.హిత 990, సాయి కృష్ణారెడ్డి 990, అశ్విత 989, సాయి శశాంక్ రెడ్డి 989, నవ్య శ్రీ 986, జి రిత్విక్ 986, జి కృష్ణ మనోహర్ రెడ్డి-986, మార్కులు సాధించాలని తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్స్ ఫ్రాన్సిస్, ప్రసాద్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.



సత్తా చాటిన ఆదర్శ్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు



బండి వైష్ణవి　విష్ణుమొలకల హిమబిందు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్మీడియట్ ఫలితాలలో ఆదర్శ్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం లో బండి వైష్ణవి 466/470, రెండో సంవత్సరంలో విష్ణుమొలకల హిమబిందు 987/1000 సాధించారు. వారికి పాఠశాల ఫ్యాకల్టీ అభినందనలు తెలిపారు. గత10 సంవత్సరాలుగా కార్పొరేట్ కాలేజీలకు దీటుగా మధ్యతరగతి పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఆదర్శ్ విద్యాసంస్థ దాదాపు 10,000 మంది విద్యార్థులకు విద్యాభ్యాసం అందించింది. ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చింది. కార్పొరేట్ కాలేజీల ఫీజులు భరించలేని విద్యార్థులకు ఆదర్శ్ విద్యాసంస్థ అతి తక్కువ ఫీజుతో నాణ్యత మైన విద్యను అందిస్తు వస్తున్నది. విద్యార్థులు ఎక్కువ ఒత్తిడికి గురి కాకుండా చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆటలు అన్ని రకాల సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తోంది. మొదటట ఎస్సార్ నగర్ లో ప్రారంభమై కూకట్‌పల్లి,అల్వాల్, చికడపల్లి, సికింద్రాబాద్, నల్లకుంట ఇలా సంస్థ విస్తీర్ణం అవుతోంది. విద్యార్థులకు ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అభినందన సభలో డైరెక్టర్స్ విష్ణువర్ధన్ రావు,సాయి కిషోర్, మనోజ్ యాదవ్, సాయినాథ్, రాహుల్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రభంజనం సృష్టించిన ప్రగతి విద్యాసంస్థల విద్యార్థులు

- కళాశాల స్థాపించిన మొదట సంవత్సరంలోనే అద్భుత ఫలితాలు



నవతెలంగాణ-దుండిగల్

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ప్రగతినగర్ లోని ప్రగతి విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరంలోనే అద్భుత ఫలితాలు సాధించి తమ సత్తా చాటారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో ఐదుగురు విద్యార్థులు 466 మార్కులు సాధించగా, 8 మంది విద్యార్థులు 465 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారు, బైపీసీలో 437,431,430 ఒక్కొక్కరు చొప్పున సాధించారని కళాశాల యజమాన్యం పేర్కొంది. కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరంలోనే రాష్ట్రస్థాయి మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ డి. దయాకర్ రెడ్డి అభినందించారు, ఇలాంటి ఫలితాలు సాధించడానికి కృషి చేసినటువంటి బోధన, బోధ నేతర సిబ్బందిని, విద్యార్థులను , తల్లిదండ్రులను యాజమాన్యం అభినందించింది.

రెజ్లర్లకు మద్దతు...

- దేశవ్యాప్త ఆందోళనకు డీవైఎఫ్ఐ పిలుపు
- 17వ రోజుకు చేరిన మల్లయోధుల ఆందోళన

న్యూఢిల్లీ : బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలనీ, బాధిత రెజ్లర్లకు న్యాయం చేయాలని రోడ్డెక్కిన రెజ్లర్లు... మంగళవారం కూడా తమ ఆందోళనను కొనసాగించారు. గత 17 రోజులుగా జరుగుతున్న ఈ ఆందోళన రోజు రోజుకు ఉధృతమవుతున్నది. పోరాడుతున్న మల్ల యోధులకు డీవైఎఫ్ఐ మద్దతు ప్రకటించింది. బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. మే 15 నుంచి 20 వరకు ఆందోళనలకు పిలుపు ఇచ్చింది. అన్ని రాష్ట్రాల్లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు రెజ్లర్ల సమావేశం అనంతరం డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఏఏ రహీం మీడియాకు తెలిపారు. 21న దేశవ్యాప్తంగా ఈ-మెయిల్ ద్వారా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు మెయిల్స్ పంపి నిరసన తెలుపుతామన్నారు. దీనికి ముందు హర్యానా డీవైఎఫ్ఐ నాయకత్వం ఆదివారం నిరసన స్థలానికి చేరుకుని రెజ్లర్లకు సంఘీభావం తెలుపుతుందని రహీం చెప్పారు. మోడీ ప్రభుత్వం ఆటగాళ్ళ వెంట కాకుండా, వేటగాళ్ల వెంటే ఉందని రహీం విమర్శించారు. డీవైఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమగ్నరాజ్ భట్టాచార్య, సెంట్రల్ సెక్రటేరియట్ సభ్యుడు జైక్ సి థామస్ కూడా రహీంతో పాటు నిరసన స్థలానికి వచ్చారు. ఉమ్మడి ట్రేడ్ యూనియన్ ప్రతినిధి బృందం బుధవారం కూడా క్రీడాకారులతో సమావేశం కానున్నది. సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, ఏఐయూటీ యూసీ, టీయూసీసీ, యూసీసీ, సేవా, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీ యూసీ సంఘాల ప్రతినిధులు హాజరవుతారు. రెజ్లర్లతో కలిసి మీడియా సమావేశం కూడా నిర్వహించనున్నారు.

రాజ్యాంగ హక్కులను హరిస్తున్న బీజేపీ

కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ

- ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మెన్ సభ్యులను నియమించాలి : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తున్న బీజేపీ మతోన్మాద విధానాలను ఐక్యంగా ప్రతిఘటించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులం, మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నదన్నారు. ప్రస్తుత రాజ్యాంగం స్థానంలో మను ధర్మ శాస్త్రాన్ని అమలు చేయటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తుందన్నారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్ల ప్రకారం ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేట్ పరం చేస్తున్న బీజేపీ విధానాలవల్ల సామాజిక న్యాయానికి విఘాతం కలుగుతుందన్నారు. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ రెండో విడత దళిత బంధును ప్రతి నియోజకవర్గంలోనూ 1500 మందికి ఇవ్వాలనీ, ఇంటి స్థలాలున్న వారికి సొంతిండ్లు నిర్మించుకోవటానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత బంధు పేరుతో ఎస్సీ కార్పొరేషన్ పెండింగ్ రుణాలు విడుదల చేయటం లేదని 2021 -22 పెండింగ్ రుణాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ కమి షన్ చైర్మెన్ సభ్యుల నియామకంలో నిర్లక్ష్యం తగదని ప్రభుత్వానికి సూచిం చారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగా ర్జున, అతిమెల మాణిక్యం, పల్లెర్ల లలిత, దయ్యపు రాధాకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు డి రాంమూర్తి, దుర్గం దినకర్, బొట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బెస్ట్ అవైలబుల్ పథకంలో సీట్ల సంఖ్యను పెంచాలి

ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్‌కు గిరిజన సంఘాల వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన బెస్ట్ అవైలబుల్ పథకంలో సీట్ల సంఖ్యను పెంచాలని తెలంగాణ గిరిజన సంఘం, తెలంగాణ గిరిజన సమాఖ్య సంయుక్తంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఆయా సంఘాల నేతలు ఆర్ శ్రీరాంనాయక్, ఆర్ అంజయ్య నాయక్ వినతి పత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పేద గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచితంగా విద్యనందేంచేందుకు వీలుగా ప్రవేశపెట్టిన గిరిజన బెస్ట్ అవైలబుల్ పథకంలో 2000 సీట్లను అదనంగా పెంచాలని ,అందుకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చే విధంగా చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో గత రెండు మూడేండ్ల నుంచి గిరిజన గురుకులాల్లో సీట్లకోసం 21 వేల మందికి పైగా గిరిజన విద్యార్థులు దరఖాస్తులు చేసుకుంటున్నారని తెలిపారు. కానీ 9 నుంచి 10వేల మంది మాత్రమే లాటరీల ద్వారా సీట్లు పొందుతున్నారని వివరించారు. మిగిలిన వారు వివిధ ప్రయివేటు విద్యాసంస్థల్లో అనివార్యంగా చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని తెలిపారు.

2002 నుంచి విద్యార్థులకు కార్పొరేట్ ప్రయివేటు పాఠశాలల్లో ఉచితంగా విద్యను అందిచడానికి ఆనాటి ప్రభుత్వం గిరిజన బెస్ట్ అవైలబుల్ పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటివరకు 6వేల సీట్ల వరకే ప్రయివేటు పాఠశాలల్లో సీట్లు పొందే అవకాశం కలిగిందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ స్కీములో ఒక్క సీటు కూడా పెంచలేదని గుర్తుచేశారు. ప్రతి ఏడాది ఈ పథకంలో సీట్లు కావాలని 15వేల మంది వరకు విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులు చేసుకుంటున్నారని తెలిపారు. కానీ ప్రతి ఏటా పదో తరగతి పూర్తయిన విద్యార్థుల ఖాళీ సీట్లను భర్తీ చేస్తున్నదని వివరించారు. ఈ క్రమంలో దరఖాస్తులకు, పథకంలో ఉన్న సీట్ల ఏమాత్రం సరిపోవడం లేదని తెలిపారు. అదనంగా మరో 2 వేల సీట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన సంక్షేమ శాఖ కూడా 2000 సీట్లు పెంచుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఆర్థిక శాఖకు ఫైలు పంపి సాంఘిక సంక్షేమ శాఖలో 3000 సీట్ల పెంచుకోవటానికి ఆ శాఖకు గతేడాది ఆగమేఘాలమీద అనుమతి ఇచ్చిన ఆర్థిక శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఇచ్చిన సీట్ల పెంపు ప్రతిపాదనకు మాత్రం అనుమతించారని వాపోయారు. ఈ నేపథ్యంలో ప్రణాళికా సంఘం జోక్యం చేసుకుని పేద గిరిజన విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామంటూ వినోద్‌కుమార్ ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్టు సంఘాల నేతలు పేర్కొన్నారు.

గురుకులాల ప్రభంజనం

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు

- కార్పొరేట్ కాలేజీల కంటే మెరుగైన ఫలితాలు
- ప్రయివేటు కళాశాలల్లో 63 శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ వార్షిక ఫలితాల్లో గురుకుల విద్యాలయాల సొసైటీలు సత్తాచాటాయి. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల కంటే మెరుగైన ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించాయి. తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు (టీఎస్‌ఆర్జేసీ) అన్నింటి కంటే ఉత్తమ ఫలితాలు సాధించి అగ్రస్థానంలో నిలిచాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 92 శాతం ఉత్తీర్ణతను టీఎస్‌ఆర్జేసీ కాలేజీలు నమోదు చేశాయి. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 89 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బీసీ గురుకుల విద్యాలయాలు ద్వితీయ సంవత్సరంలో 87 శాతం ఉత్తీర్ణతను సాధించాయి.

గిరిజన గురుకులాలు ద్వితీయ సంవత్సరంలో 84 శాతం, మైనార్టీ గురుకులాలు 83 శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్ జూనియర్ కాలేజీలు 75 శాతం, కేంద్ర ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 72 శాతం ఉత్తీర్ణతను పొందాయి. ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో 46 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రయివేటు జూనియర్ కాలేజీల్లో ద్వితీయ సంవత్సరంలో 63 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు మాత్రం అనుకున్న స్థాయిలో ఉత్తీర్ణతను సాధించలేదు. ద్వితీయ సంవత్సరంలో కేవలం 54 శాతం ఉత్తీర్ణత సాధించాయి. గురుకులాల తరహాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆకాంక్షించారు. జూనియర్ కాలేజీల్లోని అధ్యాపకులు మరింత కష్టపడి పనిచేయాలని, మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు.

యాజమాన్యాల వారీగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత వివరాలు

యాజమాన్యం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
ప్రభుత్వ	80,100	43,340	54
ఎయిడెడ్	7,289	3,345	46
ప్రయివేటు	2,94,171	1,85,504	63
ఎస్సీ గురుకులాలు	12,931	11,475	89
గిరిజన గురుకులాలు	7,539	6,331	84
బీసీ గురుకులాలు	9,115	7,929	87
మైనార్టీ గురుకులాలు	8,583	7,127	83
టీఎస్ఆర్జేసీ	2,632	2,429	92
మోడల్ స్కూల్స్	21,049	13,875	66
కేజీబీవీ	10,374	7,941	77
స్పోర్ట్స్ జూనియర్ కాలేజీలు	53	40	75
కేంద్ర ప్రభుత్వ కాలేజీలు	200	143	72

నీరాపై విష ప్రచారం తగదు

- నీరా కేఫ్ ఆకస్మిక తనిఖీలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'ప్రకృతి, సాంప్రదాయ ఎన్నో ఔషధ గుణాలున్న నీరాపై కొందరు ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో విషప్రచారం చేస్తున్నారు. గీత కార్మికులు ప్రాణాలకు తెగించి ప్రజల ఆరోగ్యానికి మేలుచేసే, క్యాన్సర్‌తో పాటు అనేక జబ్బులను నివారించే నీరాను అందిస్తున్నారు. నీరాపై విష ప్రచారం తగదు' అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్-నెక్లెస్‌రోడ్‌లో నీరా కేఫ్‌ను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాళ్లలోని వంటలను రుచి చూశారు. నీరా ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. నీరా కోసం వచ్చిన సందర్శకులతో మాట్లాడారు. నీరా కేఫ్‌లో ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్య ఔషధం నీరాను ప్రజలకు అందించేందుకు సుమారు రూ.20కోట్లతో ఆధునికంగా నీరాకేఫ్‌ను నిర్మించినట్టు తెలిపారు. కేఫ్‌లో నాణ్యమైన వంటకాలను ప్రజలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. నీరాను ప్రజలందరికీ చేరేలా 'నీరా కేఫ్' ముఖ్య భూమిక పోషించేలా అధికారులు, స్టాల్ నిర్వాహకులు కృషి చేయాలని ఆదేశించారు.

రోబోటిక్స్.. ఆర్థిక రంగానికి బూస్ట్

- సాంకేతికతతో జీవన విధానంలో మార్పులు
- ఫ్రేమ్‌వర్క్‌లో తెలంగాణే మొదటిది : మంత్రి కేటీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రోబోటిక్స్ ఫ్రేమ్‌వర్క్ ఆర్థిక రంగానికి బూస్ట్ వంటిదని ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలోనే ఫ్రేమ్‌వర్క్‌ను విడుదల చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుందని పేర్కొన్నారు. మంగళ వారం హైదరాబాద్‌లో రాయదుర్గంలోని టీహబ్‌లో 'రోబోటిక్స్ ఫ్రేమ్ వర్క్'ను ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌తో కలిసి కేటీఆర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత మనిషి జీవన విధానంలో మార్పులు తీసుకొస్తున్నదని అన్నారు. ప్రతి ఒక్కరూ మొబైల్‌లోనే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇతర సామాజిక మాధ్యమాల్లో చూస్తూ ఆనందాన్ని పొందుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో రోబో పార్కు, తెలంగాణ రోబోటిక్స్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామనీ, జులైలో గ్లోబల్ రోబోటిక్స్ సమ్మిట్‌ను నిర్వహించనున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి రోబోటిక్స్ ఎకోసిస్టమ్‌ను రూపొందించనున్నామనీ, రోబోటిక్స్ తయారీలో తెలంగాణను గ్లోబల్‌హబ్‌గా మారుస్తామని, రాష్ట్రంలో రోబోటిక్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ హబ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రోబోల ఎగుమతులు, దిగుమతులకు మార్గాన్ని సుగమమం చేస్తామని చెప్పారు. ప్రపంచస్థాయి రోబోటిక్స్ టెస్టింగ్ సెంటర్‌ను నిర్మించనున్నామని చెప్పారు. వ్యవసాయ రంగం, హెల్త్‌కేర్, పారిశ్రామిక ఆటోమేషన్, వినియోగదారుల రంగాల్లో రోబోటిక్స్ కీలకపాత్ర పోషించనున్నాయని వెల్లడించారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో తెలంగాణ ముందంజలో ఉందనీ, అందులో భాగంగానే 2017లోనే ఎమర్జింగ్ టెక్నాలజీ విభాగాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అన్ని రంగాల్లో సాంకేతికతనే కీలకంగా మారిందనీ, ఫ్రేమ్‌వర్క్‌లో పాలసీ, పార్టనర్‌షిప్, ప్రాజెక్టులు(పీపీపీ)పై కేంద్రీకరించనున్నామని తెలిపారు. పాలసీ ఫ్రేమ్ వర్క్‌లో అర్టిషియల్ ఇంటెలి జెన్స్, క్లౌడ్, బ్లాక్‌చైన్, డ్రోన్, స్పేస్‌టెక్ ఉన్నాయని చెప్పారు. రోబోటిక్స్ ఫ్రేమ్ వర్క్ ద్వారా సస్టెయినబుల్ రోబోటిక్స్ ఎకోసిస్టం, ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో ఛాంపియన్‌గా మారనున్నట్టు తెలిపారు. అంతకుముందు ఐఐటీ హైదరాబాద్, ఆర్ట్‌పార్కు, జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్, అగ్రీ హబ్, పీజేటీఎస్‌ఏయూ, ఆన్‌ఇండియా రోబోటిక్స్ అసోసియేషన్లతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఎంఓయూలపై సంతకాలు కూడా చేశారు. అనంతరం ఐటీ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ తెలంగాణలో అమలు చేస్తున్న ఐటీ రంగానికి సంబంధించిన కార్యక్రమాలను వివరించారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ రమాదేవిలంకా మాట్లాడుతూ రోబోటిక్స్ ఫ్రేమ్‌వర్క్ మైలురాయిగా నిలవనుందని అన్నారు.

భూసార పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- సమీక్షా సమావేశంలో మంత్రి నిరంజన్‌రెడ్డి


నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భూసార పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. పచ్చి రొట్ట విత్తనాలు 65శాతం సబ్సిడీతో సరఫరా చేస్తున్నదని తెలిపారు. 1445 డీసీఎంస్, పీఏసీఎస్ గుర్తింపబడిన పచ్చిరొట్ట విత్తనాలు ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో అందుబాటు లో ఉన్నాయని వివరించారు. పచ్చిరొట్ట ఎరువులతో నాణ్యమైన, ఆరోగ్య వంతమైన పంట దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో భూసార పరిరక్షణపై మంత్రి ఉన్నతాధికారులతో సమీక్షించారు. విచక్షణారహితంగా రసాయనిక ఎరువుల వాడకం ద్వారా నేలల సహజ స్వభావం దెబ్బతింటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ప్రత్యేక కమిషనర్ హన్మంత్, సీడ్స్ ఎండీ కేశవులు, ఏడీడీ విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

రైతుల కష్టాలు కేసీఆర్‌కు పట్టవా? :వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తడిసిన వడ్లు కొనాలనీ, కోతలు పెట్టొద్దని రైతులు కాళ్లావేళ్లా పడుతున్నా..సీఎం కేసీఆర్‌కు పట్టటం లేదని వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్‌షర్మిల మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కిసాన్ సర్కార్ అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. ఎండనకా, వాననకా రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారని తెలిపారు.



విజయ్ దేవరకొండ, సమంత

నా రోజా నువ్వే.. నా దిల్ సే నువ్వే..

హీరో విజయ్ దేవరకొండ బర్త్ డే స్పెషల్ గా 'ఖుషీ' మూవీ నుంచి బ్యూటీఫుల్ మెలోడియస్ సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. శివ నిర్వాణ డైరెక్షన్‌లో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. వాటిని రెట్టింపు చేసేలా విజయ్ దేవరకొండ బర్త్ డే స్పెషల్ సాంగ్ కనిపిస్తోంది. హేషమ్ అబ్దుల్ వాహబ్ స్వరపరిచి, ఈ పాటను ఆయనే పాడారు. ఈ గీతాన్ని దర్శకుడు శివ నిర్వాణ రాయడం ఓ విశేషమైతే, 'నా రోజా నువ్వే.. నా దిల్ సే నువ్వే, నా అంజలి నువ్వే గీతాంజలి నువ్వే' అంటూ పాట మొత్తంలో లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం సినిమాల పేర్లు కలిసి వచ్చేలా సాహిత్యం ఉండటం మరో విశేషం. ఏ సినిమా నుంచి అయినా మొదటి పాట వస్తోందంటే అది ఆ మూవీ ఫ్లేవర్‌ను తెలియజేస్తుంది. 'ఖుషీ' నుంచి వచ్చిన ఈ పాట కూడా ఓ ప్లెజెంట్ లవ్ స్టోరీని చూడబోతున్నాం అనేలా చేసింది. శివ నిర్వాణే నృత్య రీతులు సమకూర్చిన ఈ గీతాన్ని కశ్మీర్‌లోని అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరించారు. సమంత కశ్మీరి యువతిగా కనిపిస్తోంది. తన ప్రేమను గెలుచుకునే యువకుడుగా విజయ్ నటించాడు. వీరి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా కుదిరిందని పాట చూస్తే అర్థమౌతోంది. ఫస్ట్ సాంగ్‌తోనే బెస్ట్ ఇంప్రెషన్ వేసిన ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మళయాల, హిందీ భాషల్లో సెప్టెంబర్ 1న విడుదల చేయబోతున్నారు.

ఛత్రపతి హిట్ ఖాయం



వి.వి.వినాయక్

శ్రీనివాస్ బెల్లంకొండ హీరోగా వివి వినాయక్ దర్శకత్వంలో పెన్ స్టూడియోస్ పతాకంపై రూపొందుతున్న బాలీవుడ్ చిత్రం 'ఛత్రపతి'. రాజమౌళి 'ఛత్రపతి'కి రీమేక్‌గా అదే టైటిల్‌తో ఈ చిత్రాన్ని గ్రాండ్ తెరకెక్కించారు. ఈ సినిమా ఈ నెల 12న విడుదల అవుతున్న నేపథ్యంలో దర్శకుడు వివి వినాయక్ మీడియాతో మాట్లాడుతూ,'మంచి కథ అందించిన విజయేంద్ర ప్రసాద్‌కి నా కృతజ్ఞతలు. రాజమౌళి, ప్రభాస్ 'ఛత్రపతి'ని అద్భుతంగా చేశారు. వారు చేసిన దానిని పాడు చేయకుండా ఐకానిక్ సీన్స్, షాట్స్ ఏమీ మార్చకుండా చాలా జాగ్రత్తగా చేశాం. సాయి సినిమాలన్నీ నార్త్‌లో బాగా ఆడాయి. ఆ నమ్మకంతో పెన్ స్టూడియో గడా ఈ సినిమా చేశారు. బెల్లం కొండ సురేష్ మాకు బ్యాక్ బోన్. సాయి అద్భుతంగా చేశాడు. ఇంటర్వెల్ సీన్‌లో, యాక్షన్ సీన్స్‌లో సాయి నటన చూసి ఆశ్చర్యపోయాను. ఈ సినిమాతో సాయి చాలా పెద్ద హీరోగా హిందీలో నిలబడతాడు. ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే ఆశతో ఉన్నాను' అని తెలిపారు. 'అరవై కోట్లుతో పెన్ పెన్ స్టూడియోస్ లాంటి నిర్మాణ సంస్థ మా అబ్బాయితో సినిమా చేయడం తండ్రిగా నేను ఎంతో గర్వపడే విషయం. మాస్ పల్స్ తెల్సిన వినాయక్ హిందీలో కూడా మా అబ్బాయిని లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. మన వాళ్ళకి తెలుగు డబ్‌లో కాకుండా హిందీలోనే చూపిద్దామని వినాయక్ చెబితే, అలాగే రిలీజ్ చేస్తున్నాం' అని చెప్పారు.

నవచిత్రం

ఆ విమర్శలకు సమాధానం



ఓమ్ రౌత్, కృతిసనన్, ప్రభాస్

ప్రభాస్, కృతి సనన్ సీతారాములుగా నటించిన సినిమా 'ఆదిపురుష్'. సైఫ్ అలీఖాన్, సన్నీ సింగ్, దేవదత్త నాగే, వత్సల్ సేన్, సోనాల్ చౌహాన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఓమ్ రౌత్ దర్శకుడు. మంగళవారం ఈ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. దాదాపు 70 దేశాల్లో ఈ ట్రైలర్‌ని ఒకేసారి విడుదల చేయటం ఓ విశేషమైతే, అంచనాలకు భిన్నంగా ట్రైలర్ ఈసారి అద్భుతం అనే టాక్ తెచ్చుకోవడం మరో విశేషం. హైదరాబాద్‌లోని ఏ.ఎమ్‌బి మాల్‌లో జరిగిన ట్రైలర్ ప్రివ్యూకు ప్రభాస్‌తో పాటు మూవీ టీమ్ మొత్తం హాజరైంది. హనుమంతుడి కోణంలో సాగే కథలా ఈ ట్రైలర్ ఆరంభంలోనే కనిపిస్తుంది. 'ఇది నా రాముడి కథ. ఆయన మనిషిగా పుట్టిన భగవంతుడైన మహనీయుడు. ఆయన జీవితం ధర్మానికి, సన్మార్గానికి నిదర్శనం. ఆయన నామం రాఘవ. అధర్మానికి ఉన్న అహంకారాన్ని ఆయన ధర్మం అంతం చేసింది. ఇది ఆ రఘునందుడి గాథ. యుగయుగాల్లోనూ సజీవం.. జాగ్రుతం. నా రాఘవుడి కథే రామాయణం' అంటూ హనుమంతుడు చెబుతుండగా సాగిన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

అలాగే సీతాపహరణం ఎపిసోడ్‌తోపాటు చివర్లో వచ్చిన రామ, రావణ యుద్ధానికి నేటి ఆధునిక టెక్నాలజీని జోడించినట్టు కనిపిస్తోంది. విజువల్స్ ఫీస్ట్‌గా మొదట్లో వచ్చిన విమర్శలకు దీటైన జవాబులా విజువల్ ఎఫెక్ట్, గ్రాఫిక్స్ కనిపిస్తున్నాయి. ఈ చిత్రం జూన్ 16న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

నిరుద్యోగుల పరిస్థితి ఏంటి?



ఆర్.నారాయణమూర్తి

స్నేహ చిత్ర పిక్చర్స్ బ్యానర్‌పై ఆర్ నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'యూనివర్సిటీ'. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈనెల 26న రెండు తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రసాద్ ల్యాబ్‌లో పాత్రికేయులకు ఈ సినిమాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ, ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ, ప్రొఫెసర్ కోయి కోటేశ్వరరావు, తెలుగు ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మి నారాయణ వారణాసి, జనరల్ సెక్రెటరీ వై జే రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ, 'పేపర్ లీకేజ్ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు యావత్ దేశంలో చాలా దారుణంగా జరుగుతున్నాయి. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కూడా జరిగాయి. మరి నిరుద్యోగులు ఏమై పోవాలి?, విద్య, వైద్యం రెండు జాతీయం చేయాలని చెప్పేది నా సినిమా. లీకేజ్‌లను జాతీయ సమస్యగా పరిగణించాలి అని రాష్ట్రపతి, ప్రధానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఇందులో 5 పాటలు ఉన్నాయి' అని చెప్పారు.

కొత్త చైతూని చూస్తారు



వెంకట్ ప్రభు

నాగ చైతన్య, వెంకట్ ప్రభు కాంబోలో తెరకెక్కిన తెలుగు-తమిళ ద్విభాషా ప్రాజెక్ట్ 'కస్టడీ'. కృతి శెట్టి కథానాయికగా శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. పవన్‌కుమార్ సమర్పిస్తున్న ఈ సినిమా ఈనెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు వెంకట్ ప్రభు మీడియాతో ఈ సినిమా గురించి పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. 'ఈ కథ ఆలోచనకు స్ఫూర్తి మలయాళం సినిమా 'నయట్టు'. పెద్ద ఆశయాలతో ఉన్న ఒక సాధారణ కానిస్టేబుల్ కథ చెప్పాలనేది ఆలోచన. అలా 'కస్టడీ' కథ పుట్టింది. 'లవ్ స్టోరీ'లో ఒక పాట చూశాను. అందులో నాగచైతన్య ఈ పాత్రకు సరిపోతాడని పించింది. నాగచైతన్యకు కథ చెప్పాను. ఆయనకి చాలా నచ్చింది. అలాగే నిర్మాత శ్రీనివాస్ జాయిన్ అయ్యారు. ఇందులో హీరో శివ ఒక చిన్న టౌన్ నుంచి వచ్చిన కానిస్టేబుల్. తనకి కుటుంబం, అలాగే ప్రేమగా కూడా ఉంటుంది. శివకి వచ్చిన సమస్యతో ఈ సినిమా ప్రారంభమవుతుంది. తనది కాని సమస్య తను ఎదురుకోవాల్సి వస్తుంది. ప్రీ ఇంటర్వెల్ నుంచి క్లైమాక్స్ వరకూ సినిమా ఎడ్జ్ అఫ్ సీట్ థ్రిల్లర్‌లా ఉంటుంది. ఇది యూనివర్సల్ సబ్జెక్ట్. అందరూ ఎంజాయ్ చేసేలా, స్క్రీన్ ప్లే ఫాస్ట్ ఫేస్డ్‌గా ఉంటుంది. అరవింద్ స్వామి ఇమేజ్‌కి తగ్గట్టుగా ఆయన పాత్ర ఉంటుంది. స్క్రీన్ పై చై కంటేపవర్ ఫుల్‌గా కనిపించే వ్యక్తి కావాలనే ఆలోచనతో ఆయన్ని తీసుకున్నాం. అంత పవర్ ఫుల్ వ్యక్తిని ఎలా కంట్రోల్ చేస్తాడనే ఎగ్జైట్‌మెంట్ ప్రేక్షకుల్లో కలుగుతుంది. అలాగే శరత్ కుమార్ పాత్ర కూడా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఈ చిత్రంలో కొత్త చైతూని చూస్తారు. అలాగే ఇళయరాజా, యువన్ శంకర్ రాజా నెక్ట్స్ లెవల్‌లో మ్యూజిక్ చేశారు. కస్టడీకి మ్యూజిక్ బిగ్గెస్ట్ ఎస్సెట్. చాలా యూనిక్ సౌండ్ వింటారు. ఇందులో కృతి పేరు రేవతి. చాలా అద్భుతంగా చేసింది. తన పాత్ర కథలో కీలకంగా ఉంటుంది.

నయా సస్పెన్స్ థ్రిల్లర్



విశ్వంత్ దుడ్డుంపూడి, శ్రీజితగొష్

దండమూడి బాక్సాఫీస్ బ్యానర్‌పై రూపొందిన తొలి చిత్రం 'కథ వెనుక కథ'. విశ్వంత్ దుడ్డుంపూడి, శ్రీజిత గొష్, శుభ శ్రీ ప్రధాన తారాగణంగా నటించారు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని అవనీంద్ర కుమార్ నిర్మించారు. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ మూవీని మే 12న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, సినిమా చాలా బాగా వచ్చింది. సీట్ ఎడ్జ్ మూమెంట్స్‌తో ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటుంది' అని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గొట్టిపాటి సాయి మాట్లాడుతూ, "నేను ఇండస్ట్రీలోకి వచ్చి 30 ఏళ్లు అయ్యాయి. 80కిపైగా సినిమాలు చేశాను. మా నిర్మాత ప్యాషన్‌తో అన్ కాంప్రమైజ్డ్‌గా, మంచి కంటెంట్‌తో చేసిన ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు.

అలాంటి అక్కని..



వాసుకి

స్వప్న సినిమా నిర్మాణంలో నందిని రెడ్డి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'అన్నీ మంచి శకునములే'. సంతోష్ శోభన్, మాళవిక నాయర్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని మిత్ర విందా మూవీస్‌తో కలిసి ప్రియాంక దత్ నిర్మించారు. ఈనెల 18న విడుదల కానున్న సందర్భంగా ఈచిత్రంలో కీలక పాత్ర పోషించిన నటి వాసుకి మాట్లాడుతూ, "తొలిప్రేమ' తర్వాత దాదాపు 23 ఏళ్ళకి ఇందులో నటించడానికి కారణం ఒక్కటే ఈ కథ విన్న వింటనే సేఫ్ అండ్ కంఫర్ట్ జోన్ ఫీలయ్యాను. ఫ్యామిలీలో తమ్ముడు ఏం చేసినా సపోర్ట్ చేసే ఒక అక్క ఉంటుంది కదా. అలాంటి పాత్రే నాది. నాకు, సంతోష్ పాత్రకు చాలా మంచి బాండింగ్ ఉంటుంది. ఒక మంచి కథ చదువుతున్నప్పుడు ఎంత ఆనందంగా, హాయిగా ఉంటుందో.. ఈ సినిమా అలా ఉంటుంది' అని చెప్పారు.



తెలంగాణ క్రీడా పండుగ

- మే 15 నుంచి సిఎం కప్ టోర్నీ
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- పోటీపడనున్న 2 లక్షల మంది అథ్లెట్లు

2,00,000 మంది క్రీడాకారులు, 12,769 గ్రామాలు, 612 మండలాలు, 33 జిల్లాలు.. తెలంగాణ క్రీడా పండుగకు సిద్ధం. కనీవినీ ఎరుగని రీతిలో తెలంగాణ రాష్ట్రం తొలిసారి రాష్ట్ర క్రీడా పండుగకు రంగం సిద్ధం చేసింది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా భారీ స్థాయిలో సిఎం కప్ 2023 నిర్వహణకు అడుగు పడింది. మే 15 నుంచి 31 వరకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర క్రీడా మంత్రిత్వ శాఖ, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) సిఎం కప్ నిర్వహణకు అద్భుత ఏర్పాట్లు చేస్తున్నాయి. రాష్ట్ర క్రీడా రంగంలో ఇటువంటి ఓ భారీ స్థాయి స్పోర్ట్స్ ఈవెంట్ జరుగనుండటం ఇదే ప్రథమం కానుంది!.

నవతెలంగాణ-హైదరాబాద్

ప్రతిభకు ఆహ్వానం

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించటం.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేందుకు వీలుగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులను తయారు చేయటమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) బృహత్తర ప్రణాళికతో ముందుకొచ్చింది. ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులను వెలికి తీయటం, యువతలో స్పోర్ట్స్ కల్చర్‌ను తీసుకొచ్చేందుకు సిఎం కప్ 2023 నిర్వహిస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జరుగుతున్న ఈ పోటీల్లో పోటీపడేందుకు ప్రతిభ కలిగిన క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ఈ పోటీల్లో సత్తా చాటిన నాణ్యమైన క్రీడాకారులను శాట్స్ యంత్రాంగం గుర్తించి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించనుంది. శాట్స్ అకాడమీల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను నిష్ణాతులైన కోచ్‌లు శిక్షణ ఇవ్వనున్నారు.

అంతర్జాతీయ ఈవెంట్లకు సన్నద్ధత!

జాతీయ క్రీడలు సహా అంతర్జాతీయ స్థాయి మెగా ఈవెంట్ల నిర్వహణపై తెలంగాణ రాష్ట్రం ఆసక్తి చూపుతోంది. సిఎం కప్ టోర్నీ నిర్వహణలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా వనరులను పూర్తి వినియోగంలోకి రానున్నాయి. క్రీడా యంత్రాంగం సైతం దాదాపు అన్ని క్రీడాంశాలకు సంబంధించి స్టేడియాలను, వసతులను అందుబాటులోకి తీసుకొస్తుంది. భారీ ఎత్తున్న నిర్వహిస్తున్న సిఎం కప్ టోర్నీ అనుభవంతో రానున్న కాలంలో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు తెలంగాణ ఆతిథ్యం అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

పకడ్బందిగా కసరత్తు

సిఎం కప్ 2023 నిర్వహణకు రెండు నెలల ముందు నుంచే కసరత్తు మొదలైంది. జిల్లా స్థాయిలో చాలా చోట్ల క్రీడలతో సంబంధం లేని వ్యక్తులు జిల్లా క్రీడల అధికారిగా కొనసాగుతున్నారు. క్షేత్ర స్థాయి నుంచి క్రీడల అభివృద్ధి జరగాలంటే.. క్రీడాశాఖకు చెందిన వ్యక్తులే ఆ పదవిలో ఉండాలని క్రీడాశాఖ, శాట్స్ ఉన్నతాధికారులు భావించారు. తొలి అడుగుగా.. జిల్లా క్రీడాధికారులుగా స్థానికంగా ఉన్న సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లను నియమించాలని ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం 33 జిల్లాల్లోనూ క్రీడాశాఖకు చెందిన వ్యక్తులే జిల్లా యువజన, క్రీడల అధికారిగా నియమితులయ్యారు. సిఎం కప్ నిర్వహణ సహా ఇతర రెగ్యులర్ క్రీడల షెడ్యూల్ విజయవంతం అయ్యేందుకు ఇది దోహదం చేయనుంది.

నిర్వహణ కమిటీల ఏర్పాటు

సిఎం కప్ 2023 నిర్వహణకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. మండల స్థాయి సిఎం కప్ పోటీల నిర్వహణ కమిటీ చైర్మెన్‌గా ఎంపిపి ఉండనుండగా.. జడ్పీటిసి, ఎంపిడివో, ఎంఆర్‌వో, ఎంఈవో, ఎస్‌ఐ, మున్సిపల్ కమిషనర్, ఫిజికల్ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయి సిఎం కప్ నిర్వహణ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మెన్‌గా ఉంటారు. జిల్లా ఎస్పీ వైస్ చైర్మెన్‌గా.. అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) కో-వైస్ చైర్మెన్‌గా ఉంటారు. జిల్లా క్రీడాధికారి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, జిల్లా విద్యాశాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్ సభ్యులు. ఇక రాష్ట్ర స్థాయి సిఎం కప్ పోటీల నిర్వహణ కమిటీకి క్రీడాశాఖ మంత్రి చైర్మెన్, శాట్స్ చైర్మెన్ కో-చైర్మెన్‌గా కొనసాగుతారు. క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి వైస్ చైర్మెన్‌గా, శాట్స్ వీసీ, ఎండీ కన్వీనర్‌గా ఉంటారు. రాష్ట్ర ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్, పంచాయత్ రాజ్ కమిషనర్, జిహెచ్‌ఎంసి కమిషనర్, డిప్యూటీ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలో పోటీల నిర్వహణకు రూ.15 వేలు, జిల్లా స్థాయిలో పోటీల నిర్వహణకు రూ.75 వేల చొప్పున మంజూరు చేశారు. మండల స్థాయిలో ఐదు క్రీడాంశాలు, జిల్లా స్థాయిలో 11 క్రీడాంశాలు, రాష్ట్ర స్థాయిలో 18 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి.

ప్రతి ఏడాది సిఎం కప్

తెలంగాణ స్ఫూర్తి చాటడం, యువతలో ఐక్యత తీసుకురావటం, ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులను వెలికతీయటం.. మూడు లక్ష్యాలతో సిఎం కప్‌ను నిర్వహిస్తున్నారు. సుమారు 2 లక్షల మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పోటీపడనున్నారు. ఈ స్థాయిలో ఓ టోర్నీలో క్రీడాకారులు పాల్గొనటం ఇదే తొలిసారి కానుంది. మండల, జిల్లా స్థాయిల పోటీల అనంతరం.. రాష్ట్ర స్థాయిలో పోటీలకు శాట్స్ భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తుంది. సుమారు 10,000 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అంచనా. అందుకోసం క్రీడాకారులకు నాలుగు రోజుల పాటు వసతి, భోజనం ఏర్పాట్లు చేయనున్నారు. ఇక నుంచి ప్రతి ఏడాది సిఎం కప్ టోర్నీ నిర్వహించనున్నట్టు శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ తెలిపారు.

సిఎం కప్ పోటీలు

మండల స్థాయిలో.. :

మహిళలు : అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్.

పురుషులు : అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్.

జిల్లా స్థాయిలో..

మహిళలు : అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్.

పురుషులు : అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్

రాష్ట్ర స్థాయిలో..

మహిళలు : అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్, షూటింగ్.

పురుషులు : అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, హాకీ, లాన్ టెన్నిస్, షూటింగ్.

సిఎం కప్ 2023 షెడ్యూల్

మండల స్థాయి : మే 15, 16, 17
జిల్లా స్థాయి : మే 22, 23, 24
రాష్ట్ర స్థాయి : మే 28, 29, 30, 31

సిఎం కప్ ప్రైజ్‌మనీ

వ్యక్తిగత విభాగం

స్వర్ణం : రూ. 20,000
రజతం : రూ.15,000
కాంస్యం : రూ.10,000

జట్టు విభాగం

స్వర్ణం : రూ.1,00,000
రజతం : రూ.75,000
కాంస్యం : 50,000



'క్రీడల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. సిఎం కప్ టోర్నీ నిర్వహణతో గ్రామీణ క్రీడలకు, క్రీడాకారులకు పెద్ద పీట వేయనున్నాం. ప్రతి జిల్లాలోనూ యువజన, క్రీడల అధికారిగా క్రీడేతరుల స్థానంలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లను నియమించాలి'

- ఇటీవల సమీక్ష సమావేశంలో మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్



'తెలంగాణ స్ఫూర్తి చాటడం, యువతలో ఐక్యత, ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులను వెలికితీయటమే సిఎం కప్ టోర్నీ ముఖ్య లక్ష్యాలు. 2 లక్షల మంది పోటీపడుతున్న సిఎం కప్ తెలంగాణలో యువతకు అతిపెద్ద క్రీడా పండుగ. సిఎం కప్‌తో వెలుగులోకి వచ్చిన క్రీడాకారులకు శాట్స్ అకాడమీల్లో అత్యుత్తమ శిక్షణతో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సన్నద్ధమయ్యేందుకు సహకారం అందిస్తాం'

- ఆంజనేయ గౌడ్, శాట్స్ చైర్మెన్

మెస్సికి లారెస్ అవార్డు

స్పోర్ట్స్‌మ్యాన్ ఆఫ్ ఇది ఇయర్ పురస్కారం సొంతం



పారిస్ : ప్రపంచ ఫుట్‌బాల్ సూపర్‌స్టార్, అర్జెంటీనా జాతీయ కెప్టెన్ లియోనల్ మెస్సి మరో ప్రతిష్టాత్మక పురస్కారం సొంతం చేసుకున్నాడు. ప్రఖ్యాత లారెస్ స్పోర్ట్స్‌మ్యాన్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచాడు. 1986 తర్వాత అర్జెంటీనాకు తొలి ఫిఫా ప్రపంచకప్ విజయాన్ని అందించిన లియోనల్ మెస్సి.. ఇటీవల ముగిసిన ఖతార్ ఫిఫా ప్రపంచకప్‌లో కీలక గోల్స్ కొట్టడంతో పాటు సహచరులకు గోల్ అవకాశాలు కల్పించి జట్టును ముందుండి గెలుపు పథాన నడిపించాడు. అవార్డు రేసులో కిలియన్ ఎంబపె, రఫెల్ నాదల్, స్టిఫెన్ కారీ, మోండో డుప్లాంటిస్, మాక్స్ వెర్‌స్టాపన్‌లు సైతం పోటీపడ్డారు. ఫిఫా ప్రపంచకప్ విజయ సారథి అత్యధిక ఓట్లను సొంతం చేసుకున్న లియోనల్ మెస్సి 2023 స్పోర్ట్స్‌మ్యాన్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచాడు. 2020లోనూ లారెస్ స్పోర్ట్స్‌మ్యాన్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచిన మెస్సి.. స్పోర్ట్స్‌టీమ్ ఆఫ్ ది ఇయర్ అవార్డు నెగ్గిన జట్టులో మూడుసార్లు సభ్యుడిగా నిలిచాడు. దీంతో అత్యధికంగా ఐదుసార్లు లారెస్ పురస్కారం దక్కించుకున్న ఆటగాడిగా లియోనల్ మెస్సి సరికొత్త చరిత్ర సృష్టించాడు. లారెస్ అవార్డును అర్జెంటీనా ప్రజలకు అంకితం ఇస్తున్నట్టు లియోనల్ మెస్సి తెలిపాడు.

సూర్య ప్రతాపం

- ఇషాన్ కిషన్, నేహల్ ధనాధన్
- బెంగళూర్‌పై ముంబయి ఘన విజయం

నవతెలంగాణ-ముంబయి



సూర్యకుమార్ యాదవ్ (83, 35 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. సూర్య ప్రతాపానికి ఇషాన్ కిషన్ (42, 21 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు), నేహల్ వాదెర (52 నాటౌట్, 34 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) ధనాధన్ మెరుపులు జతకలవటంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై ముంబయి ఇండియన్స్ ఘన విజయం సాధించింది. 200 పరుగుల లక్ష్యాన్ని ముంబయి ఇండియన్స్ 4 వికెట్లు కోల్పోయి 16.3 ఓవర్లలోనే ఛేదించింది. ఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ (7) విఫలమయ్యాడు. ఓపెనర్ ఇషాన్ కిషన్ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడగా.. ఆ తర్వాత సంగతి సూర్యకుమార్ యాదవ్ చూసుకున్నాడు. నెహల్ వదెరాతో కలిసి మూడో వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యం నిర్మించిన సూర్య.. ముంబయి ఇండియన్స్‌కు సీజన్లో ఆరో విజయాన్ని అందించాడు. సూర్య ఆరు సిక్సర్లు, ఏడు బౌండరీలు బాదగా.. నేహల్ నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో దండెత్తాడు. బెంగళూర్ బౌలర్లలో హసరంగ, విజయ్‌కుమార్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 199 పరుగులు చేసింది.

గ్లెన్ మాక్స్‌వెల్ (68, 33 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సులు), డుప్లెసిస్ (65, 41 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) అర్థ సెంచరీలతో విరుచుకుపడ్డారు. విరాట్ కోహ్లి (1), అనుజ్ రావత్ (6)లు విఫలమైన వేళ బెంగళూర్ ఒత్తిడిలో పడింది. కెప్టెన్ డుప్లెసిస్, మాక్స్‌వెల్ మూడో వికెట్‌కు 120 పరుగులు జోడించి బెంగళూర్‌కు భారీ స్కోరు అందించారు. చివర్లో దినేశ్ కార్తీక్ (30, 18 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు.

ఐపీఎల్‌లో నేడు
చెన్నై X ఢిల్లీ
వేదిక : చెపాక్, సమయం : రా: 7.30
స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రసారం

లక్ష్యానికి ఆమడ దూరంలో 'ఉజ్వల'

చుక్కల్లో సిలిండర్ ధర....తగ్గిన సబ్సిడీ • ఇప్పటికీ కొందరికి కట్టెలు, పిడకలే ఆధారం

- అనారోగ్యానికి గురవుతున్న మహిళలు

న్యూఢిల్లీ : మహిళలకు కాలుష్యానికి తావులేని స్వచ్ఛమైన వంట గ్యాస్‌ను, తద్వారా ఆరోగ్యాన్ని అందించేందుకు తాము ప్రారంభించిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకం కుటుంబ వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని ప్రధాని మోడీ గొప్పగా చెప్పుకొచ్చారు. వంట కోసం సంప్రదాయిక పొయ్యి వాడే తన తల్లి పడుతున్న కష్టాలు చూసి చలించిపోయి మహిళల కన్నీరు తుడవాలన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించామని కూడా సుభాషితాలు వల్లెవేశారు. అయితే ఈ పథకం అమలవుతున్న తీరు, ప్రభుత్వ విధానాలను గమనిస్తే లక్ష్యానికి ఆమడ దూరంలో ఉన్నట్లు అర్థమవుతోంది. ప్రభుత్వం చెబుతున్న దాని కంటే అది విడుదల చేసిన సమాచారాన్ని పరిశీలిస్తే వాస్తవాలు బోధపడతాయి.



గ్రామీణ కుటుంబాలు, వెనుకబడిన తరగతుల వారికి ఇప్పటికీ వంట గ్యాస్ సరిగా అందుబాటులో లేదని 2019లో జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన సమాచారం స్పష్టం చేస్తోంది. మరో ఆశ్చర్యకరమైన విషయమేమంటే 47 శాతం కుటుంబాలు కట్టెలు, పిడకల పైనే వంట చేస్తున్నాయి. దీనివల్ల మహిళలు పొగ, హానికరమైన కాలుష్య కారకాల బారిన పడి దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారు. సంప్రదాయిక పొయ్యిలలో ఉపయోగించేందుకు కట్టెలు సేకరించే పని కూడా వారి పైనే పడుతోంది. దీంతో వారు విద్య, ఉద్యోగం, సకాలంలో వైద్యం వంటి కనీస సౌకర్యాలకు సైతం నోచుకోవడం లేదు. దీనికి భిన్నంగా పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న కుటుంబాలు వంట గ్యాస్‌నే వినియోగిస్తున్నాయి. పట్టణాలలో 86 శాతం మంది గ్యాస్‌ను వాడుతుంటే కేవలం 7 శాతం మంది మాత్రమే కట్టెలు, పిడకలు ఉపయోగిస్తున్నారు. గ్రామీణ భారతంలో ఎస్టీలలో మూడో వంతు, ఎస్సీలలో సగం మంది మాత్రం ఎల్పీజీని వాడుతున్నారు. ఓబీసీలలో 55 శాతం మంది, ఇతరులలో 59 శాతం మంది కూడా గ్యాస్‌నే ఉపయోగిస్తున్నారు. పట్టణ ప్రాంతాలలో ఉంటున్న ఎస్టీ, ఎస్సీలలో ఎక్కువ మంది మాత్రం ఇతర వనరులపై ఆధారపడుతున్నారు.

పీఎంయూవై పథకం విజయవంత మైందంటూ ప్రధాని చెబుతున్న మాటలకు, ఎన్ఎస్ఓ గణాంకాలకు పొంతన కుదరడం లేదు. 2019 మార్చి 31 నాటికి దేశంలో ఉజ్వల పథకం కింద 7.19 కోట్ల కనెక్షన్లు ఇచ్చారు. దీంతో దేశంలో ఎల్పీజీ వినియోగం 94.3 శాతానికి పెరిగింది. కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి 2021 ఫిబ్రవరిలో రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇస్తూ దేశంలో 99.5 శాతం మంది ఎల్పీజీ వాడుతున్నారని తెలిపారు. ఎన్ఎస్ఓ సర్వే మాత్రం ఇందుకు భిన్నమైన సమాచారం అందించింది. కుటుంబాలు ముఖ్యంగా గ్రామీణ కుటుంబాలు ఇప్పటికీ వంట కోసం ఎల్పీజీని తక్కువగానే వినియోగిస్తున్నారని ఆ సర్వే కుండబద్దలు కొట్టింది. కాగ్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. కాగ్ నివేదిక ప్రకారం ఎల్పీజీ సిలిండర్ల వినియోగం బాగా తగ్గింది. ఉజ్వల పథకం లబ్దిదారులలో చాలా మంది ఖాళీ సిలిండర్లను తిరిగి నింపుకోవడం లేదు. సగటు వార్షిక సిలిండర్ల వినియోగం తగ్గుతోందని నివేదిక చెబుతుంటే మంత్రి వర్యులు మాత్రం పెరు గుతోందని సెల విచ్చారు. ఉజ్వల లబ్దిదారులు ఖాళీ సిలిండర్లను అసలు నింపుకోకపోవడమో లేదా ఒకసారి మాత్రమే నింపుకోవడమో చేస్తున్నారు. దేశంలో సుమారు 8 కోట్ల లబ్దిదారులు ఉంటే వారిలో రెండు కోట్ల మంది ఖాళీ సిలిండర్లను పక్కన పెడుతున్నారు. లేదా కేవలం ఒకసారి మాత్రమే నింపుకుంటున్నారు. సిలిండర్ల ధరలు ఆకాశాన్ని అంటుతుండడమే దీనికి కారణంగా చెప్పవచ్చు. 2016 మార్చిలో ఢిల్లీలో సబ్సిడీ సిలిండర్ ధర రూ.513.50 ఉంది. 2020 మేలో సబ్సిడీని నిలిపేశారు. దీంతో వినియోగదారులు వెయ్యి రూపాయలకు పైగా వెచ్చించి మార్కెట్ రేటుకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఉజ్వల వినియోగదారులకు మాత్రమే సబ్సిడీ ఇస్తామని గత సంవత్సరం ప్రభుత్వం ప్రకటించినప్పటికీ సిలిండర్లను నిర్ణీత ధరకు కాకుండా ప్రతి సిలిండర్ పైన రూ.200 సబ్సిడీ ఇస్తోంది. దీంతో పేదలపై పెను భారం పడుతోంది. ఓ వైపు సబ్సిడీ తగ్గుతుంటే మరోవైపు సిలిండర్ల ధర పెరిగిపోతోంది. మార్కెట్ ధరకు, సబ్సిడీకి మధ్య వ్యత్యాసం భారీగా ఉంటోంది. వాస్తవ పరిస్థితులను గమనిస్తే చివరికి ఉజ్వల పథకం కూడా ఇతర ప్రభుత్వ గిమ్మిక్కుల జాబితాలో చేరిపోయినట్లే కన్పిస్తోంది.

బిల్కిస్ బానో కేసును సత్వరమే విచారించండి

సుప్రీంకోర్టుకు మేధావుల వినతి

న్యూఢిల్లీ : బిల్కిస్ బానో అభ్యర్థనపై సత్వరమే విచారణ జరపాలని పలువురు విద్యావేత్తలు, చరిత్రకారులు, హక్కుల కార్యకర్తలు సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు వారు ప్రధాన న్యాయమూర్తికి బహిరంగ లేఖ రాశారు. జీవితకాల శిక్ష పడిన 11 మంది ముద్దాయిలను గడువుకు ముందే విడుదల చేయడాన్ని బిల్కిస్ బానో న్యాయస్థానంలో సవాలు చేశారు. సుప్రీంకోర్టు ఇలాంటి కేసులను విచారించడానికి అనుమతించకపోతే ఈ దేశంలోని బాధిత మహిళలు ఎవరిని ఆశ్రయిస్తారని మేధావులు తమ లేఖలో ప్రశ్నించారు. 2002లో గుజరాత్‌లో జరిగిన మత ఘర్షణల సమయంలో 21 సంవత్సరాల గర్భిణి బిల్కిస్ బానోపై 11 మంది కామాంధులు లైంగిక దాడికి తెగబడ్డారు. అంతేకాక 14 మందిని హతమార్చారు. ఈ ఘటనకు సంబంధించి నేరస్తులకు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. అయితే గత సంవత్సరం ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం క్షమాభిక్ష విధానం కింద వారిని విడుదల చేసింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.